ఫిబ్రవరి-2026

# దర్శనమ్®

ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

₹ 51/- సంపుటి 22 సంచిక 5 ISSN 2582-2411







"శ్రీశ్రీ విధుశేఖరభారతి-అవధాన సంక్రాంతి" బ్రహ్మశ్రీ ఉప్పలధడియం భరతశర్మ శతావధానం దృశ్యమాలిక



# శ్రీచంద్రమౌళీశ్వర వర్ణమాలాస్తోత్రం



శ్రీశాత్మభూముఖ్యసురార్చితాంఘ్రిం
శ్రీకంఠశర్వాదిపదాభిధేయం
శ్రీ శంకరాచార్య హృదబ్జవాసం
శ్రీ చంద్రమౌలీశమహం నమామి 1

చండాంశుశీతాంశు కృశానునేత్రం
చండీశముఖ్యప్రమథేడ్యపాదం
షడాస్యనాగాస్యసుశోభిపార్శ్వం
శ్రీ చంద్రమౌలీశమహం నమామి 2

ద్రవ్యాదిసృష్టిస్థితి నాశహేతుం
రవ్యాదితేజాంస్యపి భాసయంతం
పవ్యాయుధాదిస్తుతవైభవం తం
శ్రీ చంద్రమౌలీశమహం నమామి 3

మౌలిస్ఫురజ్జహ్నుసుతాసితాంశుం
వ్యాలేశసంవేష్టితపాణిపాదం
శూలదినానాయుధశోభమానం
శ్రీ చంద్రమౌలీశమహం నమామి 4

లీలావినిర్ధూతకృతాంతదర్పం
శైలాత్మజాసంశ్రితవామభాగం
శూలగ్రనిర్భిన్నసురారిసంఘం
శ్రీ చంద్రమౌలీశమహం నమామి 5

శతైః శ్రుతీనాం పరిగీయామానం
యతైర్మునీంద్రైః పరిసేవ్యమానం
నతైః సురేంద్రైరభిపూజ్యమానం
శ్రీ చంద్రమౌలీశమహం నమామి 6

మత్తేభకృత్యా పరిశోభితాంగం
చిత్తే యతీనాం సతతం వసంతం
విత్తేశముఖ్యైః పరివేష్టితం తం
శ్రీ చంద్రమౌలీశమహం నమామి 7

హంసోత్తమైః చేతసి చింత్యమానం
సంసారపాథోనిధికర్ణధారం
తం సామగానప్రియమష్టమూర్తిం
శ్రీ చంద్రమౌలీశమహం నమామి 8

నతాఘహం నిత్యచిదేకరూపం
సతాం గతిం సత్యసుఖస్వరూపం
హతాంధకం హృద్యప్రరాక్రమం తం
శ్రీ చంద్రమౌలీశమహం నమామి 9

మాయాగతిం వీతభయం వినిద్రం
మోహాంతకం మృత్యహరం మహేశం
ఫాలానలం నీలగలం కృపాలుం
శ్రీ చంద్రమౌలీశమహం నమామి 10

మిత్రం హి యస్యాఖిలశేవధీశః
పుత్రశ్చ విఘ్నౌఘవిభేదదక్షః
పాత్రం కృపయాశ్చ సమస్తలోకః
శ్రీ చంద్రమౌలీశమహం నమామి 11

ఇతి చంద్రమౌలీశ్వరవర్ణమాలా స్తోత్రం సంపూర్ణం

# దర్శనమ్


ఆధ్యాత్మిక వార్తా మాస పత్రిక

**ఫిబ్రవరి 2026**

సంపుటి-22 విడిప్రతి: రూ. 51/- సంచిక - 5

**ISSN 2582-2411** పేజీలు 68



స్ఫూర్తిప్రదాత

**కీ.శే. మరుమాముల రాజమౌళిశర్మ**

గౌరవ సంపాదకులు

**యాయవరం చంద్రశేఖరశర్మ, ఆర్.వి.వి. కృష్ణారావు**

**మరుమాముల దత్తాత్రేయశర్మ**

ప్రధాన సంపాదకులు

**మరుమాముల వెంకటరమణశర్మ**

ప్రచురణకర్త, సంపాదకులు

**మరుమాముల రుక్మిణి**

సంపాదక మండలి

**డా. పూర్ణప్రజ్ఞా భారతి, అష్టకాల రామ్మోహన్**

**ఆకెళ్ల విభీషణ శర్మ, బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి**

**మరుమాముల రామచంద్రమూర్తి**

**ఆదరాసుపల్లి శశిధర్, ప్రసాదవర్మ కామఋషి**

ప్రత్యేక ప్రతినిధి

**పి.వి.ఎం. పవన్,** 81253 36958

ఉప సంపాదకులు

**రామలక్ష్మీ సుబ్రహ్మణ్యం**

ముఖచిత్రం : **హరి తాడోజు**



## దర్శనమ్

ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక



**-: ప్రధాన కార్యాలయం : -**

ఇం.నెం. **29-105/4/1**, శ్రీరామ సిద్ధాంతి భవనం

న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్-56

ఫోన్, ఫ్యాక్స్: 9441015469

**e-mail: darshanameditordesk@gmail.com**


దర్శనం దర్శనారామ దర్శనం సమదర్శనం
దర్శనం లోక వృత్తాంతాదర్శ దర్శిన్యపేక్షితమ్ ॥
దర్శనాంతర్ముఖ స్పర్శి సద్విమర్శావమర్శనం
దర్శన ప్రతిభూస్థానం జీయాత్ సర్వ నిదర్శనమ్ ॥

**- అష్టకాల నరసింహరామశర్మ**

'దర్శనం దర్శితం యేన దర్శితం సర్వదర్శనమ్
దర్శనం శర్మసంధాతృ దర్శనం దైవదర్శనమ్'

**- అయాచితం నటేశ్వరశర్మ**

## ఈ సంచికలో ...


హరహర శంభో.. గిరిజాబంధో ... 7
- చిల్లర సీతారామారావు
వజ్రోత్సవ భారతి.. శతావధాన సంక్రాంతి ... 10
- ఉప్పలపాటి కుసుమకుమారి
ఉప్పొంగిన పద్యప్రభంజనం ... 16
- వనం జ్వాలా నరసింహారావు
జ్యోతిర్విద్వాంసులకు గండపెండేర సత్కారం ... 19
అప్పాజోస్యులవారి ఈశ్వర దర్శనం ... 22
- కొప్పరపు నారాయణమూర్తి
మన ప్రయత్నమే దేవుడు ... 26
- మామిడాల పండరినాథ్
సనాతన ధర్మం... సాధికారిక గ్రంథం ... 29
- తాడేపల్లి పతంజలి
క్షయ సంవత్సరం.. బార్హస్పత్యమానం ... 32
- డా. శంకరమంచి రామకృష్ణ శాస్త్రి
శ్రీమద్దేవీ భాగవతం - డా. వద్దిపర్తి పద్మాకర్ ... 34
మహాభారత సారసంగ్రహం ... 36
- కీ.శే. డా. పుల్లెల శ్రీరామచంద్రుడు
తిరుమల చరితామృతం - కీ.శే. పివిఆర్‌కె ప్రసాద్ ... 38
రామాయణం రసరమ్యం ... 40
- వనం జ్వాలా నరసింహారావు
అభినవ శంకర విజయం ... 42
- మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
అచ్యుతాష్టకమ్ - తాడేపల్లి పతంజలి ... 44
మహాతపస్వి చంద్రశేఖర భారతి ... 46
- చెఱుకుపల్లి జమదగ్ని శర్మ
పాపాలను తొలగించే పవిత్ర గంగ ... 48
- వి.వి. సత్యప్రసాద్
ఆర్షధర్మంపై అన్యుల విషం - డా. కె.అరవిందరావు ... 52
శృంగేరి శారదాపీఠ వైభవం ... 56

# అహంకార వైఖరి... సనాతనధర్మంపై గురి!

పట్టువదలని విక్రమార్కుడు ఎప్పటిలాగానే మళ్లీ బేతాళుని భుజాన వేసుకుని నడిచినట్లు, మనం కూడా ఎప్పటిలాగానే గతమాసంలో జరిగిన కొన్ని ప్రముఖ సంఘటలను, వాటి నుంచి హిందువులు నేర్చుకోవలసిన పాఠాలను గమనిద్దాం. గత మాసంలో ప్రయాగక్షేత్రంలో మాఘమేళ నిర్వహింపబడింది. ఈ మేళలో మౌని అమావాస్య నాడు బ్రహ్మముహూర్తం నుండి శుక్లప్రతిపద వచ్చేవరకు ప్రయాగతీర్థంలో పుణ్యస్నానాలు చేయడం ఒక సంప్రదాయంగా తరతరాలుగా అమలులో ఉంది. ఈసారి ఈ మౌని అమావస్య ఆదివారం నాడు రావడం వల్ల అది రవి-మౌని అమావాస్యగా మరింత పవిత్రంగా భావించబడింది. అంతేకాదు మకరంలో సూర్యుడు, చంద్రుడు, అంగారకుడు, బుధుడు, శుక్రుడు ఉన్న పంచగ్రహ యోగం కూడా ఈ సంవత్సరపు పుణ్యస్నాన సందర్భాన్ని మరింత పవిత్రంగా మార్చింది. ఒక యోగి నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వం ఎంతో శ్రద్ధతో ఈ పర్వస్నానాలకు ఏర్పాట్లను చేసింది. 15000 రక్షకభటుల్ని, 1524 సిసి కెమెరాలను రక్షణపర్వంలో భాగంగా చేసి ఏర్పాట్లు చేసింది. భక్తులు కూడా గత సంవత్సరం కన్నా ఎక్కువగానే ఈ పుణ్యస్నానాలలో పాల్గొన్నారు. గత సంవత్సరం 3.5 కోట్ల మంది పుణ్యస్నానాలు చేయగా ఈ సంవత్సరం 4.36 కోట్ల మంది పుణ్యస్నానాలు చేశారు. హిందువుల్లో తమ ఆచారాల పట్ల పెరుగుతున్న ఆదరణకు ఇది ఒక మంచి ఉదాహరణ అని చెప్పవచ్చు. ఇలా ఆదరణ పెరిగిపోతున్నందుకు ఆనందించాలో, అదే సమయంలో జరిగిన వివాదానికి, ప్రభుత్వాధికారులు వాదించిన ధోరణికి బాధపడాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఆ ఘటనను పరికిద్దాం.

ఆదిశంకర భగవత్పాదులు భారతీయ వేదాంతజ్ఞాన ప్రచార ప్రసారాల కోసం దేశవ్యాప్తంగా నాలుగు ప్రధాన మఠాలను స్థాపించారు. అందులో బదరీ ద్వారకా పీఠం ఒకటి. ఆ పీఠానికి స్వరూపానంద సరస్వతీ స్వాములవారు పీఠాధిపత్యం వహించి, 2022లో శివైక్యం చెందారు. బదరీ జ్యోతిష్పీఠానికి అవిముక్తేశ్వరానంద సరస్వతి స్వామివారు, ద్వారకా పీఠానికి సదానంద సరస్వతీ స్వామివారు పీఠాధిపత్యం స్వీకరించారు. ఈ అవిముక్తేశ్వరానంద సరస్వతీస్వాముల వారు మౌని అమావాస్య సందర్భంగా ప్రయాగ పుణ్యస్నానానికి శిష్యసమేతులై తమ రథంపై బయలుదేరారు. స్నానఘట్టాల వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. వారిని రథం వదిలి కాలినడకన పొమ్మన్నారు. శిష్యులు తమ స్వామి పల్లకిలో లేదా రథంపై పుణ్యస్నానానికి పోవడం పరంపరగా వస్తున్న ఆచారమని చెప్పారు. శిష్యులకు పోలీసులకు మధ్య మాటా మాటా పెరిగింది. పోలీసులు తమ ప్రతాపాన్ని చూపారు. 30 మంది శిష్యులకు గాయాలయ్యాయి దాంతో అవిముక్తేశ్వరానంద స్వాములవారు పుణ్యస్నానం చేయకుండానే తమ శిబిరానికి వెనక్కి వెళ్లిపోయారు. అక్కడ ప్రభుత్వాధికారుల ధోరణి పట్ల తమ అసమ్మతి వ్యక్తం చేశారు.


ఇంతటితో ఇది ముగిస్తే మనదేశం లౌకికదేశంగా ఎలా మిగిలిపోతుందని భావించినట్లున్నారు అధికారులు. వెంటనే అర్ధరాత్రి స్వామివారి శిబిరానికి రెండు నోటీసులు ఒకదాని వెంట ఒకటిగా పంపారు. మొదటి నోటీసులో జ్యోతిష్పీఠాధిపత్యాన్ని ప్రశ్నిస్తూ, రెండో నోటీసులో భద్రతా నియమాలను ఉల్లంఘించారు కనుక 24 గంటల్లో సంజాయిషీ ఇవ్వకపోతే మీ శిబిరాన్ని ఎత్తివేస్తామని హెచ్చరించారు. ఈ ఘటనలో మనం శంకరాచార్య పీఠంపై అవిముక్తేశ్వరానంద సరస్వతీ స్వాములవారు విరాజమానులై ఉండడమనే విషయాన్ని కాదు చర్చించాల్సింది. అసలు హిందూ ధార్మికమైన ఒక పీఠానికి ఎవరు శంకరాచార్యులుగా ఉండాలి, పట్టాభిషేకోత్సవం జరగడం అనేది సర్వోన్నత న్యాయస్థానం తేల్చే అంశమా లేక భక్తులు తేల్చుకునే అంశమా అనేది చర్చించాలి. ఇదే సర్వోన్నత న్యాయస్థానం గాని, దాని అనుషంగికమైన రాష్ట్ర న్యాయస్థానాలు గాని ఎడారి మతాధికారుల నియామకంలో గాని, తెల్లమతాధికారులు విషయంలో గాని కలగజేసుకునే ధైర్యాన్ని ప్రదర్శిస్తున్నాయా అన్నది గమనించాల్సిన అంశం.

సరే.. అది మన లౌకికదేశంలో సహజం కనుక వదిలేద్దామనుకున్నా పోలీసులు అసలు శంకరాచార్య అనే పదవీనామాన్ని నువ్వేట్లా పెట్టుకుంటావని స్వామిజీకి నోటీసులు ఇచ్చే అధికారం వారికెక్కడిది? అది వారికి సంబంధం లేని అంశం. అసలు అవిముక్తేశ్వరానంద స్వామివారితో సహా అనేకమంది యతులు, సాధువులు మౌని అమావాస్య స్నానం విషయంలో పోలీసుల దుందుడుకు చర్యల వల్ల ఇబ్బందిపడ్డ ఉదంతం గర్హనీయం. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిశ్చేష్టురాలవడాన్ని సాధుసంతులు తీవ్రంగా నిరసించారు. ముందుచూపు, తగిన ప్రణాళిక, స్వామీజీల పట్ల సంప్రదాయబద్ధమైన ఏర్పాట్లు చేసివుంటే ఈ ఉదంతానికి ఆస్కారం ఉండేది కాదు.

ఇక మరో సంఘటన విషయానికి వస్తే హిందూవ్యతిరేకతే తమ గుర్తింపుగా ఉన్న తమిళనాడు **(మిగతా 58వ పేజీలో)**

# పాఠక దర్శిని

మీ అభిప్రాయాలను darshanameditordesk@gmail.comకు పంపగలరు.




## కనుల విందుగా సంక్రాంతి ఆనందాలు

'ఆనంద పరవళ్లు... అందాల పల్లెటూళ్లు... సంక్రాంతి శోభకు ఆనవాళ్లు' శీర్షికతో ఇచ్చిన పెద్ద పండుగ సంక్రాంతి వ్యాసం మాకు నచ్చింది. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, రంగు రంగుల ముగ్గులతో పల్లెటూళ్లు కళకళలాడతాయి. పిండివంటలు, గాలి పటాలు, కోడి పందేలు వంటి వాటితో ఈ పండుగ రోజులు సరదాగా గడుస్తాయి అంటూ ఆచార వ్యవహారాలను చాలా చక్కగా వివరించారు ఈ వ్యాసంలో. ఉత్తరాయణ పుణ్యకాలంలో ప్రవేశిస్తున్నట్టుగా సూర్యుని ముఖచిత్రం ఆకట్టుకుంది. నాగఫణి శర్మ గారికి 'దర్శనమ్' 21వ వార్షికోత్సవం సందర్భంగా 'గురుసత్కారం' నిర్వహించడం ముదావహం. ఆ కార్యక్రమాన్ని చక్కని చిత్రాలతో, కథనంతో పాఠకులకు కనుల విందుగా అందించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం 'దర్శనమ్' పత్రికకే చెల్లింది.

**- కాకర్ల దయాకర్, విజయవాడ**

## ప్రతి దానికీ కోర్టుకెళ్లాలా...?

'ఇంట ధర్మ విరోధులు... బయట ఉగ్ర బాంధవులు శీర్షికతో ఇచ్చిన సంపాదకీయం అలరించింది. హిందువుల ఆలయాలలో ఎప్పటినుంచో పాటిస్తున్న ఆచారాల కోసం కూడా కోర్టు మెట్లెక్కాల్సి రావడం దురదృష్టం. అలాగే నిజమైన చరిత్ర తెలుసుకోవడం కూడా తప్పే అంటున్నారు. ఈ విధానాలు మారాలి. 'ఆర్షధర్మంపై అన్యుల విషం' ధారావాహికలో చాలా విషయాలు తెలుస్తున్నాయి. ధర్మజిజ్ఞాస, వేదాల్లో విజ్ఞానాంశాల వంటివి పాఠకులను చైతన్యపరుస్తున్నాయి. దేవీ భాగవతం, మహాభారత సారసంగ్రహం, తిరుమల చరితామృతం ఆకట్టుకుంటున్నాయి.

**- జి. నాగేశం, నల్గొండ**

## అవధాన దర్శనం అయింది

'నెలనెలా సాహితీ వెన్నెల' శీర్షికతో నిర్వహించిన నల్లాన్ చక్రవర్తుల సాహిత్ అష్టావధాన వివరాలు ఆకట్టుకున్నాయి. సనాతన ధర్మానికి 'అవధానం' ఒక ఆలంబన అనడం చాలా బాగుంది. అనేక విషయాలు ఈ అవధానంలో భాగమయ్యాయి. అలాగే ధర్మం కోసం పాటుపడుతున్న వారిని 'సనాతన దత్తబంధు' పురస్కారాలతో సమున్నతంగా గౌరవించడం బాగుంది. శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారు ఈ పురస్కారాలను అందజేయడం మరింత విశేషం.

**- తాడేపల్లి భావన, హైదరాబాద్**

### 'దర్శనమ్' చందా వివరాలు

| | |
|---|---|
| 3 సంవత్సరాలకు | రూ. 2000 |
| 6 సంవత్సరాలకు | రూ. 4000 |
| 12 సంవత్సరాలకు | రూ. 8000 |
| రాజపోషకులు | రూ. 15000 |
| మహారాజ పోషకులు | రూ. 25000 |
| విశిష్ట మహారాజ పోషకులు | రూ. 100000 |

**A/C NAME : DARSHANAM**
**BANK: CANARA BANK**
**A/C NO. 120001974779**
**IFSC CODE: CNRB0013063**

## చందాదారులకు విజ్ఞప్తి

'దర్శనమ్' ధార్మికోద్యమ మాసపత్రిక సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యంగా వెలువడతున్న ఈ పత్రికకు చందాలు, విరాళాలు అందించవలసిందిగా ప్రార్థన. ఈ నెలతో ముగియనున్న తమ చందాలను వెంటనే పునరుద్ధరించుకోవలసిందిగా మనవి. **ఎడిటర్, దర్శనమ్** పేరుతో చెక్కు/డిడి/మనియార్డరు/ఆన్‌లైన్‌లో చందాలను పంపాల్సిందిగా విజ్ఞప్తి. మీరు ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు చిరునామాలను స్పష్టంగా పిన్‌కోడ్‌తో సహా రాయవలసిందిగా కోరుతున్నాం. చిరునామా మారితే తక్షణం తెలియజేయండి. **- ఎడిటర్**

మహాశివరాత్రి... మాఘ బహుళ చతుర్దశి రోజున వచ్చే ఈ పర్వదినం ఆస్తికలోకానికి ఎంతో ప్రశస్తమైనది. పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జరిగిన రోజే కాకుండా శివుడు తాండవమాడిన రోజుగా ప్రసిద్ధి. నియమనిష్ఠలు, తపస్సు, యోగా ధ్యానంతో ఈ రోజు ఆరాధిస్తే మహాదేవుడి అనుగ్రహం కలుగుతుందని పురాణోక్తి. రోజంతా ఉపవాసం, రాత్రి జాగారంతో నిష్ఠగా భక్తకోటి అభిషేకాలు, అర్చనలు, రుద్ర హోమాలతో శివుడిని కొలుస్తారు. ప్రతి శివాలయం 'ఓం నమః శివాయ' నామస్మరణతో మారుమోగుతుంది.




"పాపోత్పాప విమోచనాయ రుచిరైశ్వర్యాయ మృత్యుంజయ
స్తోత్ర ధ్యాననతి ప్రదక్షిణ సపర్యాలోకనాకర్ణనే
జిహ్వాచిత్త శిరో2ఘ్రిహస్తనయన శ్రోత్రైరహం ప్రార్థితో
మమాజ్ఞాన యాతన్నిరూపయా ముహుర్మామెవనూమేవచః"

ఓ సర్వేశ్వరా! నేను పాపమును పోగొట్టుకోవడానికి మోక్షం సంపాదించుకోవడానికి, నీ స్తుతియందు జిహ్వను, ధ్యానమున మానసమును ప్రణమిల్లుట యందు శిరస్సును, ప్రదక్షిణమున చరణాలను, అర్చనయందు హస్తములను, చూచుట యందు నేత్రములను, వినడమున కర్ణములను ఉండేలా ఆజ్ఞాపించమని కోరుతున్నాను. నీ ఆజ్ఞను పాటించేలా నన్ను ఉత్సాహపరచుము.

అత్యంత మాధుర్యమును కలిగిన నామము, ముక్తిని ప్రసాదించే నామము, పలుకుటకు సులభముగా ఉండే నామము, స్మరించగానే తన్మయత్వము కలిగించే నామము పరమేశ్వర నామము. పరమేశ్వరునకు శంకరుడు, శంభుడు, త్రినేత్రుడు, శివుడు, మహేశ్వరుడు మున్నగు పలు నామములున్నను భక్తులకు అత్యంత ప్రియమైన నామము శివ. శివ అను రెండక్షరములలో 'శ' అను అక్షరమునకు నశింపజేయుట అని అర్థము. 'వ' అను అక్షరమునకు ముక్తిని ప్రసాదించుట అని అర్థము. శివ అనగా పాపములను నశింపజేసి ముక్తిని ప్రసాదించే నామము గనుక శివనామము శుభప్రదము.



చిల్లర
సీతారామారావు

శివుడికి సంబంధించిన పండుగ మహాశివరాత్రి. మాఘ బహుళ చతుర్దశి నిశిరాత్రినాడు శివుడు భక్తుల ఉపాసనా సౌలభ్యం కోసం లింగాకృతిగా ఆవిర్భవించాడు. శివుడు లింగరూపధారిగా అవతరించిన నిశిరాత్రిని శివరాత్రిగా భక్తులు పిలుచుకుంటారు. రాత్రి అనగా సుఖమును ప్రసాదించునది అని అర్థము. సర్వులకు ఆనందమును కలిగించునది రాత్రి. సర్వులకు ఆశ్రయదాత్రి అయిన రాత్రిని స్తుతించడం అంటే ప్రకృతి స్వరూపిణి అయిన దుర్గాదేవిని, శివాదేవిని స్తుతించడమే. ఆనందప్రదాయిని అయిన రాత్రి శివనామంతో విశిష్టమైన సంబంధము కలిగి శివరాత్రి అయ్యింది. శివరాత్రి మహిమాన్వితమైనది. శివరాత్రిని భక్తిశ్రద్ధలతో ఆచరించాలి. శివరాత్రి నాడు ఉపవాసము, జాగరణములతో శివుడిని ఆరాధిస్తే సమస్త పాపములు నశించిపోయి తుదకు మోక్షము ప్రాప్తిస్తుంది.



మాఘ బహుళ చతుర్దశి నిశిరాత్రి నాడు శివుడు లింగమూర్తిగా ఆవిర్భవించాడు. లింగము నిరాకార రూపము. ''లీయతిగమ్యతే ఇతి లింగః'' అనగా 'లిం' అంటే మన కంటికి కనిపించకుండా, లీనమైయున్న దానిని 'గం' అంటే ఒక గుర్తు రూపంలో ఉన్న దానిని తెలియజేస్తుంది. లింగ శబ్దమునకు చిహ్నము, లేక లక్షణము అనే అర్థాలు ఉన్నాయి. ప్రకృతి వికృతులు రెండూ లింగమేయని సాంఖ్య దర్శనము తెలియజేయుచున్నది. లయం ప్రళయంగావడం చేత లింగము అని చెప్పబడుతున్నది. ప్రళయాగ్నిలో సర్వమూ భస్మమై శివలింగములో చేరుతుంది. శివుడు లింగముగా ఆవిర్భవించడానికి సంబంధించిన కథ ఒకటి శివపురాణము పేర్కొన్నది.

స్వర్గలోకమున ఒకనాడు ఒక సమావేశం జరిగింది. ఆ సమావేశమునకు బ్రహ్మ, విష్ణు, శివుడు దేవతలు మున్నగువారంతా సమావేశమునందు పాల్గొన్నారు. బ్రహ్మ విష్ణువులకు ఎవరు అధికులు అన్నదాని మీద చర్చించుకొనసాగారు. ఈ చర్చకు మూలకారణం వారిరువురూ శివుని మాయకు లోబడటమే. బ్రహ్మ, విష్ణువుల మధ్య చర్చ పోరుగా మారిపోయింది. బ్రహ్మ పాశుపతాస్త్రంతోను, విష్ణువు మహేశ్వరాస్త్రంతోనూ తలపడసాగారు. ఆ పోరుకు లోకాలు జ్వలితమవసాగాయి. దేవతలు భయపడిపోయి శివుడిని శరణు వేడుకున్నారు. శివుడు వారికి అభయమిచ్చి పంపివేశాడు. పిదప బ్రహ్మ, విష్ణువుల మధ్య జ్యోతిర్లింగంగా ప్రత్యక్షమయ్యాడు. ఆ లింగము (స్తంభము)ను చూచి వారిరువురూ ఆశ్చర్యచకితులయ్యారు. వారు చూస్తూ ఉండగానే వారి ఆయుధములు శివలింగములో విలీనమయ్యాయి. శివుడు ప్రత్యక్షమై లింగము యొక్క ఆద్యంతములు కనుగొనిన వారు అధికులు అని చెప్పాడు. బ్రహ్మ విష్ణువులు లింగము ఆద్యంతములు కనుగొనడానికి బయలుదేరారు. బ్రహ్మ ఆదిభాగము వైపు, విష్ణువు అంత్య భాగమువైపు పయనమై వెళ్లారు. కాని వారు తమ ప్రయత్నంలో విఫలులయ్యారు. తమ గర్వాన్ని అణచడానికే శివుడు లింగరూపంలో ఆవిర్భవించాడని అర్థం చేసుకున్నారు. వారిరువురు శివుడిని ప్రార్థించారు. నా పరబ్రహ్మ తత్త్వాన్ని నిరూపించుకోవడానికే నిరాకారము, నిర్గుణము, నిరుపమానము అయిన లింగాకృత రూపమున దర్శనమిచ్చాను అని పలికి అదృశ్యమైనాడు శివుడు.





నిశిరాత్రి నాడు ఆవిర్భవించి మహాలింగమును రాత్రి నాలుగు జాములు దుగ్ధము, దధి, ఘృతము, మధుతో అభిషేకించాలి. శివరాత్రి రోజున వేకువఝాముననే లేచి స్నానాదికములు పూర్తి గావించుకొని శివాలయమునకు వెళ్ళాలి. శివుడిని దర్శించుకొని శివుడికి అభిషేకం జరిపించాలి. వెయ్యి పార్థివలింగాలకు చేసే అర్చనను సహస్ర లింగార్చన అని అంటారు. మూడువందల అరవైకి పైగా లింగాలకు చేసే అర్చన మహాలింగార్చన అని అంటారు. రుద్ర నమకాలతో అభిషేకిస్తే రుద్రాభిషేకం అంటారు. శివుడిని అర్చన చేయడం వల్ల అన్ని పనులు నెరవేరుతాయి. అన్ని దరిద్రాలు, రోగాలు, పీడలు నశించిపోతాయి. శత్రువుల వలన కలుగు భయాలు, చతుర్విధ పాపములు సమస్తమూ నశించిపోతాయి. స్వర్గసుఖాలు కలుగుతాయి. ముక్తి లభిస్తుంది.

శివరాత్రి పూజకు ఉపవాసము, జాగరణము, అభిషేకము- ఈ మూడూ చాలా ముఖ్యము. ఈ మూడు పద్ధతుల ద్వారా శివుడిని ఆరాధించిన వారికి అనంతమైన పుణ్యరాశి ప్రాప్తిస్తుంది.

ఒక వ్యాధుడు తనకు తెలియకుండానే శివరాత్రి నాడు ఉపవాసముండి, జాగరణ చేసి, శివుడిని అభిషేకించి, తత్ఫలితంగా శివలోకమునకు చేరుకున్న కథ శివపురాణమునందున్నది. దానిని సంక్షిప్తంగా స్మరించుకుందాం.

ఒక వ్యాధుడు వేట కోసం అడవికి బయలుదేరి వెళ్లాడు. ఆ రోజు శివరాత్రియని, అతనికి తెలియదు. మృగాలను వేటాడుతూ అలసిపోయాడు. అలసట తీర్చుకోవడానికి ఒక చెట్టు కింద సేదతీరుతూ నిద్రలోకి జారిపోయాడు. నిద్ర నుండి మేల్కొనే చూసే సరికి చీకట్లు ముసురుకుంటున్నాయి. ఆ సమయంలో ఇంటికి బయలుదేరి వెళ్లడం మంచిది కాదని భావించాడు. చెట్టు కిందనే శయనించితే జంతువులకు ఆహారమవుతానేమోయని భయపడి చెట్టు పైకి వెళ్లి ఒక కొమ్మను ఆధారం చేసుకుని కూర్చున్నాడు. అతడు ఎక్కిన చెట్టు అశ్వత్థవృక్షము. ఆ వృక్షపు మొదట్లో ఒక శివలింగము ఉన్నది. ఆ లింగము మీద ఆకులు పడి ఉండడం చేత ఆ లింగము ఎవ్వరికీ కనిపించలేదు.

వ్యాధుడు ఉదయము వేటకు వస్తున్నప్పుడు ఏమీ తినకుండా వచ్చాడు. అందువలన అతనికి ఉపవాసఫలము లభించింది. మంచుబిందువులు ఆకుల మీద పడి, అక్కడి నుంచి జారి వాధుడి శరీరాన్ని తాకుతూ క్రిందికి జారి శివలింగము మీద పడసాగాయి. దీనివలన వ్యాధునకు శివునకు అభిషేకం జరిపిన ఫలం ప్రాప్తించింది. రాత్రంతా నిదురపోకుండా ఉండడం చేత జాగరణ ఫలం లభించింది. ఈ విధంగా వ్యాధుడు ఎన్ని దుష్కృత్యములు గావించినా, శివరాత్రి నాడు తనకు తెలియకుండానే ఉపవాసము, జాగరణము, అభిషేకము మున్నగునవి జరిగినందు వలన, వ్యాధునకు అంత్యకాలమున శివలోకం ప్రాప్తించింది.

శివార్చనకు మంత్రములు రాకున్నా ఫరవాలేదు. 'శివాయ నమః' అను పంచాక్షరములను పలుకుతూ శివుని ధ్యానించి అభిషేకించి, మారేడు, జిల్లేడు, ఉమ్మెత్త, తుమ్మి, తులసీదళాలతో శివుడిని పూజిస్తే, శివానుగ్రహము తప్పక ప్రాప్తిస్తుంది. శివార్చన గావించేటప్పుడు రుద్రాక్షలు, విబూది ధరించి శివుడిని అర్చించాలి. శివనామం సర్వమంగళప్రదం. ఎంతటి నిరుపేద అయినా నిత్యం శివనామాన్ని జపిస్తూ శివుడిని అర్చిస్తే సమస్త సంపదలు లభిస్తాయి. ఆనందముగా జీవనము సాగిపోతుంది. మహాశివరాత్రి నాడు ఉపవాస, జాగరణ, అభిషేకాలతో శివుడిని ఆరాధించుకుంటూ, శివనామస్మరణ గావించుకుంటూ, శివుడి అనుగ్రహం పొందుతూ జీవితాన్ని సార్థకం చేసుకుందాం.

"శివేతిచ శివయస్యవాచిప్రవర్తతే
కోటిజన్మార్జితం పాపం తస్యనశ్యతి నిశ్చితమ్"

శుభప్రదమైన శివనామాన్ని నిత్యం స్మరించుకుంటే, కోటి జన్మల పాపములు సైతం నశించిపోతాయి. ఇది తథ్యము.




# వజ్రోత్సవ భారతి శతావధాన సంక్రాంతి

## సాహితీ రసఝరులను అలరించిన అవధాన బాలభాస్కర ఉప్పలధడియం భరతశర్మ శతావధానం

వజ్రోత్సవ భారతి... దక్షిణామ్నాయ శృంగేరి శారదాపీఠం జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామివారి 75వ వర్ధంతి మహోత్సవాల నేపథ్యంలో దేశమంతా విశేష కార్యక్రమాలు జరుగుతూ ఉన్నాయి. ఈ సందర్భంగా దర్శనమ్ విశేష సారస్వత కార్యక్రమాలను నిర్వహిస్తూ జగద్గురువులకు ప్రణతులను అందిస్తోంది. జగద్గురువుల వజ్రోత్సవ భారతి సందర్భాన ఉత్తరాదిన కాశీలోని మెహమూర్ గంజ్ శంకరమఠంలో త్రిభాషా సహస్రావధాని వద్దిపర్తి పద్మాకర్ గారి శతావధానం నిర్వహించగా, దక్షిణాదిన భాగ్యనగరంలో అవధాన బాలభాస్కర, శతావధాన తిలక, యువ విద్వన్మణి బ్రహ్మశ్రీ ఉప్పలధడియం భరత శర్మ శతావధానాన్ని దర్శనమ్ ఘనంగా నిర్వహించింది. జగద్గురువుల దివ్యాశీరనుగ్రహంతో 'వజ్రోత్సవభారతి-అవధాన సంక్రాంతి' శీర్షికన ఈ కార్యక్రమం ఒక గొప్ప సాహిత్యోత్సవంగా సాగింది. అందుకు భాగ్యనగరంలోని బొగ్గులకుంట సారస్వత పరిషత్ వేదిక అయింది. శ్రీ భారతీతీర్థ ప్రాంగణంగా విరాజిల్లిన వేదిక ఆధ్యాత్మిక ధార్మికవేత్తలు, కవి పండితులు, అవధానులతో జనవరి 9, 10 తేదీల్లో అంగరంగ వైభవంగా వెలుగొందింది. అద్భుత ధారణ, ధిషణ, సద్యస్ఫూర్తితో మధుర గానంతో హృద్యమైన పద్యాలను అందించి భరత శర్మ తన నాలుగవ శతావధానాన్ని పండితలోకం ప్రశంసలు అందుకున్నారు.

శతావధానం- వజ్రోత్సవభారతి, శోభాయాత్రతో ఆరంభం అయింది. కవిపండితులు, ప్రాశ్నికులతో శోభాయాత్ర దేవాదాయ శాఖ కార్యాలయం నుండి, సారస్వత పరిషత్తు దాకా జయజయధ్వానాలతో ఆరంభమయింది. ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి. రమణాచారి, మహామహోపాధ్యాయ, ప్రాచార్య బ్రహ్మశ్రీ డా. శలాకరఘునాథశర్మ, ప్రారంభసభలో పాల్గొని జ్యోతి ప్రకాశనం చేసారు. బ్రహ్మశ్రీ ఉప్పలధడియం భరత శర్మ శతావధానం భాగ్యనగర వాసులకు సాహిత్యపు విందు చేసింది. భరత శర్మ వయస్సు 19 ఏళ్ళే. కాని, ఆయన ఇప్పటి వరకు చేసిన అష్టావధానాల సంఖ్య మాత్రం 91. అలాగే, 3 శతావధానాలు కూడా ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ వేదికలపై చేసి పేరు గాంచారు.

మరుమాముల సోదరుల ఈ సాహితీ ధార్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకో గలగటం ఒక సుకృతంగా భావిస్తుంటాను. ఈసారి కూడా దత్తపది అంశంలో ప్రాశ్నికురాలి హోదాతో తెలంగాణ సారస్వత పరిషత్తులో కాలుపెట్టాను. సాహిత్యపు విందు ఒక పక్కయితే, పండితోత్తములు, పరమ భాగవతోత్తములతో కలిసి రెండు రోజులు ఆత్మీయంగా సద్గోష్టి నెరపగలిగే అవకాశం రావడం మరొక విందు! కుశల పరామర్శలతో ఉపాహార సేవనం చేసి (ఇడ్లీ, సాంబారు, కారప్పొడి, నెయ్యి! శక్తి ఉన్నవాళ్ళకి అదనంగా గోధుమరవ్వ ఉప్మా) ఆత్మారాముడికి ఉపశమనం కలిగించి, ఉప్పలధడియం భరతశర్మ సభలో అందరం ఆసీనులమయ్యాం.

ఈ రెండు రోజులూ సభా ప్రారంభానికి ముందుగా సభక్తి పూర్వకంగా గురువందన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథి మాన్యులు, రమణాచారి అవధానిని పుష్పమాలాలంకృతులను చేసి 'శ్రీరామరక్ష'ని ఆశీస్సులు కూడా అందించారు. 'మరి నేను భరతుడిని కదా! నాకు శ్రీరామరక్ష తప్పకుండా కావాలని' అవధాని వెంటనే చమత్కరించటం రసజ్ఞులైన సభాసదులకు ఎంతో ఆనందపరిచింది. మొదటగా రమణాచారి ఒక ఆశువుని కూడా అందించి శుభారంభం చేసారు.





ఆనాటి సభకి సంచాలకత్వం వహించి సంచలనం సృష్టించిన ప్రణవపీఠ వ్యవస్థాపకులు, అభినవశుకులు, గురువులు త్రిభాషా సహస్రావధాని డా. వద్దిపర్తి పద్మాకర్ గారు సభలో ఆసీనులు కాగానే భరతశర్మ శతావధానం మొదలైంది. ముందుగా శతావధాని ఇష్టదేవతా ప్రార్థన! ఆహా ఏమి పద్యాలండి! చెవుల తుప్పు వదిలిపోయింది. అవి ప్రౌఢసమాస భరితాలు! భావరస పరిపూరాలు! సుస్వరరాగ సుశోభితాలు! మరీను భరతశర్మ తల్లిదండ్రుల మీద చెప్పిన పద్యాలు వింటుంటే నాకైతే కళ్ళు చెమ్మగిల్లాయి. గుండెని తడిపేసినయ్యి. తన తల్లి గురించి చెబుతూ 'ధన్వంతరి సూక్ష్మరూపుడయి వర్ధిలుచుండునా నీ కరంబులన్' అని అనడం ఎంత గొప్ప ఊహ! కేవలం 19 ఏళ్ల యువకుడైన భరత శర్మ ప్రజ్ఞ పూర్వజన్మ సుకృతమే!

ఆనాటి సభకి అధ్యక్షత వహించినవారు కళారత్న, అవధాన విద్వాన్మరాళ ఆముదాల మురళిగారు, గౌరవ అతిథిగా విఖ్యాత విమర్శకులు డా. సంగనభట్ల నరసయ్యగారు! అవధానిగారు నోరు తెరవగానే అమరభాష అమృతరసవృష్టిగ సభాసదులను ఆసాంతం తడిపేసింది.

శతావధానం మొట్టమొదటిగా సమస్యలతో ప్రారంభమైంది. ఏం చెప్పమంటారు! ఆసీనులైన వారు సాక్షాత్తు అవధాన సరస్వతులు! ఉభయభాషలలో పాండిత్యం కలిగిన ఉద్దండులు! మొట్టమొదటి సమస్య మాన్యులు శలాక రఘునాథశర్మ గారు. 'దున్నన్జేయుము దున్నజేయకుము సంతోషంబు నిండారగా!' అని ఇచ్చారు. ఈ సమస్యకు అవధాని భరత శర్మ వెనువెంటనే నాలుగు పాదాలు ఆశువుగా పూరించడంతో సభ హర్షధ్వానాలతో హోరెత్తింది.

**శా॥ ఎన్నో జన్మల పుణ్యపాకమున గాదే! నిన్ను పూజింప వి**
**ద్యోన్నత్యంబు లభించుటన్న, మరి నే నా రీతి పుణ్యుండ గా**
**నన్నా! భావిని జన్మమందయిన సాంబా! విజ్ఞుడౌనట్లు మం**
**దున్ నన్ జేయుము, దున్నఁ జేయకుముసంతోషంబు నిండారగా!?**

అని సమస్యను విరగగొట్టిన తీరు ఎంతో ప్రశంసనీయం. సమస్యలకు, ఆశువులకు పెద్ద తేడా తెలియని అమాయకుడు 'శతావధానతిలక' భరతశర్మ! మెరుపు వేగంతో సమస్యా పరిష్కారంలోకి దూసుకు వెళ్ళాడు. చక్కటి మొదటి పాదపూరణతో ఆహూతులందరినీ అలరింప జేశాడు.

'నగ్మారమ్మని పిల్చె నిన్ను భరతా!నందాబ్ధిలో తేలగన్' అని ఇచ్చిన సమస్యలోని ప్రాస వింటే ఎవరైనా భయపడవలసిందే... కాని, ఎంతటి దుష్కర ప్రాసలనైనా ఎదురుకొనే సత్తా గల భరత శర్మ, సమస్య ఇచ్చిన వెంటనే - 'తిగ్మంబైనది యౌవనార్ధదశ కాదే! ఓ నితిన్ సత్కవీ!' అంటూ మొదటి పాదం పూరించడం అనితర సాధ్యం. 'పద్యమొక్కటి రాని బాలుడు వాసిగాంచెవధానిగా', 'కారంబెక్కువయయ్యె పాయసము లోకంజాతపత్రేక్షణా'!, 'తిక్కననువ్వరించెగద తిక్కలపోరి యిదేమి లొల్లియో!'? ఇలా ఒక్కొక్క సమస్య వింటుంటే చప్పట్లు ప్రాశ్నికులకి కొట్టాలా, అవధానికి కొట్టాలా తెలియని అయోమయంలో పడ్డారు సభాసదులు.

'తరుణీపాదము పట్టినన్ రుచిరవాగ్ధారాప్రపూతాత్ములౌ' అనే సమస్యకు 'సురసానంద కవిత్వ తత్త్వ రచనాస్తోక ప్రభావాంచితో ద్ధుర' అంటూ ఒకే బిగిన రాసుకోవడానికి వీలుకానంత వేగంగా సమాసభూయిష్ఠంగా శతావధాని భరత శర్మ పూరించిన తీరు ఆశ్చర్యానికి లోనుచేసింది. అన్నీ అద్భుతమైన పూరణలు! ఎటువంటి తడబాటు, తొట్రుబాటు లేకుండా అవధాని భరతశర్మ సమస్యలను ఎదుర్కొంటున్న తీరు అందరికీ ఎంతో ముచ్చట గొలిపింది.

భరతశర్మకి పుత్రవాత్సల్యంతో సంచాలకత్వం నిర్వహిస్తున్న మాన్యులు వద్దిపర్తి పద్మాకర్ గారు ఆనందంతో పరవశించి పోతూ, మధ్యమధ్య చక్కటి వ్యాఖ్యానాలతో ఆహుతులను మైమరపించారు. రాగయుక్తమైన పద్యాలను, కొండొకచో అలనాటి ఆపాతమధురాలు సినీపాటలను వినిపిస్తూ, అపర ఘంటసాల అని అనిపిస్తూ, సభని రసరమ్యంగా నడిపించారు. అవధాన సరస్వతి ఆనాడు సంగీత సాహిత్య సమలంకృత అయిపోయింది. భరతశర్మ ఒక్కొక్క పూరణ చేస్తుంటే వారు





పరవశంతో, 'దంచేసాడండి!' 'బ్రహ్మాండం', 'అదిరిపోయింది' లాంటి అచ్చ తెలుగు ప్రశంసలు కురిపిస్తూ 'కొట్టండయా! చప్పట్లొద్దు. పుల్లట్లుకొట్టండి' అని శిష్యుడి శతావధానాన్ని ఆప్యాయంగా ముందుకు నడిపించారు.

ఇక అప్రస్తుత ప్రసంగం చేస్తున్నవారు సాక్షాత్తు జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీ సన్నిధానం వారిచేత 'ఫిరంగి' సత్యనారాయణ అని పిలిపించుకున్న రంగి సత్యనారాయణ. చమత్కారాలకు లోటేముంది? ఒక పక్క అప్రస్తుత ప్రాసంగికులు, మరొకపక్క గురువులు వద్దిపర్తి పద్మాకర్ గారు, సభాసదులను మైమరిపించడంలో పోటీపడ్డారు. ఆనాటి సభను చూసి తీరవలసిందే కానీ వర్ణించడానికి సాధ్యమయ్యే పని కాదు.

ఒక గంటలో పాతికమంది సమస్యలకు మొదటి పాదం పూర్తిచేసి ఇచ్చిన తరువాత వెంటనే దత్తపది ప్రాశ్నికులను వేదిక మీదకి ఆహ్వానించారు. సమస్యల్ని ఆశువుల్లాగా పూరించిన భరతశర్మకి దత్తపదులు పూరించడంలో తడబాటేం ఉంటుంది! నల్లేరుబండి నడకే అయింది. ప్రాశ్నికులు కూడా సామాన్యులు కాదు. చిత్రవిచిత్రమైన సమస్యలు, వినూత్నమైన, విభిన్నమైన అంశాలతో భరతశర్మ వైదుష్యాన్ని సంపూర్ణంగా వెలికి తీసారు. శతావధానిని తికమకకు గురిచేయాలని ఎంత ప్రయత్నించినా, వారికి నిరాశే మిగిలింది. 'రోలు, రోకలి, తిరగలి, పాత్రం' అనే పదాలు ఇచ్చి భార్య కోపాన్ని వర్ణించమని అడిగితే -

**తే॥ ఆలి 'రో! కలి'నీకు తోడై జనించె**
**ఏమి నా గ'తిర! గలి'త స్థేముఁడైతి!**
**'పాత్రమ' వొ నీవు నాదు కళత్రమవొకొ!**
**నాదు వీపెల్ల 'రోలు'గా మోదుచుంటి!'**

అని ఈ పదాలను ఎంతో చాకచక్యంగా విరిచి, భార్య కోపాన్ని చమత్కారంగా వర్ణించి 'బ్రహ్మచారి' భరత శర్మ, సభలో నవ్వులు పూయించారు. మరొకటి 'ఖైదీ, కేడీ, గూండా, రౌడీ' అనే పదాలిచ్చి, ప్రస్తుతం జరుగుతున్న శతావధాన కార్యక్రమాన్ని, సభను వర్ణించమని ప్రాశనికులు అడిగితే.. ఏ మాత్రం తడుము కోకుండా 'బాకే డీకొన ప్రశ్నలన్ గురుని దివ్యంబైన కారుణ్యమే - నాకై దీవనలిచ్చు పద్మనిధి సంధానింపగా భీతి యేలా?' అంటూ తన గురుభక్తిని చాటుకుంటూ, కేడీ, ఖైదీ పదాలను విరిచిన తీరుకు సభాసదులు చప్పట్ల వర్షం కురిపించారు.



ఇవేగాక సంస్కృతంలో కొన్ని! సమస్య ఏదైనా భరతశర్మ నుదుటిమీది చిరునవ్వుని కొంచెం కూడా చెరపలేకపోయింది.

**సాయంత్రం సభావిభవం**

నాలుగు గంటలకి మధ్యాహ్నం సభ ప్రారంభమైంది. దత్తపదులు పూర్తికాంగానే వర్ణనలు తీసుకున్నారు! ప్రణాళిక ప్రకారం శతావధానం రెండు రోజుల్లో పూర్తిచేయాలి. మర్నాడు ఉదయానికి సమస్యల్ని, దత్తపదులని వుంచి, వర్ణనలన్నీ పూరించేశారు భరతశర్మ. మధ్యమధ్యలో కొన్ని ఆశువుల పూరణలు! ఆ వర్ణన పద్యాల గురించి ఎంత చెప్పినా తక్కువే! 'సంక్రాంతికి ప్రజలంతా పల్లెలకు వెళ్లిపోగా నగరాలు వెలవెల బోవడాన్ని వర్ణించమంటే భరత శర్మ నగరాలన్నీ 'శశిని వీడినట్టి నిశిని బోలె' ఉన్నాయని ఉపమానాన్ని చెప్పడం ఎంత మనోజ్ఞంగా ఉంది! అలాగే, కాళీయమర్దనం తరువాత కాళీయుడిని కృష్ణుడు ఎందుకు వదిలివేశాడో వర్ణించమని అడిగిన ప్రశ్నకు,

**చం॥ తకధిమితాంగు తద్ధిమితతక్కిటతాంగు మృదంగనాదముల్**
**సకల దిగంతభాగములఁజాలఁగ శౌరినటించినంతనే**
**వికలితమయ్యె కాళియుని విహ్వలగర్వము సర్వమున్గనన్**
**సుకరుణఁబ్రోవడే శరణుజొచ్చినవారల కృష్ణుఁడెంతయున్**

అని రాసుకోవడానికి వీలు లేకుండా నాలుగు పాదాలూ మృదంగశబ్దాలు మ్రోగించినట్లుగా చెప్పిన భరత శర్మ వేగానికి మా చేతి లోని పెన్నులు విరిగిపోయినంత పనయ్యింది. అందులోనూ... భరత శర్మ మంచి మృదంగ విద్వాంసుడు, సంగీత కళాకారుడు కూడా! ఆయన తల్లి శ్రీమతి శైలజ- వీణ విద్వాంసురాలు. ఆమె గురించి వర్ణించమని ఒక ప్రాశ్నికుడు అడుగగా- 'శైలజాంబయె శారదాంబగ సత్త్వమిచ్చెను వీణియన్' అని తన తల్లి శైలజ (పార్వతి)యె శారదగా(సరస్వతిగా) తనకు సంగీతాన్ని ప్రసాదించారు అని వర్ణించారు భరత శర్మ.

ఇక శృంగేరి జగద్గురువుల విశిష్టతను గురించి ఒకరు ప్రశ్నను అడుగగా,

**శా॥ దాక్షిణ్యశ్రుతిపీఠ దేశికవరుల్దాక్షిణ్యపూర్ణేక్షణుల్**
**వీక్షామాత్ర పవిత్రితాఖిల జనుల్విశ్వస్తుత శ్రీకృతుల్**
**సాక్షాత్సాంబులు భారతీవిధుగురుల్తత్పాదపద్మంబులం**
**దక్షయ్యంబగుభక్తిఁజేసెదను సాష్టాంగప్రణామంబులన్**

అంటూ అద్భుతంగా పద్యం చెప్పి, గురువులపై తనకున్న భక్తిప్రపత్తులను తెలియజేశారు శతావధాని భరత శర్మ.

**రెండవ రోజు - ఉదయం సభ**

శతావధానులు ఆముదాల మురళి, జంట అష్టావధానులు ముత్యంపేట గౌరీశంకర్, డా. ముదిగొండ అమరనాథశర్మ, సినీ గేయ రచయిత మాడుగుల నాగగురునాథశర్మ రెండవరోజు ఉదయం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఎక్స్‌ప్రెస్ రైలులాగా పూరణలు దడదడలాడించేస్తున్నాడు భరత శర్మ. పండితులను పామరులను కూడా ఒకే రకంగా రంజింపచేస్తూ, మధురమైన పద్యాలు అలవోకగా అతని నోటినుండి జాలువారుతున్నాయి. అనుకున్నట్టుగానే సమస్యల పూరణ చకచక అయిపోయింది. ఒక్కొక్క సమస్యకు పురాణ విషయాలతో ఎన్నో నిగూఢ అర్థాలతో ఊహకందని విధంగా పూరించారు భరత శర్మ. 'చితి సిద్ధంబిక రమ్ము నాథ! తనియన్ శృంగార యజ్ఞంబునన్' అనే సమస్యకు

**మ॥ స్తుత రూపంచిత సుందరీమణిని ఇచ్చో నిల్పి యుంటిన్ గదా**
**వెతలేలా తప మాచరింప? హవముల్ వేయేల? నా దివ్య సం**
**గతి మోక్షంబగు గాదె నీకు మునిముఖ్యా! మార శాస్త్రంబు నే**
**ర్చితి, సిద్ధంబిక రమ్ము నాథ! తనియన్ శృంగార యజ్ఞంబునన్!**

అని ఒక అప్సరస మునితో పలుకుతున్నట్లు ఎంతో సరసంగా పూరించారు అవధాని గారు.

అలాగే, 'మీకీ న్యాయమె దోషమే మిగుల సంపీడించి చంపున్ గదా!' అనే సమస్యకు -

**శా॥ ఏకల్పంబుననైన ధర్మమును రక్షింపంగ నాయత్తులై**
**వీకన్భారతవీరసైనికులె యావేశింత్రు - కాశ్మీరమున్**
**'మీకీన్యాయమె? దోషమే! జనులసంపీడించి చంపున్గదా'**
**పాకిస్థానపుటుగ్రసేన; భరతాంబా! చెండుమవ్వారలన్!**

అని పాకిస్తాను ఉగ్రవాది సేనలను చెండాడమని భరత మాతను అవధాని ప్రార్థిస్తూ ఈ సమస్యను పూరించిన తీరు ఒక్కొక్కరిలో దేశభక్తిని, వీరత్వాన్ని రేకెత్తించి, హర్షధ్వానాలు చేయించాయి. దత్తపదుల నెంబరుచెప్పగానే ఎటువంటి జాప్యము చేయకుండా చక్కటి పద్యాలతో ప్రాశ్నికులను, ఆహూతులను కూడా పక్షపాతం లేకుండా అలరింప చేస్తున్నాడు భరత శర్మ. మధ్యమధ్యలో గురువులు పద్మాకర్ గారి వ్యాఖ్యానాలు! సభాసదులను యథోచితంగా అలరింపచేసాయి. తరుగు మొదలైన చిన్న చిన్న పదాలను కూడా- 'తరు గుల్మ చ్ఛద పాళుల' అని విడగొట్టడం ద్వారా అవధాని నేర్పు ఏమిటో తెలుస్తోంది!

'లైక్, షేర్, రీల్, సెల్' లాంటి ఇంగ్లీషు పదాలను ఇచ్చి జాతీయ విద్యా విధానం-2020 అనే విషయాన్ని గురించి వర్ణించమంటే -

**"సక'లైకా'గ్రత పూర్ణవృద్ధిపయి నా(శ్రంతమ్ము లక్ష్యమ్ముగా**
**ప్రకటంబౌసహపాఠ్య కార్యములపై రాజిల్లె త్రా'సెల్ల', వి**
**ద్యకు భా'షేరి'త సంస్కృతిప్రభకు నౌరా! డింగ'రీల'ట్టు ల**
**ర్భకులన్ నూతన విధాన శిక్ష పరిపూర్ణ స్వాంతులన్ చేయదే!"**

అని అవధాని భరత శర్మ పూరించారు! సరిగా భోజన సమయానికి దత్తపదులు పూర్తి అవ్వటమేకాక ఆశువులు కూడా వెంటనే మొదలుపెట్టారు.

ఆ ఆశువులు పద్యాలా తూటాలా? ప్రశ్న అడిగినంతసేపు పట్టట్లేదు పద్యం చెప్పడానికి! ఆ అశువుల వేగం అలాంటిది! భరత శర్మ చెప్పిన ఆ ఆశు పద్యాలను రికార్డు చేసుకోవడం తప్ప రాసుకొనే సాహసం ఎవ్వరూ చేయలేదు!

ఐదు గంటలకు ధారణ సభ! విరామ సమయంలో ప్రాశ్నికుల స్పందన పద్యాలు! భరత శర్మ అవధాన రసవృష్టిలో తడిసి సంతృప్తులైన ప్రాశ్నికులందరూ, తమ తమ హృదయ స్పందనలను మైకు ముందు అద్భుతమైన పద్యాలతో వినిపించారు.

## ధారణ సభా విజృంభణ

ధారణ సమయానికి సభంతా నిండిపోయింది. సాయంత్రం సభలో విశిష్ట అతిథులుగా పాల్గొనవలసిన మహానుభావులంతా ముందు వరుసలో ఆసీనులయ్యారు. గురువుగారు శిష్యుణ్ణి వేదిక మీదికి తీసుకొని వచ్చారు, విశ్వామిత్రుడు రాముడిని తీసుకొచ్చినట్టు. ఒక్కసారి ఆ ప్రాంగణంలో ఉన్న అందరినీ గాంభీర్యం ఆవరించింది. అందరూ ముక్తహృదయంతో భరతశర్మ శతావధానం దిగ్విజయంగా పూర్తికావాలని నిశ్శబ్దంగా ప్రార్థనలు చేసారు. గురువులు పద్మాకర్‌గారు కూడా ఒకింత గాంభీర్యాన్ని వహించారు. భరతశర్మ ఒకలాంటి ధ్యానముద్ర స్థితిలోకి వెళ్ళిపోయారు.

గురువుగారి ఆదేశంతో ముందుగా వర్ణనల ధారణ మొదలుపెట్టాడు. నెంబర్ చెప్పగానే సమస్యను గుర్తుతెచ్చుకొని తను పూరించిన ప్రౌఢసమాస భూయిష్ఠమైన పద్యాలను వెంటవెంటనే సుస్వరంతో వినిపించారు భరతశర్మ. ఇక మత్తకోకిల వచ్చిందంటే సభాసదులందరూ లయబద్ధంగా చప్పట్లుకొట్టడమే! 14 నిమిషాల్లో వర్ణనల పూరణ అయిపోయింది. అందరూ ఆనందంతో లేచి చప్పట్లు కొట్టారు. తర్వాత దత్తపదులు 15 నిమిషాలు! ఆ తరువాత సమస్యలు! ధారణసభ పూర్తయింది. ఆనందానికి అవధులు లేవు! చప్పట్లు, హర్షధ్వానాల వర్షం! దూరం నుంచి కుర్రకారు ఈలలు! కేకలు! గోలలు! అందరూ గుండెల నిండా గాలి పీల్చుకున్నారు.



భరతశర్మ అక్షరానికి స్వరార్చనతో పద్యాలన్నీ మధురంగా ఆలపించాడు. భరతవర్షానికి కీర్తి తెచ్చిపెట్టాడు. ఈ అద్భుతకార్యాన్ని తమచేతులతో నిర్వహించిన మరుమాముల సోదరులు భరత శర్మని ఆనందంగా కౌగిలించుకున్నారు. భరతశర్మ తల్లిదండ్రులు -శ్రీమతి శైలజా శ్రీ రాజీవలోచన శర్మ దంపతులు పక్కకు తిరిగి కళ్ళని ఒత్తుకున్నారు.

ఈ విధంగా కేవలం రెండు రోజులలోనే శతావధానాన్ని జగజ్జేగీయమానంగా చేసిన 19 ఏళ్ల 'శతావధానతిలక' బ్రహ్మశ్రీ ఉప్పలధడియం భరత శర్మను తమ గురువు, సంచాలకులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ ఆనందంతో ఆలింగనం చేసుకోవడం రాముడు హనుమంతుని కౌగిలించుకున్న సందర్భాన్ని సాక్షాత్కరింపజేసింది.

## విజయోత్సవ సభావైభవం

విజయోత్సవ సభలో పాలుపంచుకున్న వాళ్ళందరూ సామాన్యులు కాదు. పద్మభూషణ్ శాంత బయోటెక్ అధినేత, వదాన్యులు వరప్రసాద్, ప్రాంజలి శంకర్ నారాయణ, వనం జ్వాలా నరసింహారావు, అవధానులు డాక్టర్ ఎం.రామశర్మ, ఆముదాల మురళి, అవధాన విద్యావికాస పరిషత్ అధ్యక్షులు దత్తాత్రేయశర్మ, అందరితో ఏకగ్రీవంగా నోరుమంచి అని ఆప్యాయంగా పిలిపించుకునే ఉభయ భాషాకోవిదులు, నారుమంచి అనంతకృష్ణ, పసర్లపాటిబంగారయ్యశర్మ.

మరుమాముల సోదరులుదత్తాత్రేయ శర్మ, వేంకటరమణ శర్మలు తమ శ్రీమతులతో అవధాని భరత శర్మకి, ఆయన తల్లిదండ్రులకు  వైభవోపేతంగా, సత్కారం చేశారు. మైకు ముందు నుంచున్న అవధాని అవుసుల భానుప్రకాష్ చక్కటి వ్యాఖ్యానంతో సభని మరింత శోభాయమానం చేశారు. భరతశర్మ సన్మానపత్రాన్ని సభకు చదివి వినిపించారు. ఆ తరువాత ప్రాశ్నికుల సన్మానాలు జరిగాయి. ఇక అవధాన యజ్ఞంలో నిర్విరామంగా, అవిశ్రాంతంగా శ్రమించిన కార్యకర్తలందరికీ సత్కారం యథావిధిగా జరిగాయి.

రోజూ చేసుకునే అనుష్ఠానం లాగా మరుమాముల



సోదరులు ఈ శతావధానాన్ని ఎంత అలవోకగా చేసారన్నది నన్ను అంతుబట్టని ఆశ్చర్యానికి గురిచేసింది. ఒకరు అవధాన సరస్వతి సేవలో పవిత్రులైన మహనీయులైతే, మరొకరు సనాతనధర్మ పరిరక్షణ సేవాతత్పరులు! ఏంచెప్పాలి? కారణజన్ములు అంతే!

## శృంగేరి జగద్గురువుల అనుగ్రహభాషణం

ధారణ సభ తరువాత శృంగేరి నుంచి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ తీర్థ సన్నిధానంవారు ఆశీఃపూర్వక అనుగ్రహభాషణాన్ని అందించారు. "పరమపూజ్య గురువర్యులు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ స్వామివారి 75 సంవత్సరాలు పూర్తయినటువంటి విశేష సందర్భాన్ని పురస్కరించుకొని ఎంతో వైభవోపేతంగా జరుగుతున్న వజ్రోత్సవ ఉత్సవాల పరంపరలో సమస్త ఆస్తికులందరు కలిసి ఎన్నో ధార్మిక, సారస్వత కార్యక్రమాలు జరుపుతున్నారు. మాకెంతో ప్రీతిపాత్రమైన దర్శనమ్ పత్రిక ద్వారా ఉప్పల ధడియం భరత శర్మ శతావధానం, తెలంగాణ సారస్వత పరిషత్తులో ఎంతో వైభవంగా విద్వాంసులు, పండితుల సమక్షంలో జరగటం ఎంతో సంతోషదాయకమైన విషయం.

మన భారతీయ పరంపర వైశిష్ట్యం, వైభవం ఇలాంటి కార్యక్రమాల ద్వారా అందరూ తెలుసుకోగలుగుతారు. ఇప్పటివారు ఈ పరంపర యొక్క వైశిష్ట్యం తెలుసుకోలేక పోతున్నారు. ఈ వైదిక పరంపర, ధార్మిక పరంపర, ఈ సనాతన ధర్మం అనేది ఒక హిమాలయ పర్వతం లాంటిది. మనం ఆ పర్వతాన్ని కీర్తించినా, కీర్తించకపోయినా దాని విశిష్టతకి ఎటువంటి లోపం ఉండదు. కానీ దాన్ని కీర్తించటం ద్వారా మనం పునీతులమవుతాము. దర్శనమ్ పత్రిక వారి ఆధ్వర్యంలో ఈ చక్కటి శతావధాన కార్యక్రమం దిగ్విజయంగా జరిగి నందుకు మేము ఎంతో సంతోషిస్తున్నాము. వారికి ఆశీస్సులు అందిస్తున్నాము. ఇందులో పాల్గొన్న విద్వాంసులు, ప్రాశ్నికులు, రసికులైన సమస్త సజ్జనులకు అందరికీ కూడా మా ఆశీస్సులు అందజేస్తున్నాం.

ఈ కార్యక్రమం జరగటానికి రెండు రోజుల ముందే శతావధాని భరత శర్మ శృంగేరి రావటం జరిగింది. మేము మా యొక్క అనుగ్రహ పూర్వకమైన ఆశీస్సుల్ని అందజేయడం జరిగింది. ఈ శతావధానం ఎటుగూడీ విజయవంతంగా జరుగుతుంది అన్న విషయం మాకు ముందే తెలుసు. కాబట్టి భరత శర్మ శృంగేరి వచ్చిన సందర్భంలోనే అతనికి సన్మానం చేయడం జరిగింది. రామాయణంలో యుద్ధం జరగకముందే విభీషణుడికి పట్టాభిషేకం జరిగిపోతుంది. ఈ సందర్భం ఆ ఘట్టాన్ని గుర్తుచేస్తోంది. అవధానం ఇక్కడ ప్రారంభం అవటానికి ముందే భరత శర్మకి ఆ విధంగా మేము శృంగేరి లో సన్మానం చేయడం జరిగింది. ఆ శారదాంబ అనుగ్రహంతో, మా గురువుల ఆశీస్సులతో ఈ కార్యక్రమం చక్కగా జరిగినందుకు చాలా సంతోషంగా ఉంది. శ్రీ శారదా చంద్రమౌళీశ్వర స్వామి వారి అనుగ్రహంతో, మా గురువుల ఆశీస్సులతో చిరంజీవి భరతశర్మ ఇలాంటి శతావధానాలు మరెన్నో జరుపుకోవాలని, అలాగే దర్శనం పత్రిక వారి ఆధ్వర్యంలో ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు మరెన్నో విజయవంతంగా జరగాలని వారికి ఆశీస్సులు అంద జేస్తున్నాము" అంటూ శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామి వారు, వారి అనుగ్రహభాషణాన్ని ఇచ్చారు. సభాసదులంతా స్వామివారి దర్శనం, భాషణం లభించినందుకు ఆనందంతో పులకించి పోయారు.

## భరతశర్మకి నా ప్రశంసాపద్యాలు!

కం॥ భరతునియవధానంబది
సురుచిరసుమధురభరితముశ్రోతముకింపౌ
వెరపనుమాటేలేకను
సరసపుపూరణలిడుచునుసందడిచేయున్!

కం॥ కలమునుగళమునురెండును
కలబడుమాధుర్యమందుకరినమెదేల్చన్
పలుకుకలికికిప్రియసుతుడు
కలుగగవాక్శుద్ధికవికిఘనమగురీతిన్!

కం॥ నయముగపద్మాకరగురు
స్వయముగఅభినవశుకులిలచదువులునేర్పన్
శ్రయమునవధానతిలక
జయములబాటనునడచెనుజరచరభళిరా!

**- ఉప్పలపాటి కుసుమ కుమారి**

తెలుగు సాహిత్యంలో అవధానం అనేది కేవలం ఒక కళ కాదు, అది మేధస్సు, ధారణ, ఆశుకవిత్వం, ఛందోపాండిత్యం, సమయస్ఫూర్తి సమన్వయంగా అవతరించే మహావిన్యాసం. వేల ఏళ్ల చరిత్ర గల ఈ విశిష్ట ప్రక్రియ నేటి కాలంలో అరుదైనదై పోతున్న తరుణంలో, అతి పిన్న వయసులోనే అష్టావధానాలు, శతావధానాలు నిర్వహిస్తూ అవధాన పరంపరకు కొత్త ప్రాణం పోస్తున్న యువ అవధాని, శతావధాన తిలక బ్రహ్మశ్రీ ఉప్పల ధడియం భరతశర్మను మనస్ఫూర్తిగా అభినందించి తీరాలి.

తిరుపతిలో జన్మించిన ఉప్పల ధడియం భరతశర్మకు బాల్యం నుంచే సాహిత్య, సంగీత వాతావరణం అలవడింది. తల్లి శ్రీమతి శైలజ, సంగీతం, వీణ విద్యలో ప్రావీణ్యం కలిగిన ఉపాధ్యాయురాలు. తండ్రి రాజీవలోచన శర్మ, జర్నలిస్ట్. చిన్ననాట నుంచే భగవద్గీత శ్లోకాలు, భాగవత పద్యాలు అభ్య సించడం వల్ల సంస్కృతం, తెలుగు భాషలపై భరతశర్మకు సహజమైన మక్కువ పెరిగింది. ప్రస్తుతం తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో శాస్త్రి-శిక్షాశాస్త్రి మూడవ సంవ

అష్టావధానాన్ని నిర్వహించడం తెలుగు సాహితీ వేదికలపై సంచలనంగా మారింది.

2021 దసరా సందర్భంలో బ్రహ్మశ్రీ తోపెల్ల బాలసుబ్ర హ్మణ్య శర్మ సంచాలకత్వంలో అంతరంగిక అష్టావధానం ప్రారంభించి, అనంతరం ఏలూరులోని ప్రణవ పీఠంలో బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి సంచాలకత్వంలో మొదటి ప్రత్యక్ష అష్టావధానాన్ని నిర్వహించారు.

2025 సెప్టెంబర్ నాటికి భరతశర్మ చేసిన అవధానాల సంఖ్య: 91 అష్టావధానాలు (6 ద్విగుణిత అష్టావధానాలు, ఒక సంస్కృత అష్టావధానం సహా), 3 శతావధానాలు. 16 ఏళ్లకే మొదటి శతావధానం చేసి 'అత్యంత యువ శతావధాని'గా ప్రపంచ రికార్డు నెలకొల్పారు. 17 ఏళ్ల వయసులో ఆళ్లగడ్డలో జరిగిన శతావధానంలో కేవలం 22 నిమిషాలలో 75 పద్యాలను ధారణ చేసి 'శతావధాన తిలక' బిరుదును సొంతం చేసుకున్నారు.

భరతశర్మ రచనలు, సాహిత్య సేవ ప్రత్యేకంగా పేర్కొనాల్సిన

# ఉప్పల ధడియం భరతశర్మ శతావధానం

త్సరం చదువుతున్న భరతశర్మ, విద్యార్థి దశలోనే అవధానం, ప్రవచనం, మృదంగ వాద్యం వంటి అనేక రంగాలలో విశేషమైన ప్రావీణ్యం సంపాదించారు.

అవధాన విద్యలో గురువుల పాత్ర అమూల్యమైనది. భరత శర్మకు ఈ విషయంలో అపూర్వమైన భాగ్యం కలిగింది. 'త్రిభాషా సహస్రావధాని' బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్, 'ఛందశ్శాస్త్ర రత్నాకర' బ్రహ్మశ్రీ తోపెల్ల బాల సుబ్రహ్మణ్య శర్మల శిక్షణలో భరతశర్మ అవధాన విద్య, ఛందస్సు సూత్రాలు, ఆశుకవిత్వ గరిమను లోతుగా అభ్యసించారు. భరతశర్మ తన 15వ ఏట మొదటి

విషయాలు. అవధానంతో పాటు భరతశర్మ రచనా రంగంలోనూ విశేష కృషి చేశారు. ఆయన రచనలు: శివభవేశ శతకము (2021), యాదగిరి శ్రీలక్ష్మీనృసింహేశ్వర శతకము (2022), అనంత ఛందస్సౌరభములో 100 వివిధ ఛందస్సులలో శతక రచన (2022), భరత శతావధానం - తొలి శతావధాన పద్య సంకలనం (2023), శ్రీ కపిలేశ్వర శతకము (2024), అవధాన బాలభాస్కరము - తొలి 50 అవధానాల పద్య సంకలనం (2025) మొదలైనవి వున్నాయి.

భరతశర్మ బహుముఖ ప్రతిభలో భాగంగా ఆయనకు



సంగీతం, నాటకం, ప్రవచనంలో వున్న ప్రావీణ్యాన్ని గురించి చెప్పుకోవాలి. సాహిత్యంతో పాటు సంగీత రంగంలోనూ భరతశర్మ ప్రతిభ కనబరిచారు. బ్రహ్మశ్రీ పారుపల్లి బాల సుబ్రహ్మణ్యం శిక్షణలో మృదంగం డిప్లొమా కోర్సును పూర్తి చేసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. తల్లి శ్రీమతి శైలజ వీణ కచేరీలకు, వివిధ సంగీత సభలకు మృదంగ సహకారాన్ని అందించారు. భువనవిజయ నాటకంలో అల్లసాని పెద్దన పాత్రను పోషించి, పద్య-గద్యాల అనర్గళ ప్రదర్శనతో ప్రేక్షకుల ప్రశంసలు పొందారు.

తన లక్ష్యం, అవధాన విద్య ద్వారా సామాజిక చైతన్యం కలిగించడమేనని భరతశర్మ అంటారు. సంస్కృత, ఆంధ్ర కావ్యాలు, పురాణాల ద్వారా నేటి యువతకు జీవన విలువలను అందించడం, అవధాన ప్రక్రియ ద్వారా విద్యార్థుల్లో ధారణాశక్తి, చింతన విధానం, సృజనాత్మక ఆలోచన పెంపొందించడం అనేదే అవధాని ఉప్పల ధడియం భరతశర్మ లక్ష్యం. అవధానాన్ని వేదికలకే పరిమితం చేయకుండా సమాజ చైతన్యానికి ఒక సాధనంగా మలచాలన్న సంకల్పం ఆయనలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇదిలా వుండగా, దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక ఆధ్వర్యంలో జనవరి 9, 10 (2026), శుక్ర-శని వారాలు, రెండు రోజులపాటు హైదరాబాద్ భాగ్యనగరంలో జరిగిన హైదరాబాద్ శతావధానం, ఒక సాహితీ మహోత్సవంగా పేర్కొనాలి.

త్రిభాషా సహస్రావధాని బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ సంచాలకత్వంలో, మరెంతోమంది సాహితీవేత్తలు, కవి, పండిత దిగ్గజాల సమక్షంలో, వందల సంఖ్యల ఆహ్వానితులు ఆస్వాదిస్తుండగా, శతావధాన తిలక బ్రహ్మశ్రీ ఉప్పల ధడియం





భరతశర్మ శతావధానం శృంగేరీ జగద్గురువుల దివ్యాశీరను గ్రహంతో 'వజ్రోత్సవ భారతి-శతావధాన సంక్రాంతి' శీర్షికన తెలంగాణా సారస్వత పరిషత్తు సాహిత్య వేదికపై భరతశర్మ శతావధానం ఘనంగా ఆరంభమైంది.

దానికి పూర్వం, 7-30 గంటలకు అతిథులు, కవి పండితులు. ప్రాశ్నికులతో వజ్రోత్సవ భారతి శోభాయాత్ర దేవాదాయ శాఖ కార్యాలయం నుండి సారస్వత పరిషత్తు దాకా సాగి అనంతరం శతావధానం ఆరంభమైంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కెవి రమణాచారి, మహామహోపాధ్యాయ ప్రాచార్య బ్రహ్మశ్రీ డాక్టర్ శలాక రఘునాథ శర్మ, ఇతర సాహితీ వేత్తలు ప్రారంభ సభలో పాల్గొని జ్యోతి ప్రకాశనంలో పాల్గొన్నారు.

10 వ తేదీ శనివారం సాయంత్రం శతావధానం ధారణ సభ, వెనువెంటనే వారికి సత్కార కార్యక్రమం జరిగాయి. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నవారిలో పద్మభూషణ్ పురస్కృతులు వరప్రసాద్ రెడ్డి, శతావధాని రామశర్మ, డాక్టర్ శలాక రఘునాథ శర్మ తదితర పెద్దలతో పాటు నాకు కూడా పాల్గొనే అవకాశం కలిగింది.

రెండవ రోజు ముగింపు సభ జరగడానికి పూర్వం త్రిభాషా సహస్రావధాని బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ సంచాలకత్వంలో జరిగిన శతావధాన ధారణ సభలో, కేవలం 44 నిమిషాలలో 75 పద్యాలను, పృచ్ఛకుల పేర్లు, సమస్యలు, సందర్భోచిత భావాలతో సహా, ఎక్కడా తప్పులకు ఆస్కారం లేకుండా భరత్ శర్మ పద్యాలను హృద్యంగా పునఃస్మరణ చేయడం అత్యద్భుతం.

కొన్ని పద్యాలు భరతశర్మ ధారణ చేస్తున్నప్పుడు, సెలయేటి ప్రవాహంలా, కొన్ని బెజవాడ కృష్ణా బ్రిడ్జ్ మీద రైలు పోతున్నప్పటి చక్కటి శబ్దంలా, లయబద్ధంగా శ్రోతల హృదయాలను తాకి అద్వితీయానుభూతి కలిగించాయి. ఈ



శతావధానం ఇటీవలి కాలంలో జరిగిన ఒక అత్యద్భుతమైన సాహితీ సంఘటనగా నిలిచింది.

ఛందస్సును విరివిగా ప్రచారంలోకి తీసుకొచ్చిన ప్రక్రియల్లో మొదటిగా పేర్కొనాల్సింది అవధానం. కాగితం మీద కలం పెట్టి, ఆలోచిస్తూ, ఛందోబద్ధమైన కవిత్వం చెప్పేవారు కొంద రైతే, అలవోకగా, ఆశువుగా, శ్రోతలను ఆకట్టుకుంటూ అవధానం చేస్తూ ఛందో బద్ధమైన పద్యాలను ధారణ చేసేవారు మరి కొందరు.

ఉప్పలధడియం భరత్ శర్మ కూడా పిన్నవయసులో అష్టావధానాలు, శతావధానాలు అద్వితీయంగా చేస్తూ తెలుగు భాషలో ప్రావీణ్యం ఉన్నవారిని, ప్రవేశం మాత్రమే ఉన్నవారిని అవధాన పిపాసులను, పద్యోన్మత్తులను చేస్తున్నారు. అవధానం అనే తెలుగు సాహిత్యం విశిష్ట ప్రక్రియను అద్భుతంగా ముందుకు తీసుకు వెళ్తున్న ఒక యువ అవధాన మేధావి.

క్లిష్టమైన సాహితీ సమస్యలను అలవోకగా పరిష్కరిస్తూ, చమత్కార పూరణలను అవలీలగా పూరిస్తూ, ఆశువుగా పద్యాలు చెప్తూ, వీటన్నిటినీ ఏక కాలంలో అవధాని చేసిన సాహితీ విన్యాసమే భరత్ శర్మ అవధానం. ఆయన ఆశుకవిత్వ గరిమకు, సాహితీ పటిమకు, ధారణా శక్తికి, పాండితీ ప్రకర్షకు ఒక పర్యాయపదంగా దర్శనమిచ్చాడు. అవధాని పాండిత్యాన్ని, సమయస్ఫూర్తినీ పరీక్షిస్తూ ప్రశ్నలను సంధించిన పృచ్ఛకులకు ధారణా రూపేణా అవధాని ఇచ్చిన సమాధానం సాక్షాత్తు సరస్వతీ-శారదామాతకు భరత్ శర్మ మీద వున్న దయకు నిదర్శనం.



వేల సంవత్సరాల చరిత్ర గల అవధాన పరంపర, నేటి యువత చేతుల్లో సురక్షితంగా కొనసాగుతోందనడానికి భరతశర్మ ఒక సజీవ నిదర్శనం. ఆయన ప్రయాణం ఇంకా ఆరంభ దశలోనే ఉన్నప్పటికీ, ఇప్పటివరకు సాధించిన విజయాలు, హైదరాబాద్ శతావధానం వంటి ఘన సంఘటనలు. భవిష్యత్తులో తెలుగు సాహిత్యానికి, అవధాన విద్యకు ఆయన అందించబోయే అపూర్వ సేవకు స్పష్టమైన సూచికలు. అవధాన పండుగలు మళ్లీ మళ్లీ జరగాలి; ఈ కళ ఆచంద్రతారార్కం కొనసాగాలి.

అవధానం విద్య కొందరికి భగవత్ దత్తం అయితే, కొందరికి అభ్యాసం ద్వారా సిద్ధిస్తుంది. కాకపోతే, అవధానాలు చేసేవారు తగ్గిపోతున్నారు. ఆస్వాదించేవారూ తగ్గిపోతున్నారు. దాదాపు వేళ్లమీద లెక్కించగలిగేంత మందే ప్రస్తుతం అవధానాలు చేస్తున్నారు. వేల యేండ్ల చరిత్ర గల ఈ ఛందశ్శాస్త్రం, అవధాన ప్రక్రియ సుప్త చేతనావస్థలోకి పోకుండా, నడుం బిగించినవారిలో మరుమాముల సోదరులు అగ్రభాగాన వున్నారు.

అవధానం, పద్యవిద్య, చంధస్సు సార్వజనీనం కావాలి. పద్యం సాధారణ మానవుడినీ కదిలించాలి. ఈ అవధాన పరంపర నిర్విరామంగా, ఆచంద్రతారార్కం కొనసాగాలి. అవధాన పండుగలు నిర్వహించుకునే రోజులు మళ్లీ-మళ్లీ రావాలి. దర్శనమ్ శర్మ లాంటివారికి ప్రభుత్వ సహాయ సహకారాలు, పూర్తిగా లభించాలి. ఇంత గొప్ప కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు ఆయన్ను సదా అభినందించాలి. సముచితంగా గౌరవించుకోవాలి.

**- వనం జ్వాలా నరసింహారావు**

# దర్శనమ్ 21వ వార్షికోత్సవ సంరంభం





శృంగేరి జగద్గురువుల ఆశీరనుగ్రహంతో దర్శనమ్ 21వ వార్షికోత్సవ సంరంభంలో విశేష కార్యక్రమాల పరంపర ఘనంగా సాగుతోంది. డిసెంబర్ 21న బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ గారికి గురుసత్కారం వైభవంగా నిర్వహించిన వారం రోజుల్లోనే మరొక అద్భుత కార్యక్రమాన్ని నిర్వహించింది. డిసెంబర్ 28వ తేదీన ఇద్దరు జ్యోతిర్విద్వాంసులకు గండపెండేరంతో, జీవన సాఫల్య విశిష్ట పురస్కారంతో సమ్మానించి ధన్యమైంది దర్శనమ్.

శృంగేరి శారదాపీఠం ఆస్థాన జ్యోతిర్విందాసులు బ్రహ్మశ్రీ డా. శంకరమంచి రామకృష్ణ శాస్త్రి, విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి బ్రహ్మశ్రీ చల్లా శ్రీనివాస శర్మ గారలకు భాగ్యనగరంలోని రవీంద్రభారతిలో అపూర్వ రీతిలో గండపెండేర ప్రదాన సత్కారం జరిగింది. ఈ మహోత్సవంలో ఎందరో ధార్మిక, ఆధ్యాత్మికవేత్తలు, ప్రముఖులు విచ్చేసి సత్కారంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు, సభా ప్రారంభకులుగా పద్మశ్రీ పురస్కృతులు





బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ, విశిష్ట అతిథులుగా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తిరుమల తిరుపతి దేవస్థానం పూర్వ కార్యనిర్వహణాధికారులు డా. కె.వి. రమణాచారి, ఎల్.వి. సుబ్రమణ్యం, విఖ్యాత జ్యోతిష పండితులు ఆచార్య సీవీవీ సుబ్రహ్మణ్యం, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖా ధ్యక్షులు సాగి కమలాకర శర్మ, తెలంగాణ విద్వత్సభ కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి, వేద పండితులు బ్రహ్మశ్రీ మార్తి వెంకట రామశర్మ, ఆధ్యాత్మికవేత్తలు బంగారయ్యశర్మ, కుప్పా విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు. శంకరమంచి రామకృష్ణ శాస్త్రి , చల్లా శ్రీనివాస శర్మ దంపతులకు జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు స్వయంగా గండపెండేరం సమర్పించగా, ఇతర అతిథులు వారిని దుశ్శాలువా, పట్టువస్త్రాలు, తలపాగా, పూలకిరీటం, జ్ఞాప కలు, అభినందన పత్రాలతో ఘనంగా సమ్మానించారు. అనం తరం ప్రముఖులంతా సమ్మానితులకు పుష్పాభిషేకం చేశారు.

అంగరంగ వైభవంగా జరిగిన ఈ జీవన సాఫల్య పురస్కార మహోత్సవం శృంగేరి శారదాపీఠం జగద్గురు శంకరచార్యా శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామివారి అనుగ్రహ సందేశంతో ఆరంభమైంది. ఈ ఇరువురు పండితుల జ్యోతిష వైదుష్యాన్ని జగద్గురువులు ప్రస్తుతిస్తూ, వారు మరింత ఉన్నతిని సాధించా లని అనుగ్రహించారు. ఈ సందర్భంగా జ్యోతిర్విద్యా విపంచి శంకరమంచి అనే ప్రత్యేక సంచిక అతిథులు ఆవిష్కరించారు. విపంచి నాదనిలయం వ్యవస్థాపకులు మరుమాముల శశిధర శర్మ సంగీత విభావరితో కార్యక్రమం మొదలవగా, మడిపల్లి దక్షిణామూర్తి వ్యాఖ్యానంతో సభ సాగింది. దర్శనమ్ సంపాద కులు మరుమాములు వెంకటరమణ శర్మ, అవధాన విద్యా వికాస పరిషత్ అధ్యక్షులు మరుమాముల దత్తాత్రేయ శర్మ సహా పెద్ద యెత్తున వేద, శాస్త్ర, జ్యోతిష విద్వాంసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





దర్శనమ్ 21వ వార్షికోత్సవం, బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మకి గురుసత్కారం సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పంపిన అభినందన సందేశం

**अमित शाह**
**AMIT SHAH**

गृह मंत्री एवं सहकारिता मंत्री
भारत सरकार

सत्यमेव जयते

**Date : 31 December, 2025**

**Message**

I am delighted to learn that **Darshanam Media** has organised a **Guru Satkaram** to honour the revered **Brahmasri Dr. Madugula Nagaphani Sarma Ji**, a towering luminary of the rare and exalted Indian intellectual tradition of **Avadhanam**. It is deeply gratifying that this culturally significant initiative recognises a scholar whose life and work exemplify India's timeless Guru–Shishya Parampara.

Dr. Sarma Garu's contribution to the revival, enrichment, and creative evolution of Avadhanam is truly extraordinary. Recognised as an Avadhani at the age of just 14, he has performed over 2,000 Avadhanams, composed more than 33,000 poems, and created and rendered over 3,000 lyrical compositions; achievements that reflect exceptional scholarship, discipline, and creative brilliance. Through his lifelong dedication, he has ensured that this profound intellectual heritage continues to inspire new generations.

I am also happy to know that for over 22 years, Darshanam, as a distinguished spiritual monthly, has served the spiritual, religious, and social spheres with unwavering commitment, enriching Telugu readership through insightful publications and 35 special issues. Through initiatives such as Guru Vandana and Guru Satkaram, as well as its efforts in literary discourse, Vedic culture preservation, and ancient temple restoration, Darshanam has played a meaningful role in strengthening Bharatiya spiritual and cultural consciousness.

Under the visionary leadership of **Hon'ble Prime Minister Shri Narendra Modi**, India has witnessed a renewed national resolve to honour its Sanatana Dharma and civilisational heritage. Initiatives for the rejuvenation of sacred sites, promotion of Indian knowledge systems, global recognition of Yoga and Ayurveda, and the transformation of the **Padma Awards into a truly "People's Padma"**; honouring scholars, artists, teachers, and cultural practitioners from diverse walks of life, reflect this inclusive and values-driven approach to nation-building.

I extend my heartfelt congratulations to **Dr. Madugula Nagaphani Sarma Garu** and commend Darshanam Media for organising this prestigious programme. This Guru Satkaram stands as a dignified celebration of scholarship, service, and India's enduring cultural legacy, and will continue to inspire generations rooted in knowledge, dharma, and tradition.

**With best wishes,**

Sincerely,

(Amit Shah)

**Shri Marumamula Venkataramana Sharma**
Darshanam Media
Sri Rama Siddhanthi Bhavanam, 29-105/4/1,
New Vidya Nagar, Neredmet, Secunderabad
Telangana – 500 056

कार्यालय : गृह मंत्रालय, नॉर्थ ब्लाक, नई दिल्ली–110001
दूरभाष : 23092462, 23094686, फैक्स : 23094221
ई–मेल : hm@nic.in

**నన్నయ్య, తిక్కన, పోతనలను తనలో ఇముడ్చుకున్న అప్పాజోస్యుల సత్యనారాయణ భౌతికశాస్త్రవేత్తగా అమెరికాలో పనిచేసినా, తెలుగు కవిత్రయ మధుర రసాధారలను తన ఈశ్వర దర్శనానికి చక్కగా వినియోగించారు. జటిలమైన పంచభూత విచిత్రిని, ఈశ్వరసృష్టిని ఆధునిక వైజ్ఞానిక దృష్టితో దర్శిస్తూ వారు రాసిన ఖండకావ్యాలు నమక చమకాన్ని, పురుష సూక్తాన్ని, మంత్రపుష్పాన్నీ ఎలా తలపిస్తాయో తెలుసుకుందాం.**

‘ఎల్లశరీరధారులకునిల్లను చీ౯కటినూతి లోపలం, ద్రెళ్ళక మీరునేమను మతిభ్రమణంబున భిన్నులై ప్రవర్తిల్లక...’, ‘ఇందుగల౯డందులే౯డని సందేహమువలదు చక్రిసర్వోప గతుండు...’, ‘ఎవ్వనిచేజనించు జగమెవ్వనిలోపలనుండు



డా. కొప్పరపు నారాయణమూర్తి

ఆపశ్చమే... భూతంచమే భూతిశ్చమే వసుశ్చమే (నమక చమకం-పంచమోనువాకం), అగ్నిశ్చమే... మరుతశ్చమే ఇంద్రశ్చమే, విశ్వేచమే దేవా ఇంద్రశ్చమే... పృథివీచమ ఇంద్రశ్చమే అంతరిక్షం చమ.. (నమక చమకం-షష్ఠమోనువాకం)’.

ఇలా మనం ‘నమక చమకం’ శ్రద్ధగా పరిశీలిస్తే ఈశ్వర విభూతి కానిదేదీ ఈ సృష్టిలో లేదని ఇట్టే అవగతమవుతుంది. ఇది యజుర్వేదంలోని కృష్ణ యజుర్వేదీయ శాఖకు చెందింది. ముఖ్యంగా తైత్తిరీయ సంహితలోని భాగం. ఇక ‘పురుష సూక్తం’ మాటకొస్తే ఇది ప్రధానంగా ఋగ్వేదంలోని 10వ మండలంలో 90వ సూక్తంగా ఉంది. కానీ ఇది యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలలో కూడా కొద్దిపాటి మార్పులతో కనిపిస్తుంది. ఇది విశ్వజీవి లేక విరాట్ రూపాన్ని, విశ్వ సృష్టిని,మూలాన్ని వివరిస్తుంది. ‘సూక్తం’ అంటే ‘స్వరూప నిర్ణయం’ చేయడం అని చెప్పుకోవచ్చు.

విశ్వస్వరూప నిర్ణయం అంటే విశ్వంలోని సమస్త నక్షత్ర

లీనమై; యెవ్వనియందుడిందు౯; బరమేశ్వరు౯డెవ్వ౯డు...’ వంటి మహాకవి పోతన భాగవతపద్యాలు ఈశ్వరుని అద్వైత తత్వాన్ని నిరూపిస్తున్నాయి. కాకపోతే పోతన వ్యక్తిగా విష్ణుభక్తుడు కాబట్టి విశ్వమంతయు ‘నారాయణుడే’ వ్యాపించి ఉన్నాడని అన్నాడు. అద్వైతం ‘హరిహర’ అభేదం నిరూపిస్తుంది కనుక అచ్యుతుడు, అనంతుడు అయిన ‘నారాయణుడే శివుడు, శివుడే నారాయణుడు’ అని అన్వయించుకొంటే సరిపోతుంది.

నన్నయ్య, తిక్కన, పోతనలను తనలో ఇముడ్చుకున్న అప్పాజోస్యుల సత్యనారాయణ భౌతికశాస్త్రవేత్తగా అమెరికాలో పనిచేసినా, తెలుగు కవిత్రయ మధుర రసాధారలను తన ఈశ్వర దర్శనానికి చక్కగా వినియోగించారు. జటిలమైన పంచభూత విచిత్రిని, ఈశ్వరసృష్టిని ఆధునిక వైజ్ఞానిక దృష్టితో దర్శిస్తూ వారు రాసిన ఖండకావ్యాలు నమక చమకాన్ని, పురుష సూక్తాన్ని, మంత్రపుష్పాన్నీ ఎలా తలపిస్తాయో ఇక్కడ గమనించవచ్చు.

‘అశ్మాచమే మృత్తికాచమె గిరియశ్చమే పర్వతాశ్చమె సికతాశ్చమె వనస్పతయశ్చమె హిరణ్యంచమే.... అగ్నిశ్చమె



సమూహాలు (క్వాజార్లు, గెలాక్సీలు), సౌర మండలాలతో కలిపి భూమి ఉన్న 'సౌరమండలం' అని విస్తృతార్థంలో చెప్పుకోవాలి. ఇక్కడ పురుషసూక్త వ్యాఖ్య ఒకటి చూడండి.

**'అద్భ్యః సంభూతః పృథివ్యై రసాచ్చ । విశ్వకర్మణః సమవర్తతాధి । తస్య త్వష్టా విదధద్రూపమేతి । తత్పురుషస్య విశ్వమాజానమగ్రే ।'**

-- అంటే 'నీటి నుండి, భూసారము నుండి ప్రపంచం ఉద్భవించింది. ప్రపంచాన్ని సృజించిన భగవంతుని నుండి శ్రేష్ఠుడైన బ్రహ్మ ఉద్భవించాడు. భగవంతుడు ఆ బ్రహ్మ రూపాన్ని చక్కదిద్ది దానిలో వ్యాపించి ఉన్నాడు. బ్రహ్మ యొక్క ఈ ప్రపంచ రూపు సృష్టి ఆదిలో ఉద్భవించింది' అని అర్థం.

ఇంకా ' హ్రీశ్చ తే లక్ష్మశ్చ పత్న్యౌ । అహోరాత్రే పార్శ్వే । నక్షత్రాణి రూపమ్ । అశ్వినౌ వ్యాత్తమ్ । ఇష్టమ్ మనిషాణ । అముం మనిషాణ । సర్వమ్ మనిషాణ ।'



--అంటే 'హ్రీ, లక్ష్మీదేవి నీ అర్ధాంగినులు. రేయింబవళ్ళు నీ పార్శ్వాలు. నక్షత్రాలు నీ దివ్య రూపం. అశ్వినీ దేవతలు నీ వికసిత వదనం' అని అర్థం క్లుప్తంగా.

మన భూమి ఉన్న సౌరమండలం 'పాలపుంత' అనే ఒక నక్షత్ర సమూహం (గలాక్సీ)లో ఉంది. మనం దైవసేవలో భాగంగా పఠించే ఈ 'పురుష సూక్తం', శివారాధనలో చదివే 'నమక చమకం' సృష్టిని 'దైవ స్వరూపం'గా నిర్ధారించేవే. అంటే కంటికి గోచరించే ఈ చరాచర సృష్టికి, ఈశ్వరుడికి అభేదం చెప్పే 'అద్వైత' మంత్రాలు.

ఒకసారి బ్రిటన్ రాణి ఆహ్వానం మీద లండన్ వచ్చిన స్వామి వివేకానందను ఒక బీబీసీ ప్రతినిధి ఇలా అడిగాడు. 'స్వామీ, భగవంతుడు ఉన్నాడనడానికి ఆధారం ఏమిటి?' అని. అందుకు స్వామి నవ్వుతూ 'ఈ సృష్టినే. ఈ సృష్టి లేకుండా నువ్వూ, నేనూ ఉండేవాళ్ళమంటావా?' అని జవాబు ఇచ్చాడు. ఒక్కసారి ఆ బీబీసీ ప్రతినిధి స్వామిజీ వ్యాఖ్యకు నివ్వెరపోయాడు. ఈశ్వరుడు అంటే సృష్టి, సృష్టి అంటే ఈశ్వరుడు. సృష్టి ఈశ్వర విభూతి. ఈశ్వరుడు లేనిదే సృష్టి లేదన్నదే నమక-చమక, పురుషసూక్త సారం. 'పాంథియిజం' అనే మతం ఒకటుంది. ఇది చరాచర సృష్టిని దైవంగా ఆరాధించే సంప్రదాయానికి చెందినది. దీనిని ఒక మతంగా పరిగణిస్తారు. ఇలాంటి వారు మనదేశంలో కూడ ఉన్నారు. దీనితో కొంచెం విభేదించే మరో మత సంప్రదాయం 'పాణెంతీయిజం'. ఇది చరాచర సృష్టి ఈశ్వరుని నుంచే వచ్చినదని, అయినా ఈశ్వరుడు దీనికన్నా గొప్పవాడని వాదిస్తుంది.

ఒక్కమాట ఏమిటంటే కొన్ని వేల సంవత్సరాల నాటి ఈ ఆర్ష జ్ఞానాన్ని తెలుగు శ్లోకాలలో ఎలా చెప్పగలమన్న ప్రయత్నం గతంలో ఏదీ జరిగినట్టు కనిపించదు. గమ్మత్తేమిటంటే ఇవే అర్థాన్నిచ్చే తెలుగు శ్లోకాలు ఇటీవల మనకు అందుబాటులోకి వచ్చాయి. ఉదాహరణకు 'జీవోత్పత్తి వివృద్ధి-వ్యాపక మహాక్షత్రంబు సర్వం సహా /వైవిధ్యాద్భుత సృష్టిసంభృతము భాస్వత్ సుప్రభాకల్పిత ॥ శ్రీవల్లీ ఫలవృక్ష పర్వత నదీ సింధూజ్వలంబైన యీ /ఠీవిన్ పృథ్వికి సాటిలేదు గ్రహ కోటిన్ సౌరలోకంబునన్ ॥ అని వృక్షసంపద మహిమను కీర్తిస్తూ అప్పాజోస్యుల వారు 'సుజల వృత్త తారావళి'లో వర్ణించారు.

అయిదు పంచభూతాలకు వారు అయిదు తారావళులు రాశారు. ఇవన్నీ పంచభూతాత్మకమైన చరాచరసృష్టి ఆవిర్భావం, వృద్ధి, వ్యాపకం వర్ణిస్తాయి. ఆధ్యాత్మిక జ్ఞానానికి, లౌకిక శాస్త్ర విజ్ఞానానికి మధ్య వారధిగా నిలిచే ఈ అయిదు తారావళులు తెలుగు మత్తేభ, శార్దూల విక్రీడిత పద్యాలతో ధూర్జటి 'కాళహస్తీశ్వర మహాత్మ్యం'లా విశ్వమహాత్మ్యంను కీర్తిస్తాయి.

తారావళి ప్రక్రియ ప్రవేశ పెట్టినది వైద్యనాథుడనే 13వ శతాబ్ది తెలుగు కవి తన 'ప్రతాపరుద్రీయం'లో దీనిని పరిచయం చేశారు. ఇది ప్రాథమికంగా అలంకార శాస్త్ర గ్రంథం. మల్లినాథ సూరి ఈ గ్రంథాన్ని పలుమార్లు ఉటంకించాడు. వీరి కుమారుడు కుమారస్వామి ఈ గ్రంథరత్నానికి 'రత్నాపణం' అనే వ్యాఖ్య రాశాడని సాహిత్య చరిత్ర చెబుతున్నది. దీనిని అందిపుచ్చుకొని ఈశ్వర విభూతులైన పంచభూతాలను ఇతివృత్తంగా తన కవితా ఝరిని ఝుళిపించారు అప్పాజోస్యుల.

'తారావళి' భారతీయ ఖగోళ విజ్ఞానాన్ని ప్రతిబింబించే ఒకే ఒక సాహిత్య ప్రక్రియ. ఇరవై ఏడు నక్షత్రాలకు 27 పద్యాలను కూర్చి ఒక సమాపక శ్లోకం కూడ చేర్చటం ఆచారంగా గలిగిన ప్రక్రియ. నిజానికి తారలు 28 కదా అన్న సందేహం ఎవరికైనా కలగవచ్చు. ఉత్తరాషాఢ, శ్రవణ నక్షత్రాల నడుమనున్న అభిజిత్ తొలగించి ఇరవై ఏడు చేశారు. తొలగించిన అభిజిత్ సంఖ్య

వలన లోపం పూడ్చేందుకు 28వది గా సమాపక శ్లోకం చేర్చారు. నిజానికి ఈ తొలగించిన అభిజిత్ నక్షత్రం 'దైవ జన్మ నక్షత్రం'గా దైవ కళ్యాణం (అంటే లోకకళ్యాణం) మపుడు 'అభిజిత్ లగ్న పుష్కరాంశంగా వేదపండితులు చదువుతారు. ఇక్కడ ఈ తారావళిలో ఈశ్వరం కానిదేముంది.

ఈ నేపథ్యంలో తన కావ్య వ్యవసాయానికి ఈశ్వర భూతి 'పంచభూతాల' సూక్తాన్ని (స్వరూప నిర్ణయానికి) వినియోగించారు అప్పాజోస్యుల వారు. పావక వృత్త తారావళి (అగ్ని), సుజల వృత్త తారావళి (నీరు), వసుంధరా వృత్త తారావళి (భూమి), అంతరిక్ష వృత్త తారావళి (ఆకాశం), సమీర వృత్త తారావళి (వాయువు)ల పేరుతో ఆయా పంచభూతాల వ్యుత్పత్తి (ఆవిర్భావం), వృద్ధి, వ్యాప్తి, ఫలం ఈ సృష్టికి ఎలా వరమైందో వివరించారు. ఇవి చదువుతుంటే మనకు నమక చమకం, పురుష సూక్తం చెవుల్లో ప్రతిధ్వనిస్తుంది.

ఒక్కముక్కలో చెప్పాలంటే ఈ అయిదు కావ్యాలు 'నమక చమకం' తెలుగు రూపాలని చెప్పవచ్చు. అందుకేనేమో సంస్కృత కావ్యక్రియా కల్పంలో 'ఆంధ్రులు ప్రవేశపెట్టిన ప్రక్రియ' అని కొందరు వ్యాఖ్యానించారు. వీటినన్నిటినీ కలిపి 'పంచవటి' అన్నారు అప్పాజోస్యులవారు. నిజానికి మర్రి, రావి, మేడి, మారేడు, ఉసిరిక -- అయిదు మహావృక్షలను పంచవటి అంటారు. వనవాస కాలంలో రాములవారు సీతా సమేతంగా అరణ్యంలో ఉన్న ప్రాంతానికి 'పంచవటి' అని పేరు. అది రామాయణ ప్రస్తుతి కావచ్చు. కానీ, శివాభిషేకంలో శివుడికి కూడ ప్రీతిపాత్రమైన వాటిలో మారేడు, ఉసిరిక పుష్ప, ఫలాలు వినియోగం ప్రశస్తం అంటారు. అలాంటి ప్రాముఖ్యం కలిగినవే ఈ పంచభూత తారవళులు.

మొదట్లో చెప్పినట్టు ఈశ్వరుని అష్టమూర్తులలో పంచభూతాలు మొదటివి అన్నది నమక-చమక ప్రతిపాదన.



అథర్వ వేదం 6వ కాండ, 5వ అనువాకం 47 సూక్తం, 2వ మంత్రం ఇలా చెబుతుంది. 'విశ్వే దేవాః మరుతః ఇంద్రః అస్మాన్ । అస్మిన్ ద్వితీయ సవనే న జహ్యుః॥ ఆయుష్మంతం ప్రియం ఏషామ్ వదంతః వయం దేవానాం సుమతౌ శ్యామ॥ ఈ నేపథ్యంలో పంచభూతమైన వాయువు గురించి అప్పాజోస్యులవారు ఇలా రాశారు. 'పవనున్ దైవముగా పురాతనులు సంభావించి కైమోడ్చి యీ, భువి సర్వంబు విభిన్న జీవ విలసన్ మూర్తమ్ము గావించు థా, తు వదాన్యంబులు పంచభూతములలోన్ స్తుత్య స్థితున్ జేసి రీ, శివతాతిన్ బలశాలి నున్మిషిత ధీ శ్రీరాజితుల సంయముల్॥

'ఉదజని వాయునద్ది విమలోదయమై ధరిణిన్ సమృద్ధిగా, నుదకము రూపు దాల్చెడును', అన్న (23వ) పద్యం, 'ప్రాణో దాన సమానముల్ యాపాన వ్యానముల్ దేహి సంధాన పంచ ప్రాణములుగన్, అన్న (22వ) పద్యంలోనూ వాయువు ప్రాణచోదకంగా, నీటికి ప్రథమాధారంగా ఎలా వర్ధిల్లుతున్నదో చెబుతూనే 'కెట్లు సాధ్యమగు ప్రస్తుతిజేయ నపార శక్తులన్' అని ముక్తాయిస్తారు తన 'సమీర వృత్త తారావళి'లో. ఇక 'ధరణిన్ నీటను నేలలో పవన మంతర్లీనమై సాంద్ర వి । స్తారమై సస్య సమూహ సంసృజన కాస్కారమ్ము నై సర్వ జీ॥ వ రహస్యాతి రహస్య చేతన గుణప్రజ్ఞానమై వహ్నికిన్। పరమాప్తంబయి సంచరించుచు వివిధ వ్యాసంగ సంభావ్యమై॥' (17వ పద్యం) అని కీర్తిస్తారు వాయునందనుని. ఇది పోతన 'అలవైకుంఠపురంబులో...' రీతిలో నడిచినట్లు అనిపిస్తుంది.

సమీరమారుత మరుజగత్ప్రాణ సమీరణః -- అంటే 'జగత్ప్రాణ' న శబ్దం, వాయు నామాంతరాలలో ఒకటి అని అర్థం. 'నమస్తే వాయోః త్వమేవప్రత్యక్షం బ్రహ్మాసి, త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి' అనటంలో సమీరుడు, వాయునందనుడే బ్రహ్మ అని తైత్తిరీయోపనిషత్ చెబుతోంది. పంచభూతాలలో వాయువుకు ప్రత్యేక లక్షణాలు కొన్ని ఉన్నాయి. వాయువు తన స్పర్శను చర్మానికి తెలియజేస్తుంది. అలాగే వాయువు శబ్దానికి వాహనం. వాయువు లేనిదే శబ్దం వినలేము. అలాగే వాయువు గంధం మోస్తుంది. వాసనను ఒకచోటి నుంచి మరోచోటికి తీసుకెళ్తుంది. శబ్దం, గంధం వాయువుపై ఆరోపాలు. వాయువు కేవలం ఆధార వాహనం మాత్రమే.

నాభ్యాసీదంతరీక్షం శీర్ష్ణో ద్యౌః సమవర్తత -- అంటే బ్రహ్మ నాభి నుండి అంతరిక్షం ఉద్భవించింది. శిరస్సు నుండి స్వర్గం, పాదాలనుండి భూమి, చెవుల నుండి దిశలు ఉత్పన్నమైనాయి (పురుషసూక్తం). అలాగే 'అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితం (మంత్ర పుష్పం) -- కూడా

అంతరిక్ష స్వరూప స్వభావాలను నమక చమకంలో పేర్కొన్నట్టే శివ స్వరూపం వివరిస్తుంది. అటువంటి అంతరిక్షాన్ని 'శ్రీకాశప్రద సర్వతోముఖ హావక్రీడాభిరామంబు, న। స్తోక శ్రీకర సూర్య మండలుల కాద్యోపాంత ధామంబునన్ ॥ ప్రాకామ్యద్భుత మంతరిక్షము, బృహత్ బ్రహ్మాన్డ సంయుక్తమున్। శ్లోకిన్తున్ విమలాత్మమున్ రుచిర వాచోయుక్తి సంసిద్ధికిన్॥' అని భక్తిపూర్వకంగా ప్రస్తుతి చేస్తారు. 'అతి విస్తార మనూన మావృత మగణ్యం బాదిమధ్యాంత వర్జితమౌ.... వితత వ్యోమ పథంబులన్ విరళమై వేవేల కోట్లెప్పుడున్ క్షతి సర్వజ్ఞున కైన సాధ్యమే? సమీక్షంప నాకాశమున్--అని ఆకాశ స్వభావం నిర్ణయిస్తారు.

కంటితో చూసినప్పుడు ఆకాశం నక్షత్రాల ఉద్యానవనంలా కనిపిస్తుంది. కానీ, కంటికి కానీ, దూరదర్శినికి గానీ, కనబడని ఎన్నో రహస్యాలను ఋషులు అనాదికాలంలోనే దర్శించారు. ఆ జ్ఞానాన్ని వేద పురాణేతిహాస రూపంలో నిక్షిప్తం చేశారు అని అంటూనే "అమితోదార వికీర్ణ తారకల కుద్యానంబుగా నంతరి । క్షము చుపట్టును గాని, నిశ్చలన నక్షత్రం బుదీచీ దిశన్ ॥, ప్రముఖంబౌ ధ్రువతార నావికులన్ ప్రాచీన దిక్సూచియై । విమాలోదాత్త కథ జగత్తులకు శ్రీపీఠంబునై పొల్చెడున్ ॥ అని కూడా అనటం అప్పాజోస్యుల ఆధ్యాత్మిక పరాకాష్టకు ఒక అందమైన అభివ్యక్తీకరణ.



సర్వోత్కృష్ట జనిప్రపూరితము సస్యస్నిగ్ధ హేరాళమున్ ।, సర్వప్రాణి సమాశ్రయంబు బహుధా సంపూర్ణతా ధామమున్ ॥, సర్వోపాశ్రయ రక్ష మానవులకున్ సద్వృత్త విజ్ఞేయమౌ । నుర్విన్ మించి తావు లేదొకటియున్ వ్యోమంబునం దెందునన్ ॥ తో 'వసుంధరా వృత్తతారావళి' ఆరంభమవుతుంది. విశేషమేమంటే 'పృథివి' తత్త్వం సృష్టికి హేతువు. జీవుల శరీరం పృథివి నించి ఏర్పడినది. మనుజులలో ఊర్ధ్వభాగం జ్ఞానమయమైన ధర్మమునకు, ఆ ధర్మము నిర్వహించుటకు శరీరం కింది భాగం 'పృథివి' ఉన్నట్టు రాజయోగం చెబుతున్నది. 'నమో రుద్రేభ్యో యే పృథివ్యాం యే అంతరిక్ష యే దివియేషామన్నం వాతోవర్ ష మిష వస్తేభ్యో దశ ప్రాచీర్దశ దక్షణాదశ' అన్ని నమకం చెబుతుంది. ఆకాశాద్వాయుః వాయురాగ్నిః అగ్నే రాపః పృథివీ ॥ పృథివ్యా ఓషధయః । ఓషధిభ్యోన్నం । అన్నాద్ రేతః రేతస్య పురుషః । సవా ఏష పురుషో న్న రసమయః ॥ అని తైత్తిరీయ ఉపనిషత్తు చెబుతోంది.

'ఇదం ద్యావా పృథివీ' అని ఋగ్వేదం, విశ్వకర్మ సూక్తం చెబుతోంది. ఆకాశానికి, భూమికి ఉన్న అవినాభావ సంబంధం తెలిపే వేదమంత్రాలన్నీ భూమి ప్రాశస్త్యాన్ని జలపరంగా కూడా విశదీకరిస్తాయి. అందువల్లనే 'జీవోత్పత్తి సముద్ర గర్భమున పుంజీభూత చైతన్య మాపై వేలాది శతాబ్దముల్ గడిచి భూభాగ ప్రవాసార్హ సత్వవిష్కారము సాగె రూప రస గంధాభిజ్ఞమై, సర్వత జీవాభ్యున్నతి హేతువున్ తలతు సంజీవిన్ మహాసింధువున్ ॥ అని భక్తితో ప్రణమిల్లారు.

"తస్మా అరంగా మామవో యస్యక్షయాయ జీన్వథ! ఆపోజనయదాచనః" అని ఋగ్వేదం ప్రవచిస్తుంది. 'ప్రతిదేహంబును మూడువంతులు జలప్రాయంబు, కాయాశ్రమా । గత ఘర్మోదక బిందువుల్ జలము, హృత్కం ప్రార్ధనేత్రంబు సం । గతి జూడ జలంబులైయడరు, నాకాశోద్భవానర్ఘ వృ । ష్టి తలంపన్ జలరాశి యా భువన సంక్షేమాస్పదన్ పాడెదన్ ॥ అని భువన సంక్షేమ మూలమైన నీటిని గానము చేసెదను అని ఈ ఈశ్వర విభూతిని వర్ణించారు అప్పాజోస్యుల.

ఋగ్వేద ప్రథమోక్త సూక్తమహితున్ పృధివీ జ్యాద్భాందవున్, దిగ్వాసో నిటలస్థ వైభవు హృదాదిత్య ప్రభారాశి విశ్వగ్వా యూజ్జ్వల మూర్తిత స్సకల జీవక్షత్ర చిచ్ఛక్తి ఋత్విగ్వర్యా ర్చితు సన్నుతించు నెడదన్ త్రేతాగ్ని రూపాన్వితున్ ॥ తో పావక వృత్తావళి ఆరంభమవుతుంది. 'ఓం అగ్ని మీళే పురోహితం యజ్ఞస్య దేవ మృతిజమ్' అనే ఋగ్వేద మంత్రానికి వ్యాఖ్యకు పై పద్యం సమాంతరం అనుకోవచ్చు. ప్రపంచ సృష్టి, స్థితి, లయాలకు కారకుడు అగ్ని. సమస్త వేద విహిత కర్మలకు అగ్నే ఆధారం. ఇది జ్ఞాన స్వరూపం. ఒరిపిడి వలన జనించి విస్తరించే స్వభావం కలిగినటువంటిది అగ్ని అని అర్థం అగ్ని వాయు మిత్రులు. అంతేగాక నీటి ఉత్పత్తికి కారణం అగ్నియే. అగ్ని తత్త్వమే జీవాళికి శ్రేయస్కరమైన ఇతర భూతాలలోనూ ఆవరించి ఉంటుంది (బృహత్ జ్యోతి స్తత్వపు మూల హేతువగు నిన్ శ్లోకిన్తు జ్ఞానగ్నియై).

'ఈ తారవళులన్నీ ఆంధ్రకవితా వ్యోమసీమలో మిల మిల మెరిసే హృద్యమంగళ శబ్దదీధితిమయ తారావళులు'-- అంటారు ఏల్చూరి మురళీధరరావు. అదే సమయంలో ఈశ్వర స్మృతికి, వేద శృతికి ప్రత్యామ్నాయ శ్లోకాలు కూడ.

**ఆయన కాషాయం ధరిస్తారు! కానీ, ఆధునిక కార్పోరేట్ ఉద్యోగులకు పాఠాలు చెబుతారు! ఆయన భగవద్గీత, వేద వేదాంతాలు, ఉపనిషత్తులు బోధించే అంశాలతో పాటు "లైఫ్-మనీ మేనేజ్‌మెంట్" "మనసా! రిలాక్స్ ప్లీజ్" "భగవద్గీత ద్వారా వ్యక్తిగత నైపుణ్య వికాసం" ఇలా ఆయన రాసిన నూట తొంభైకి పైగా పుస్తకాలు వివిధ భాషల్లో లక్షల్లో అమ్ముడవుతున్నాయి. కోట్లాదిమంది చదువుతున్నారు. ఆయన స్వతహాగా కన్నడం. కానీ సంస్కృత శ్లోకాలను ప్రస్తావిస్తారు. ఇంగ్లీషు, హిందీ, తెలుగు, తమిళ, కన్నడ భాషలను ఒక భాష నుంచి మరో భాషలోకి సునాయాసంగా మారుతూ, అనర్గళంగా మాట్లాడతారు. హీరో చిరంజీవి, పారిశ్రామిక వేత్త జిఎంఆర్ నుంచి దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దాకా ఎందరెందరినో తన బోధనలతో ఆకట్టుకున్న ఘనత . ఈ మోడ్రన్ స్వామీజీది! లైఫ్ మేనేజ్‌మెంట్ నుంచి మనీ మేనేజ్‌మెంట్ దాకా గడచిన నాలుగు దశాబ్దాలుగా కొన్ని వేల వర్క్ షాపులు నిర్వహణ ఈయన ప్రత్యేకత. ఒత్తిడి నిండిన ఈ డిజిటల్ జీవితంలో సతమతమయ్యే అలసిన మనసులకు.. ఆధ్యాత్మిక సూత్రాలను బోధిస్తూ.. జీవన సుఖాన్ని అందిస్తున్న ఆధునిక గురువు "స్వామి సుఖబోధానంద బోధన" లపై ఈ మాసపు దర్శనం పాఠకులకు ప్రత్యేకం.**

# అలసిన మనసులకు స్వామి సుఖబోధానంద ఆధ్యాత్మిక సూత్రాల బోధన


Joyful Living in a Digital age through Bhagavad Gita సెమినార్ ఇటీవల హైదరాబాదు కేశవ మెమోరియల్ ఆడిటోరియంలో జరిగింది. ''భగవద్గీత ద్వారా డిజిటల్ యుగంలో ఆనందకరమైన జీవనం''పై ప్రసన్న ట్రస్టు అధినేత స్వామి సుఖబోధానంద మాట్లాడారు.

భగవద్గీత ద్వారా ఈ డిజిటల్ యుగంలో ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఇంట్లో అయినా, ఆఫీసుల్లో అయినా సరే.. ఆనందకరమైన జీవనం ఉండాలి. ఎలా ఆనందంగా ఉండాలి. ఖుషీగా ఉండాలి. మన మనస్థితి మనకు సహకారంగా ఉండాలి. మన ఆత్మస్థితి భక్తిలో లీనమై ఉంటే మన జీవితమే మారుతుందనే అంశంపై ప్రవచనాలు చేశారుసుఖబోధానంద.

ఆధ్యాత్మిక సాధనలో భాగంగా మానసిక ఏకాగ్రత గురించి.. శివ సూత్రాలలో ఒక్కటైన ''ఉద్యమో భైరవః'' అంటే ఉద్యమోః అంటే ప్రయత్నమని, భైరవః అంటే దేవుడని, అంతిమ సత్యానికి ప్రతీకగా.. మన ప్రయత్నమే దేవుడని ఈ కలం జనరేషన్ (డిజిటల్ యుగం)కు సవివరమైన రీతిలో బోధించారు.

నవ్విస్తూ... బోధన గమత్తు

బోధన మూడు రకాలు. నారికేళ ఫలం-కొబ్బరికాయ. కదళీ ఫలం-అరటిపండు. ద్రాక్ష ఫలం. కొందరి బోధనలు కొబ్బరికాయలా పగులగొట్టి, కష్టపడితే కానీ, లోపలి గుజ్జు లభించదు. మరికొందరి బోధనలు అరటి పండులా పై తొక్కను



వలిస్తే, లోపలి పండు సులభంగా తినవచ్చు. ఇక ద్రాక్ష ఫలమనేది. నోట్లో వేసుకుంటే చాలు, రుచి తెలుస్తుంది. అలా వీరు ఆ విధానాన్నే అనుసరిస్తున్నారు. కానీ ద్రాక్షపండు



పెడదామన్నా కొందరు సులభంగా నోరు తెరవరు. అందుకే, హాస్యరసాన్ని వినియోగించి, వినోదం మధ్య అసలు బోధనను జొప్పించి, జీవితాన్ని సుఖవంతం చేసుకునే విధానాన్ని చెబుతున్నారు. అందుకే ఈయనను "మోడ్రన్ స్వామీజీ" అంటున్నారు.

అలా హిందీ భాషలో ఓ ప్రయోగంతో.. ఇలా మొదలు పెట్టారు.

జిందగీమే క్యా కోయా హై! ఔర్ క్యా పాయా హై!
బెషక్ కహ్నా! జో కుచ్ కోయా హై! ఓ మేరీ నాదానీ!
ఔర్ జో కుచ్ పాయా హై! రబ్కీ మెహర్బానీ తీ!
జో నహీ హై! ఖూబ్ సూరత్ రిష్తా హై!
మేరా ఔర్ భగ్వాన్కే బీచ్!
మై జాదా మాంగ్తా నహీ! ఓ కమ్ దేతా నహీ!
జో నహీ హై! ఉస్కో కమ్ నహీ హై!
జో హై! కిసిసే కమ్ నహీ!

ఒక్క మాటలో.. "థాట్" విచార్ ఆలోచన అనేది చలనం లేనిది. కానీ, "థింకింగ్" సోచ్నా ఆలోచించడం గతి శీలం. జీవితం కూడా ఎప్పటికప్పుడు మారిపోతూ గతిశీలమైనది. కాబట్టి, "థింకింగ్" అవసరమని చెబుతున్నారు.

"పత్రం పుష్పం ఫలం తోయం, యో మా భక్త్యా ప్రయచ్ఛతి." అత్యంత భక్తితో కళ్ళు మూసుకుని హృదయాన్ని తెరచి దేవుడి ఆశీస్సులను వేడుకోండి. భక్తిలో మీ మనసు కరిగిపోవాలి. దేవుడి ఆశీస్సులను మీలో భావన చేసి



అనుభవించాలి.

ఎవరైతే మీ ఆత్మలో ఆనందాన్ని చూస్తారో, వారే విజయవంతులు అవుతారని భగవద్గీతలో, ఉన్నదాన్నే మనం పాటించాలి. సుఖం, ఆనందం అనేవి ఈ భౌతికమైన మన శరీరంలో లేవు. అవి మన మనస్సులోనే ఉన్నవని క్రమంగా మనం గ్రహించాలి.

తిరుమల-తిరుపతి క్యూ తరహాలో మన మనస్సు పరుగులు పెడుతున్నదని, గీతా జ్ఞానంతో మనం నెమ్మదిగా సరిదిద్దుకోవాలని ఈ తరం యువతకు దిశానిర్దేశం చేశారు.

నీటిలో తామరను చూస్తే మనకు అర్థం కావాల్సిందేమిటంటే.. అది నీటిలోనే ఉంటుంది. కానీ, నీళ్లు అంటవు. అలా తామరాకు మీద నీటిబొట్టులా మనం గడపాలి. ఆఫీసు, ఇతరత్రా వ్యవహారాలలో మనం వెళ్ళాల్సివచ్చినప్పుడు వెళ్ళాలి. తప్పులేదు. కానీ, అక్కడి మనుషులతో ఆ సందర్భంలో వర్తమాన వ్యవహారంలో ఉండాలి. కానీ, దాన్ని మనసుకు ఎక్కించుకోకూడదు.

ముందు మనం ఆచరించి, ఇతరులకు చెప్పాలని అంటారు. ఈ విషయాన్ని స్వయంగా శ్రీకృష్ణుడుడే "అభ్యాసేన తు కౌంతేయ" అన్నట్లు. అభ్యాసం ద్వారానే.. భక్తి, జ్ఞానం, వైరాగ్యం సిద్ధిస్తాయి. సంగీతమైనా సాధన చేస్తేనే కదా పట్టుబడేది. అయితే, ఒక దాన్ని పూర్తిగా ఆచరించి, ఆ తర్వాతే ఇతరులకు బోధించాలనే సిద్ధాంతం మనం నమ్మాలి. ఇతరులకు బోధిస్తున్న సమయంలో మన బోధనకు మనం కూడా శిష్యులమే అంటారు. అలాంటి అవగాహన, వినమ్రత ఉంటె మనల్ని మనం మెరుగుపర్చుకుంటాం.

గతంతో పోలిస్తే ఇప్పుడున్న జీవన విధానంలో తీవ్రంగా ఒత్తిడి స్థాయి పెరిగింది. అలాగే సరికొత్త వ్యామోహాలు, మనిషిని మోహంలో పడేసే వలలు ఎక్కువయ్యాయి. ఇదే క్రమంలో ప్రజలంతా ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఎదురుచూస్తున్న తరుణమిది. వీటికి తోడు మీడియా, టెక్నాలజీ కూడా అభివృద్ధి చెందింది. ఇప్పుడు గతంలో కన్నా ఎక్కువ మంది ఆధ్యాత్మికత వైపు వస్తున్నారు. అయితే, చాలా మంది ఒత్తిడిని దూరం చేసుకోవడానికి రకరకాల వినోదాల వైపు మొగ్గు చూపుతున్నారు. అలా పలాయనంలో ఆ క్షణానికి ఒత్తిడికి దూరమైనా, తిరిగి ఒత్తిడిలోనే పడుతున్నారు. ఇలా

పరధ్యానం- పలాయనంతో కాకుండా, మన లోపలి ఖాళీని చూడటం అవసరం. దాన్ని అన్వేషిస్తే, ఒత్తిడి దూరమై, ఆనందం లభిస్తుంది.

భగవద్గీత లాంటి ఉత్తమ గ్రంథం ప్రపంచంలో మరొకటి లేదు. మతోన్మాదంతో చెబుతున్న మాట కాదిది. వివిధ గ్రంథాలు చదివి, వాటిలోని మంచివి వర్క్ షాపులో ప్రస్తావిస్తున్న వ్యక్తిగా చెబుతున్న మాటలివి అంటారు. వేల మంది గోపికలతో తిరుగుతూ, యుద్ధతంత్రాలు నడిపి, మాములు వ్యక్తిలా జీవించిన శ్రీకృష్ణుడు దేవుడేమిటనే వాళ్ళున్నారు. దేవుడంటే, సరైన మనిషి అంటే ఫలానాలా ఉండాలని మీకు మీరు అనుకుని, ఆ పరిధిలోకి శ్రీకృష్ణుడిని ఇరికించాలని ప్రయత్నించొద్దు. పారమార్థిక సత్తా-యాబ్ సొల్యూట్ రియాలిటీ, వ్యవహారిక సత్తా, ప్రతిభాసిక సత్తా-సబ్జెక్టివ్ రియాలిటీ.. ఈ మూడు అంశాలు ఆయనలో ఉన్నాయని, ఆయన చేసిదంతా ధర్మం ప్రాతిపదికన చేసిందే తప్ప, మరొకటి కాదు.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు "ప్రసన్న చేతసా" అంటారని, శారీరకంగా, మానసికంగా మాత్రమే కాదు. ఆత్మస్థితిలో ఆనందంగా ఉంటే, జీవితంలో సమస్యలన్నీ దూదిపింజలు అయిపోతాయి. మన భగవద్గీత, అలాగే ఖురాన్, క్రైస్తవ, బౌద్ధ, జైన తాత్వికతలను ప్రస్తావిస్తూ ఈ జీవన రహస్య బోధనలు ప్రసన్న ట్రస్టు ద్వారా చేయాలని మొదలు పెట్టారు. ప్రసన్న అంటే ఆనందంగా ఉండటం. అందుకే 1982లో ప్రసన్న ట్రస్టు ప్రారంభించినట్లు వివరించారు.

ఈ జనరేషన్‌లో ఎంతో మంది మానసిక ప్రశాంతత లేక ఎదుర్కొంటున్న ఐదు ప్రధాన సమస్యలు.

మానసిక ఒత్తిడి. ఇతరులతో బంధాలు. మందు లేని మానసిక గాయాలు. స్వప్నం సాకారం కాకపోవడం. ఎదుటి వాళ్ళు ఏమని అనుకుంటున్నారో అనే బెంగ. ఇవే ముఖ్య సమస్యలు. వీటికి విరుగుడు ఏలాగంటే...

1. ఒత్తిడి పరిస్థితుల వల్ల మానసిక ఒత్తిడి కలగటం లేదు. కేవలం మన మానసిక స్థితి వల్ల ఒత్తిడి ఫీల్ అవుతున్నాం. దాన్ని అర్థం చేసుకుంటే, మన మానసిక స్థితిని నియంత్రణలో పెడితే చాలు.

2. ఇతరులతో అనుబంధాల విషయానికి వస్తే.. ఎదుటి వాళ్ళు మనకు ఏలా ఉపయోగపడతారో అని ఆలోచిస్తున్నాం. భార్య-భర్త, తండ్రి, బిడ్డ.. ఇలా అన్నీ అనుబంధాలలో ఇదే సమస్య. కాబట్టి అవతలివారిని ఉపయోగించుకోవాలని చూడకుండా, చేతనైనంత వారికి మనమే ఇవ్వడం, సాయం చేయడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు.

3. మానసిక గాయం విషయానికి వస్తే.. జరిగిన సంఘటన



కన్నా, మనస్సులోని ఆలోచన మనల్ని బాగా గాయపరుస్తుంది. ద్రౌపది నవ్విందని, అవమానించిందన్న ఆలోచనే దుర్యోధనుడిని బాధించింది.

4. ఫలానా కావాలని కలలు కనడం. ఒక రకంగా భవిష్యత్తు తాలుకు భావన. వర్తమాన్ని వదిలేసి, భవిష్యత్తు మీదే దృష్టి పెట్టడం తప్పు.

5. మనకు మనం ఆనందంగా, హాయిగా ఉండకుండా ఎంతసేపూ అవతలి వాళ్ళ దృష్టిలో బాగుండాలని కోరుకుంటాం. అలా మన టీవీ రిమోట్ కంట్రోల్ ఎదుటి వ్యక్తి చేతిలో పెడతాం. అదే తప్పు.

సామాన్యుడి సుఖానికి చెప్పే జీవన మంత్రం ఒక్కటే. సాక్షాత్తూ సూర్యుడు చేయలేని పనిని. ఒక చిన్న దీపం చేయగలదు. చిమ్మచీకటిలో వెలుగులు విరజిమ్మగలదు. ఆ చిరు దీపమే. మన ఆత్మ విశ్వాసం. జీవితంలో ఏ పని చేసినా ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి. శ్రద్ధ, నమ్మకంతో అడుగులు వేయాలి. అప్పుడే విజయం వరిస్తుంది.

**- మామిడాల పండరి నాథ్**




(గత సంచిక తరువాయి)

తోటివారి పట్ల తాను క్రూరంగా ప్రవర్తించానని ఒక సందర్భంలో వ్యక్తి భావించాడనుకుందాం : తన యొక్క ఈ క్రూరమైన చర్య గతంలో తన క్రూరమైన ఆలోచనల వల్ల జరిగిందని అతను భావించాలి. క్రూరత్వం ద్వారా మాత్రమే వస్తువును పొందాలనే కోరికతో తనలో ఈ రకంగా క్రూరమైన ఆలోచనలు పెరిగాయని అతను గ్రహించగలగాలి.

తన క్రూరమైన చర్యలు తోటివారి దుఃఖానికి గురిచేస్తున్నాయని, తన క్రూరత్వానికి గురయిన వ్యక్తులు తనను ద్వేషిస్తున్నారని, తనకు ఇతరులు భయపడుతున్నారని గ్రహించినపుడు ఒక్కొక్కనికి తన ఏకాంతంలో సంతోషము పెరుగుతుంది. క్రమంగా అతను తన క్రూరచర్యల గురించి ఆలోచిస్తాడు. ఒక్కొక్కసారి అతను మారటానికి ప్రయత్నించినా తనకు సంబంధించిన పూర్వ జన్మలోని ఆలోచనలను మరియు కోరికల ఒత్తిడిని అడ్డుకోవడం అతనికి చాలా కష్టం.

క్రూరత్వం లేకుండా పొందలేని వస్తువులను పొందాలనే కోరిక ఉన్నప్పుడు, ఎవరయినా మొట్టమొదట కష్టాల మూలాన్ని ఆలోచించాలి. తన అంతరాత్మతో ఇలా సంభాషించకలగాలి: “నేను క్రూరమైన వాటిని కోరుకోను, మరియు నేను వాటిని కోరుకోవడం ప్రారంభించినప్పుడల్లా కోరిక కష్టాలను సృష్టిస్తుందని విషయాన్ని నేను గుర్తు పెట్టుకొంటాను.”

కోరిక తన ఆలోచనపై పెత్తనంచేయకుండా ప్రయత్నించి, కోరికను విశ్లేషించటానికి తన ఆలోచనను ఉపయోగించాలి. అప్పుడు కోరికలు కళ్లెం లేకుండా పారిపోతున్న గుర్రాల వలె అతనిని దూరంగా తీసుకువెళ్ళవు. అతను క్రమంగా ఆలోచనను ఒక కవచంలా ఉపయోగించగలగాలి. అప్పుడే కోరికలు అదుపులో ఉంటాయి. ఆనందం కలిగించే విషయాలు తనకు లభించినప్పుడు మాత్రమే వాటి వెంట పరుగెత్తడానికి కోరికలను అనుమతించకలగాలి.


నేటి కాలపు యువకులలో చాలామంది తమ కోరికలతో సమానంగా పరుగుపందెంలో పాల్గొంటూ, వాటిని దాటిపోలేక వాటిపై చాలా అసంతృప్తిని పొందుతున్నారు. సక్రమమయిన కోరికలను తెలివిగా నెరవేర్చుకొని పాతకాలంలోని పెద్దలు తెలివిగా ఎదిగారు. దుఃఖ కారకమైన గతపు ఆలోచనలు దురదృష్ట వాతావరణాన్ని కలిగిస్తాయి. చెడు కోరిక వలన గత కాలంలో పొందిన దుఃఖాన్ని గుర్తుంచుకుంటే, ఆ ఆలోచన కోరికను వెనక్కి లాగుతుంది.

ఇతరులకు మరియు తనకు సంతోషాన్ని కలిగించే కోరికలను విద్యార్థి బాగా పరిశీలించాలి. దీర్ఘకాలంలో ఏ వస్తువులు ఆనందాన్ని కలిగిస్తాయో, అలాగే ఏవి దుఃఖాన్ని కలిగిస్తాయో వాటిని బాగా అధ్యయనం చేయాలి. ఆపైన అందరితో కలిసి తన పూర్తి శక్తితో అందరికి ఆనందాన్ని కలిగించే కోరికలను నెరవేర్చటానికి ప్రయత్నించాలి.

జనన మరణచక్రం నుండి తప్పించుకోవడం అనేది ఏ

ప్రత్యేక జీవన విధానం ద్వారా పొందబడదని గ్రహించడం చాలా ముఖ్యం. కానీ శ్రీ కృష్ణుడు చెప్పిన ఈ మాట ఈ సందర్భంలో స్మరించాలి. "నా యందే ఏకత్వంతో స్థితుడై ఉండి, (అనగా అన్నిచోట్ల భగవంతుడున్నాడని నమ్ముతూ, ఆయనకు తనకు భేదం లేదని అంతా ఒకటే అని భావించగలగటం) సమస్త చరాచర జీవులలోను నన్నే దర్శిస్తూ, నన్నే పరమాత్మగా ఆరాధించిన యోగి, లౌకికంగా అన్ని రకాల కార్య కలాపములు చేస్తున్నప్పటికీ, నా యందే నివసిస్తాడు.1 (ఇలా భావించ కలిగినప్పుడు జనన మరణ చక్రం నుండి తప్పించుకోవడం జీవునికి సాధ్యమని భావం-) క్షత్రియ రాజయిన జనకుడు, వైశ్య వ్యాపారి అయిన తులాధరుడు మోక్షానికి సమానంగా అర్హులయ్యారు. వారు మోక్షం కోసం అడవికి పారిపోలేదు. ప్రపంచంలో జీవిస్తూనే ప్రాపంచిక వస్తువులపై కోరిక లేకపోవడం వల్ల జనకుడు, తులాధరుడు మోక్షము పొందారు.

దేహ సంబంధము లేనివాడయి (విదేహుడు) ఎప్పుడూ మనశ్శాంతితో ఉండే జనకుడు ఒకసారి ఇలా అన్నాడు. " నాకు దేనిమీదా కోరిక కలగదు కాబట్టి నాకు ఎటువంటి సంపదా, ప్రయోజనము లేకపోవటము అనేది లేదు. అన్నీ ఉన్నట్లే ఉంటుంది. మిథిలానగరము తగలబడిపోతున్నా నా దృష్టిలో మాత్రం అందులో ఏ ఒక్క వస్తువు తగలబడదు. ఇది నిజం."2



కనుకనే జనకుడు మాండవ్యునితో పై విషయాన్ని మరలా ఇలా కొంత విస్తరించి చెప్పాడు. "సంపదలు దుఃఖ నిలయాలు. సమస్యలకు మూలాలు. నాకు దేనిపైనా ఆశలేదు. అందువలన మిథిలా నగరం తగలబడుతున్నా నాకు ఏమి తగులబడినట్లు లేదు. ఈ లోకంలో కోరికలు నెరవేర్చుకోవటం వలన లభించే తృప్తి, ఆ కోరిక అదృశ్యమయితే వచ్చే ఆనందంలో పదహారవ వంతుకూడా ఉండదు. ఆవుతో పాటుగా ఆవు కొమ్ములు ఎలా పెరుగుతాయో, సంపదతో పాటు కోరిక కూడా పెరుగుతుంది. సంపదను మంచికొరకు ఉపయోగించాలి. కోరిక దుఃఖాన్ని కలిగిస్తుంది. సమస్త ప్రాణులను తనలాగా చూసుకుంటే, జ్ఞాని అన్ని దుఃఖాలనుండి విముక్తి పొందుతాడు."3

యాజ్ఞవల్క్య మహర్షి బోధ ద్వారా, జనక రాజు ముక్తిజ్ఞానాన్ని పొందాడు. ఆ ముక్తిజ్ఞానము అన్ని దుఃఖాలను అధిగమింప చేస్తుంది. అన్నింటికి అతీతమైన ఆ బ్రహ్మాన్ని పొందగలిగేలా చేస్తుంది. 4 ఈ విధంగా ముక్తిజ్ఞానాన్ని నేర్చుకున్న తరువాత, జనకుడు కూడా గురువుగా మారాడు. వ్యాసుడు కూడా తన కుమారుడైన శుకుడిని ముక్తిజ్ఞానాన్ని నేర్చుకోవడానికి జనకుని వద్దకు పంపాడు. 5




తాడేపల్లి పతంజలి

జాజలి అనే గొప్ప ముని తపస్సు చేసాడు. అతని తలమీద రెండు పిచ్చికలు గూడు కట్టాయి. గుడ్లు పెట్టాయి. గుడ్లు పిల్లలయాయి. వాటికి రెక్కలు వచ్చి, తిండికి ఎగిరి వెళ్ళి తిరిగి వచ్చేవి. పిచ్చిక దంపతులు పిల్లలతో అలా తన తల మీద గూటిలో ఉంటే, జాజలి వాటిని దయతో చూసి, వాటిని తరిమేవాడు కాడు. కొంతకాలం తరువాత తాను చాలా దయాశాలినని, తపశ్శాలినని జాజలికి గర్వం కలిగింది. ఒక రోజు అతను తనలో తాను ఇలా అనుకున్నాడు: "ఈ విస్తృత సముద్రం అంచుగా కలిగిన ఈ విశాలమైన భూమిలో నాలాంటి వారు ఎవరు?" అని తనలో తాను గర్వంగా అనుకొన్నాడు. అప్పుడు ఒక స్వరం అతనికి ఇలా వినిపించింది. -. "అలాంటి గర్వపు మాటలు అనవద్దు. ఎప్పుడూ కొనడంలోనూ, అమ్మడంలోనూ విశ్రాంతి లేకుండే ఉండే తులాధరుడనేవాడు నీలా మాట్లాడడు. అతనికి నువ్వు సమానం కాదు."

అప్పుడు బ్రాహ్మణుడు సన్యాసియయిన తనతో ఒక వ్యాపారిని పోల్చి, తనకంటే అతడు అధికుడని చెప్పిన ఆ ఆకాశ వాణి మాటలు విని జాజలి చాలా ఆశ్చర్యపోయాడు. జాజలి తులాధరుని స్వయంగా చూసి, తన మనస్సులోని చిక్కును పరిష్కరించుకోవడానికి బయలుదేరాడు. వారణాసి నగరానికి చేరుకున్నాడు. అక్కడ ఎవరు వస్తే వారికి అన్ని రకాల వస్తువులను అమ్ముతున్న ఒక దుకాణదారుడయిన తులాధరుని జాజలి చూసాడు.

జాజలిని చూసిన వెంటనే తులాధరుడు లేచి నిలబడి, ఆ బ్రాహ్మణునికి తగినట్లుగా నమస్కరించాడు. "పిచ్చికలు తలమీద గూడు పెట్టాయా?



అవీ, వాటి పిల్లలూ నీ తలమీద సుఖంగా బతుకుతున్నాయా? మనస్సులో వికారం లేకుండా చాలా గొప్పగా తపస్సు చేస్తున్నావు. మహాత్ముడివి నువ్వు" అని తులాధరుడు జాజలిని మెచ్చుకొన్నాడు." ఓ బ్రాహ్మణా! నువ్వు నా వద్దకు దయతో వచ్చావు; నేను నీకు ఏమి సేవ చేయగలను?" అని వినయంగా అడిగాడు. జాజలి తన గతం గురించి చెప్పిన ఈ వినయపూర్వక మైన వర్తకుని చూసి ఆశ్చర్యపోయాడు. "ఎలా నా గురించి తెలుసుకున్నాడితడు?" అంటూ ఆశ్చర్యపోయాడు. "వర్తకంలో మునిగిపోయిన నువ్వు నా ధర్మం గురించి తెలుసుకొనే మహిమను ఎలా పొందావో చెప్పు"మని తులాధరుని జాజలి అడిగాడు. ఆత్రుతగా వివరణ కోసం ఒత్తిడి చేసాడు.

అప్పుడు తులాధరుడు అతనికి అందరికీ తెలిసిన, చాలా తక్కువమంది మాత్రమే ఆచరించే ప్రాచీన నీతిని జాజలితో ఇలా చెప్పాడు -



"ఇందులో కొత్తగా చెప్పేదేముంది? కొనడంలోనూ, అమ్మడంలోనూ నేను ఎవరినీ మోసం చెయ్యను. తగినంత లాభమే తీసుకుంటాను. లాభనష్టాలు ఒకేలా చూసుకుంటాను. మట్టి పెళ్ళా, బంగారం ముక్కా ఒకటే నాకు. నిందా స్తుతీ ఒక్క టే. హింసా, ఆత్మప్రశంసా నా మనస్సులో లేవు. జీవులన్నిటినీ సమానంగా దయతో చూస్తాను. భోగమూ, కీర్తీ నేను కోరుకోను. ఎవరికైనా మేలు చేసి, ఎంతో చేసానని అనుకోను. దేనిమీదా మమత పెట్టుకోను. లోకమంతటిని చిత్రంగా చూస్తాను. తామరాకుమీద నీటి బొట్టులాగ నా మనస్సు దేనిమీదా అంటి పెట్టకుండా ఉంటుంది. ఎవరినీ పొగడను. అలాగే నిందించను. కన్నీళ్లు పెట్టుకోను. ఎవరికీ భయపడను. ఇలా ఎవరికీ తప్పుచేయ కుండా జీవించినప్పుడు తప్పనిసరిగా అతడు బ్రహ్మను పొందుతాడు" (మోక్షానికి అర్హుడవుతాడు).

క్రూరప్రవృత్తి వల్ల జంతువులకు, మనుషులకు కలిగే గాయాలను గురించి, త్యాగం యొక్క స్వభావం, నిజమైన తీర్థయాత్ర గురించి తులాధరుడు పై విధంగా చాలా అందంగా ప్రసంగించాడు. హానిచేయని స్వభావం ద్వారా మోక్షం ఎలా పొందవచ్చో నిరూపించాడు. 6

**కామమయ ఏవాయం పురుష ఇతి, స యథాకామో భవతి తత్క్రతుర్భవతి,**

**యత్క్రతు ర్భవతి తత్కర్మ కురుతే యత్కర్మ కురుతే తదభిసంపద్యతే ॥ 7**

పురుషుడు కామమయుడు. అతనికి ఎటువంటి కామ ముంటుందో అటువంటి సంకల్పము ఉంటుంది. ఎటువంటి సంకల్పమో అటువంటి కర్మ ఉంటుంది. ఎటువంటి కర్మ ఉంటుందో అటువంటి ఫలితముంటుంది.

**తద్ ఏవ సక్తః సహకర్మణా ఏతి, లింగం మనో యత్ర నిషక్తమస్య ॥ 8**

జీవునియొక్క, లింగ శరీరమున ప్రధానమగు మనసు ఏఫలమునందు ఆసక్తి కలది యగునో, ఆ ఫలమునే తన కర్మచే జీవుడు పొందుచున్నాడు.

**అథ ఖలు క్రతుమయః పురుషో యథా క్రతురస్మిన్లోకే**
**పురుషో భవతి-తథేతః ప్రేత్య భవతి ॥ 9**

పురుషుడు సంకల్పమయుడు. అతని సంకల్పం ఎలా ఉంటే, అలా ఫలితం వస్తుంది. మరణానంతరం బ్రహ్మలోకం వెళతాడు. దీన్ని క్రమముక్తి అంటారు."

(పరమాత్మ యజ్ఞమయుడు. ఈ లోకంలో మానవుడు ఎట్టి పుణ్యకర్మలు చేయునో, అందుకు తగిన పుణ్య లోకములను మరణానంతరము పొందుచున్నాడు అని ఈ మంత్రానికి వేరొక అనువాదం).

**న మాం కర్మాణి లింపంతి న మే కర్మఫలే స్పృహా ।**
**ఇతి మాం యో-భిజానాతి కర్మభిర్న స బధ్యతే ॥**
**ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః ।**
**కురు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్ ॥ 10**

కర్మలు నన్ను అంటవు. నేను కర్మఫలములలో కూడా ఆసక్తుడను కాను. ఎవరైతే నన్ను ఈవిధంగా తెలుసుకుంటారో, వారు కర్మ బంధాలలో చిక్కుకోరు.

ఈ సత్యాన్ని తెలుసుకొని, ప్రాచీనులు (మోక్షం పొందిన వారు) తమ కర్మలను ఆచరించారు. కాబట్టి, నువ్వు కూడా ఆ ప్రాచీనుల అడుగుజాడలలో నడుస్తూ, నీ కర్తవ్యాన్ని నిర్వహించు.


**యస్య సర్వే సమారంభాః కామసంకల్పవర్జితాః ।**
**జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః ॥**
**త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః ।**
**కర్మణ్యభిప్రవృత్తో-పి నైవ కించిత్ కరోతి సః ॥**
**నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహః ।**
**శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥**
**యదృచ్ఛాలాభసంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః ।**
**సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే ॥**
**గతసంగస్య ముక్తస్య జ్ఞానవస్థితచేతసః ।**
**యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే ॥ 11** (సశేషం)

# క్షయ సంవత్సరం బార్హస్పత్యమానం

**వేదాంగమైన జ్యోతిష శాస్త్రం ఎంతో ఉత్కృష్టమైంది. దీనిలో అంతర్భాగమైన సిద్ధాంత గణిత శాస్త్రం ఎన్నో అద్భుతాలకు సమున్నతమైంది. సూర్య భగవానుడే స్వయంగా మయాసురుడికి ఉపదేశించిన 500 శ్లోకాల సూర్య సిద్ధాంతం జ్యోతిష శాస్త్రానికి తలమానికం. యుగయుగాలుగా ఈ సిద్ధాంతమే భారతీయ సనాతన ఆర్ష వైజ్ఞానిక ప్రాభవానికి ప్రతీకగా నిలుస్తోంది. పాశ్చాత్య ఖగోళ శాస్త్రజ్ఞులను సైతం ఊహకందని అపురూప ఖగోళ గణిత సిద్ధాంతం సూర్యసిద్ధాంతం. ఖగోళంలో జరిగే అనేక మార్పులు, గమనాలు ఈ సిద్ధాంతంలో నిక్షిప్తమై ఉన్నాయి. ప్రధానంగా సిద్ధాంత గణితంలో ఎనిమిది దశాబ్దాలకు ఒకసారి వచ్చే క్షయ సంవత్సరం, అరుదుగా వచ్చే క్షయ మాసం తరచూ వచ్చే అధిక మాసాలు సూర్యసిద్ధాంతం వల్ల పంచాంగకర్తలకు, సిద్ధాంతులకు ద్యోతకమవుతాయి. బార్హస్పత్యమానంలో వచ్చే ఉగాది నుంచి ఒక సంవత్సరం లుప్తమవుతోంది. ఈ అపురూప ఖగోళ వైపరీత్య విషయాన్ని, సూర్యసిద్ధాంతం ప్రమాణాలను సోదాహరణంగా, లోతుగా పరిశీలించి, పరిశోధించి అందిస్తున్న శృంగేరి ఆస్థాన జ్యోతిర్విద్వాంసులు డా. శంకరమంచి రామకృష్ణ శాస్త్రి, వారి కుమారులు శంకరమంచి శివ గారల విశేష సిద్ధాంతవ్యాసాల సమహారం దర్శనమ్ కోసం.**

---

క్షయ సంవత్సరము అంటే ఏమిటి? బృహస్పతి 0డి4ని59సె వేగంతో ఒక రాశిలో సంచరించడానికి 13 నెలల కాలం పడుతుంది. మధ్యమ బృహస్పతి, ఒకే సంవత్సరంలో(నిరయణ మేషార్క సమయంలో) రెండు రాశులను దాటినప్పుడు లేదా స్పష్ట బృహస్పతి 10 నెలల్లో (చైత్ర శుక్ల ప్రతిపద నుండి చైత్ర కృష్ణ అమావాస్య వరకు) రెండు రాశులను దాటినప్పుడు, దానిని లుప్త సంవత్సరము అంటారు.



క్షయ(లుప్త) సంవత్సరానికి సంబంధించిన పరిశీలన, గురు సంవత్సరానికి సంబం ధించిన అంశమిది. (2026 పరాభవ సంవత్సరంలో లుప్త సంవత్సరం సిద్ధార్థి, వర్తమాన సంవత్సరం రౌద్రి). శ్రీ కాశీ విశ్వనాథ్ పంచాంగం (హృషికేష్ పంచాంగం) ద్వారా సంవత్సరాన్ని నిర్ణయించే ప్రక్రియ గతంలో 1939-40, 1940-41 మధ్య జరిగింది. గణిత మార్గాలను అనుసరించి గురువు మధ్యమమాన గతి ద్వారా, నిరయణ మేష సంక్రాంతి ఆధారంగా సృష్ట్యాది/ కలియుగం నుండి సూర్యసిద్ధాంతం ప్రకారం విజయాదిగా సంవత్సరాన్ని ఉపయో గించాలి. (సృష్ట్యాదౌ విజయ సంవత్సర త్వాత్).

సూర్య సిద్ధాంతం ప్రకారం, బృహస్పతి ద్వాదశరాశి పరిభ్రమణ కాలం (భగణ పూర్తి-కాలం) 4332.32 రోజులు, అంటే సుమారు 11.86 నక్షత్ర సంవత్సరాలు. కాబట్టి మధ్యమ వేగంతో లెక్కిస్తే, బృహస్పతి ఒక రాశిలో ఒక సంవత్సరం పాటు ఉంటాడు. దీనిని ఉపయోగించుకుని 12 బార్హస్పత్య సంవత్సరాల చక్రాన్ని సృష్టించారు. సూర్య సిద్ధాంతరీత్యా గురు ఒక భగణాన్ని 12తో భాగిస్తే, మనకు సిద్ధాంత గణిత మధ్యమగతి 361.026721 రోజులు వస్తుంది, ఇదిబార్హస్పత్య సంవత్సరానికి సంవత్సర ప్రమాణంగా అంగీకరించబడింది. ఇది సూర్య సిద్ధాంత సౌర సంవత్సరం కంటే 4.232 రోజులు తక్కువ. కాబట్టి, బార్హస్పత్య సంవత్సరం, సౌర సంవత్సరం ఒకే రోజున

ప్రారంభమైతే, బార్హస్పత్య సంవత్సరం వెనుకబడిపోవడం మొదలవుతుంది. సూర్య సిద్ధాంతం ప్రకారం, 85.30806 సౌర సంవత్సరాలలో ఒక బార్హస్పత్య సంవత్సరకాలం అధికమవుతుంది. అందువల్ల ఇది 85.30806 సౌర సంవత్సరాలు 86.030806 బార్హస్పత్య సంవత్సరాలకు సమానం అవుతాయి, ప్రతి 85.30806 సంవత్సరాలకు ఒక బృహస్పతి సంవత్సరం లుప్తమవుతుంది, దానిని బృహస్పతి క్షయ సంవత్సరం అంటారు. వాస్తవ ఆచరణలో రెండు క్షయ సంవత్సరాల మధ్య కాలం కొన్నిసార్లు 85 నుండి 86 సంవత్సరాలు ఉంటుంది. ఇది కేవలం మధ్యమ రాశి భోగం వల్లనే సాధ్యం.

## లుప్తసంవత్సరాన్ని నిర్ణయించడంలో సమస్య

వివిధ పంచాంగాలలో వేర్వేరు సంవత్సరాలు లుప్తమైనట్లుగా పరిగణించబడ్డాయి. కొందరి ప్రకారం గతంలోనే సంవత్సరం లుప్తమైనట్లు, రాబోయే సంవత్సరంలో కొన్ని లుప్తమవుతునట్లుగా పరిగణించబడ్డాయి. పంచాంగం అనేది భౌగోళిక స్థానం (దేశాంతరం), విభిన్న గణిత సూత్రాల ఆధారంగా తయారు చేయబడుతుంది. అందువల్ల, గ్రహాల స్థానాలు పంచాంగాలలో కనిపించే విలువలతో భిన్నంగా ఉండటం సహజం. అందువల్ల, సంవత్సరాలను నిర్ణయించే వివిధ పద్ధతులు, గురువు యొక్క భోగంలో వ్యత్యాసం కారణంగా, సంవత్సరాలను నిర్ణయించడంలో తేడా ఉంది. స్పష్టత కోసం ఇప్పుడు సూర్య సిద్ధాంతం ప్రకారం లుప్త సంవత్సరం నిర్ణయించబడుతున్నది.

విక్రమ సంవత్సరానికి సనాతన వ్యవస్థలో ప్రాముఖ్యత ఇవ్వబడింది. ధార్మికపరమైన కార్యకలాపాలన్నీ చైత్ర శుక్ల ప్రతిపద నుండి చైత్ర కృష్ణ అమావాస్య వరకు గల చాంద్రమాసంపై మాత్రమే ఆధారపడి ఉంటాయి. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే 60 సంవత్సర చక్రంలో ఏ సంవత్సరం అంతరించి పోయినట్లుగా పరిగణించాలి? వేర్వేరు పంచాంగాల ఆధారంగా, వేర్వేరు సంవత్సరాలు కలిగి ఉన్నాయి, లుప్తమయ్యాయి. లుప్తవత్సర నిర్ణయానికి ఏ పద్ధతిని ప్రామాణికంగా పరిగణించాలి? మధ్యమ గతి వ్యవస్థలో గ్రహాలు స్వతంత్ర స్థితిలో ఒకే వేగంతో తమ కక్ష్యలో తిరుగుతాయి. కానీ గ్రహాల స్పష్టమైన విలువలలో వ్యత్యాసం సహజమైనది. (వాస్తవానికి, స్పష్ట గ్రహ విలువలు దాని సగటు స్థానానికి ముందో, వెనకో డోలనం చెందుతాయి, అది "వక్రానువక్ర వికలా మందా మంద తరాసమా", అను గ్రహ గతులను బట్టి ఉంటుంది.)

బృహస్పతి రాశి మారటం, చాంద్రమాన నూతన సంవత్సరం ప్రారంభం ఒకేసారి జరగవు. బృహస్పతి తన కక్ష్యలో ఎక్కడ ఉన్నా, సంబంధిత చైత్ర శుక్ల ప్రతిపద లేదా మేష సంక్రాంతి



సమయంలో ఉన్న సంవత్సరాన్ని బట్టి, అంటే, నూతన సంవత్సరం ప్రారంభాన్ని బట్టి, షష్టిచక్రంలో విజయాదిగా నూతన సంవత్సర నామం నిర్ణయమవుతుంది. సంవత్సర ఫలంలో ఈ నామం ఉపయోగించబడుతుంది. సంహితాధారంగా ఫలితం చెబుతారు. అయితే, బృహస్పతి మధ్యంతర రాశి ప్రకారం, ఇది చాలా ముందుగానే ప్రారంభమవుతుంది.

సంవత్సర విషయానికొస్తే, సంవత్సరము అనేది అన్ని ఋతువులు ఒక నిర్దిష్ట క్రమంలో పునరావృతమయ్యే కాలాన్ని సూచిస్తుంది. బృహస్పతి ఒక శుభ గ్రహం కాబట్టి, దీనికి సంవత్సర నిర్ణయంలో ప్రత్యేక స్థానం ఇవ్వబడింది. వివిధ పంచాంగాలు వారి గణిత వ్యవస్థ ప్రకారం సంవత్సరనామాన్ని నిర్ణయిస్తారు. వీటిని ఏడాది పొడవునా సంకల్పాలు, ఇతర ఆచారాలలో ఏడాది పొడవునా ఉపయోగించే 60 సంవత్సర చక్రం ఉంటుంది. సూర్య సిద్ధాంతంలోఈ సంవత్సర చక్రం విజయాదిగా ప్రారంభమవుతుంది. అయితే వరాహమిహిరుడు దీనిని ప్రభావాదిగా ప్రారంభమవు తుందని భావిస్తాడు. ఈ కారణంగా, సంవత్సర చక్రంక్ర క్రమ సంఖ్య అప్పటినుండిసహజంగా మారింది.

ఇది- సంవత్సరాన్ని తెలుసుకోవడానికి ఏకైక ఆధారం-

**నరాణాం వ్యావహారికమానాన్యాహ...**

**చతుర్భిర్వ్యవహారో2త్ర సౌరచాంద్రార్క్షసావనైః .**

**బార్హ స్పత్యేన షష్ట్యబ్దం జ్ఞేయం నాన్యైస్తు నిత్యశః**

(2 సూర్యసిద్ధాంతం)

(సశేషం)

# శ్రీమద్దేవీభాగవతం

## నవమ స్కందం



(గత సంచిక తరువాయి)

గంగను లోకానికి అందించి రక్షించాలనే బ్రహ్మ భావాన్ని గ్రహించి కృష్ణుడు కాలి బొటన వ్రేలి నుండి గంగను విడిచిపెట్టాడు. అప్పుడు బ్రహ్మ ఆమెకు రాధామంత్రాన్ని ఉపదేశించాడు. గంగ గోలోకాన్ని తన జలంతో నింపింది.

బ్రహ్మ గంగను నారాయణుని వద్దకు తీసుకొనివచ్చాడు. ఈమెను స్వీకరించమన్నాడు. బ్రహ్మ నారాయణునితో ఇలా అన్నాడు - నారాయణా! నీవు సగుణ నిర్గుణ భగవంతుడివి. ప్రకృతికి అతీతుడవు. శ్రీకృష్ణుడు తన శరీరం రెండుగా విభజించగా రాధాకృష్ణులు, లక్ష్మీనారాయణులు ఆవిర్భవించిన విషయం మాకందఱకూ తెలుసును. నీకూ కృష్ణునకూ భేదం లేదు. గంగ నీ నుండి ఆవిర్భవించింది. ఈ గంగ నిన్ను వరించింది. స్వీకరించు. ఈమెకు లక్ష్మికి భేదం లేదు. ఇలా బ్రహ్మ పలికి గంగను నారాయణునకు సమర్పించి వెళ్ళి పోయాడు. అనంతరం గంగ విష్ణుని శరీరంలో చేరి ఆయన పాదాల నుండి బయటకు వచ్చి 'విష్ణుపది' అని పిలవబడి భూలోకానికి చేరి, ప్రజలను తరింపజేయసాగింది. ఇది సరస్వతికి అసూయ కలిగించింది. అనంతరం భారతదేశంలో పుట్టమని శపించిన విషయం నీకు తెలిసిందే. భరించేవాడిని భర్త అంటారు. లక్ష్మిని, సరస్వతిని, గంగను కూడ భరించి, విష్ణువు వీరికి భర్త అయ్యాడు. ఇది శారీరక బంధం కాదురి. అనంతరం తులసి కూడా ఆయనకు భార్య అయ్యింది. ఈ విధంగా నారాయణునకు నల్గురు భార్యలు.

నారదుడు మరలా నారాయణుని ఇలా అడిగాడు - దేవా! తులసి నారాయణునికి భార్య ఎలా అయ్యింది? ఆమె రాక్షస వీరుని ఎలా భర్తగా పొందింది? ఈ విశేషాలన్నీ వివరించు. నారాయణుడు తులసీ వృత్తాంతాన్ని వివరిస్తూ ఇలా పలికాడు - మనువులలో దక్షసావర్ణి ఒకడు. అతడు పుణ్యాత్ముడు. విష్ణుభక్తుడు. శుచివంతుడు. అతని పుత్రుడు బ్రహ్మసావర్ణి. ధర్మాత్ముడు, విష్ణుభక్తుడు. అతని కొడుకు ధర్మసావర్ణి. విష్ణుభక్తుడు. జితేంద్రియుడు. ఆతని పుత్రుడు రుద్ర సావర్ణి. శక్తిమంతుడు. జితేంద్రియుడు. ఆతని పుత్రుడు దేవసావర్ణి. విష్ణువ్రత పరాయణుడు. అతని పుత్రుడు ఇంద్రసావర్ణి. విష్ణుభక్తుడు. ఇంద్రసావర్ణి కొడుకు వృషధ్వజుడు. అతడు శివభక్తిపరాయణుడు. అతని ఆశ్రమంలో మూడు దేవయుగాల కాలం శంభుడు నివసించాడు. శివునికి తన పుత్రునిపై కన్న అతనిపై ప్రీతి ఎక్కువ. అతడు కూడా విష్ణువును, లక్ష్మిని, సరస్వతిని సర్వదేవతలను విడచి కేవలం శివుని మాత్రమే పూజించేవాడు. భాద్రపదంలో మహాలక్ష్మిని పూజించ లేదు. మాఘమాసంలో పంచమీ వ్రతం చేయలేదు. సరస్వతిని పూజించలేదు. కేవలం శివుని మాత్రమే పూజించాడు.



డా॥ వద్దిపర్తి పద్మాకర్

అతనిపై సూర్యునకు ఆగ్రహం కలిగింది - వృషధ్వజా! శివభక్తితో తక్కిన దేవతలను పూజించడం లేదు కనుక నీ సంపదలన్నీ నశించిపోతాయి, అని శపించాడు. వృషధ్వజుని జోలికి ఎవరు వచ్చినా శిక్షిస్తానని శివుడు పూర్వం వరం ఇవ్వడం వల్ల, సూర్యుడు, వృషధ్వజుని శపించడంతో, శూలం ఎత్తి శివుడు సూర్యుని శిక్షించబోయాడు. సూర్యుడు కంగారుపడి, తన తండ్రి కశ్యపునితో కలసి బ్రహ్మను రక్షించమని వేడుకొన్నాడు. రౌద్ర స్వరూపుడైన శూలపాణిని చూచి బ్రహ్మ కూడా భయపడి వారందరితో కలసి వైకుంఠానికి వెళ్ళి విష్ణువును దర్శించుకొన్నాడు.

వణకిపోతూ, నారాయణుని స్తుతిస్తూ రక్షించమని వేడుకొన్నాడు. అప్పుడు శ్రీహరి వారికి అభయం ఇస్తూ ఇలా పలికాడు -

**శ్లో॥ స్థిరా భవత హే భూతా భయం కిం చ మయిస్థితే**
**స్మరంతి యే యత్ర యత్రమాం వి పత్తౌ భయాన్వితాః**
**తాం తత్ర గత్వా రక్షామి చక్రహస్తః త్వరాన్వితః ॥**

(శ్రీ.దే.భా. స్కం.9. అ.20,21)

దేవతలారా! కంగారుపడకండి. నేనుండగా భయం ఎందుకు? ఎవరు ఎక్కడెక్కడ నన్ను ఆపదలందు భయపడి రక్షించమని కోరి స్మరిస్తున్నారో, అక్కడక్కడకు, చక్రహస్తుడనై, మహావేగంగా వెళ్ళి, వారిని రక్షిస్తుంటాను.

తెలిసికాని, తెలియక కాని ఒక్కసారి నన్ను స్మరించినవారికి భయముండదు. నేను సర్వలోకపాలకుడను. బ్రహ్మరూపంలో సృష్టిస్తాను. శివరూపంలో సంహరిస్తాను. విష్ణురూపంలో పాలన చేస్తుంటాను. శివుడను నేనే. బ్రహ్మనునేనే. సూర్యుడను నేనే. మీరూనేనే. ఒక్కడనే అయి కూడా సర్వరూపాలు ధరిస్తుంటాను. సర్వగుణాలు ధరించి, లోకపాలన చేస్తుంటాను. మీకు శుభం కలుగుతుంది. నా వరం వలన మీకు శంకరుని వలన భయం ఉండదు. కారణం శంకరుడు భక్తవత్సలుడవ్వడమే.

**శ్లో॥ సర్వేశో వై స భగవాన్ శంకరశ్చ సతాంపతిః**
**భక్తాధీనశ్చ భక్తానాం భక్తాత్మా భక్తవత్సలః ॥**

(శ్రీ.దే.భా. స్కం.9. అ.15. శ్లో.25)

శంకరుడు భగవంతుడు. సర్వేశుడు. సజ్జనవల్లభుడు. భక్తులకు అధీనమవుతాడు. భక్తులకు ఆయనయే ఆత్మ. భక్తులపై వాత్సల్యం కలిగి ఉంటాడు. సుదర్శనుడు, శివుడు నాకు ప్రాణాలకంటె కూడా ఎక్కువగా ఇష్టులు. ఈ భువన బ్రహ్మాండాలలో సుదర్శనచక్రం, శివుడు- వీరిని మించిన తేజోమూర్తులు లేరు. మహాదేవుడు కోట్ల సూర్యులను, తన మహామహిమతో సృష్టించగలడు. శూలికి కోట్ల బ్రహ్మలను సృష్టించడం చాలా చిన్న విషయం. తన పంచముఖాలతో నన్నే నిరంతరం ధ్యానించే మహాత్ముడు. నేను శివుని శుభం గూర్చి నిరంతరం ధ్యానిస్తుంటాను. నన్ను ఎవరెలా సేవిస్తారో నేను వారినలాగే సేవిస్తుంటాను.

**శ్లో॥ శివస్వరూపో భగవాన్ శివాధిష్ఠాతృ దేవతా**
**శివం భవతి తస్మాచ్చ శివం తేన విదుర్బుధాః ॥**

(శ్రీ.దే.భా. స్కం.9. అ.15. శ్లో.30) (సశేషం)






# మహాభారతసారసంగ్రహము

(గత సంచిక తరువాయి)

"మధుసూదనా! పాండవుల విషయంలో జరిగిన అన్యాయాలన్నీ నీకు తెలియును కదా? సంజయుని ద్వారా రహస్యంగా జరిగిన మంతనాలూ యుధిష్ఠిరుడు ఐదు గ్రామాలిచ్చినా చాలు అనడం, దానికి కూడా దుర్యోధను డంగీకరించకపోవడం ఇన్నీ చూస్తూనే ఉన్నావు.

రాజ్యం ఇవ్వకుండా దుర్యోధనుడు సంధిని కోరినట్లయితే నీవు అందుకు అంగీకరించవద్దు. ఆ దుష్టులందరినీ తప్పకుండా వధించవలసిందే.

వధించకూడనివానిని వధిస్తే ఎంత దోషమో వధించివలసిన వానిని వధించకపోయినా అంత దోషం అని ధర్మవేత్తలు అంటారు.

**యథా వధ్యే వధ్యమానే భవేద్దోషో జనార్దన,**
**స వధ్యస్యావధే దృష్ట ఇతి ధర్మవిదో విదుః.**

(ఉద్యోగపర్వం 82.18)

ఆ దోషం నీకు తగలకుండా చూచుకో.

నువ్వేమీ అనుకొనవు కదా అని చెప్పిన విషయమే మళ్లీ చెపుతున్నాను. కేశవా! ఈ పృథివీ మండలంలో నా వంటి స్త్రీ ఎవరుంది? నేను వేదిమధ్య నుండి జనించినదానను. ద్రుపదుని కుమార్తెను. ధృష్టద్యుమ్నుని సోదరిని, నీ ప్రియసఖిని, పాండు మహారాజు కోడలిని. ఐదుగురు ఇంద్రుల వంటి పాండవుల పట్టమహిషిని. ఐదుగురు మహారథుల తల్లిని. నీకు వాళ్లైదుగురూ అభిమన్యుడు వంటివారే.


కీ.శే. ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు

**అభిమన్యుర్యథా కృష్ణ తథా తే తవ ధర్మతః.**

(ఉద్యోగపర్వం 82.23)

అలాంటి నన్ను, పాండవులందరూ చూస్తుండగా, నువ్వు జీవించి ఉండగా జుట్టు పట్టి సభలోనికి తీసికొని వెళ్లి బాధించారు.

పాండవులు, పంచాలదేశరాజులు, యాదవులు - వీళ్లందరూ జీవించి ఉండగా నన్ను సభలో దాసీని చేసి నిలబెట్టారు.

పాండవు లందరూ ఏ మాత్రమూ కోపం చూపకుండా, కదలకుండా, మెదలకుండా చూస్తూ కూర్చున్నప్పుడు "నన్ను రక్షించు" అంటూ మనసా నిన్ను ధ్యానించాను.

ఆ సమయంలో "నీ కేమి వరం కావాలో కోరుకో" అని మామగారు అడగగా పాండవుల నందరినీ దాస్యవిముక్తులను చేయమని కోరాను.

జనార్దనా! నేను పడ్డ ఈ కష్టాలన్నింటినీ గూర్చి నీకు తెలుసును. నేను ధర్మం ప్రకారం ధృతరాష్ట్రునికీ, భీష్మునికీ కూడ కోడలినే కదా? అలాంటి నన్ను బలాత్కారంగా దాసీని చేశారు. కృష్ణా! దుర్యోధనుడింత చేసిన తరువాత కూడ ముహూర్తకాలమైనా అతడు జీవించి ఉన్నాడంటే ఛీ! అర్జునుని ధనుర్ధారిత్వం ఎందుకు? భీముని బలం ఎందుకు?

కృష్ణా నీకు నా యందు అనుగ్రహం ఉంటే, నామీద జాలి ఉంటే, ఈ కోపాన్నంతనీ కౌరవుల మీద ప్రయోగించు."

ఇలా అంటూ ద్రౌపది అశ్రువుల నిండిన కండ్లతో, ఎడమ చేతితో తన కేశపాశాన్ని పట్టుకొని కృష్ణునికి చూపుతూ - పుండరీకాక్షా! నువ్వు శత్రువులతో సంధిని కోరుతూ మాటలాడేటప్పుడు - దుఃశాసనుడు పట్టి లాగిన ఈ కేశపాశాన్ని గుర్తుంచుకో.

కృష్ణా! భీమార్జునులు దీనులైపోయి సంధి కోరే పక్షంలో వృద్ధుడైనా నా తండ్రి మహారథులైన తన పుత్రులతో కలిసి వచ్చి యుద్ధం చేస్తాడు. నా ఐదుగురు పుత్రులూ, అభిమన్యుణ్ణి ఎదుట ఉంచుకొని కౌరవులతో యుద్ధం చేస్తారు.

ఛిన్నమై నేలమీద పడి బూడిద కప్పిన దుఃశాసనుని భుజం చూచేవరకు నా హృదయానికి శాంతి ఉండదు.

**దుఃశాసనభుజం శ్యామం సంఛిన్నం పాంసుగుణ్ఠితమ్,**
**యద్యహం తు న పశ్యామి కా శాన్తిర్ హృదయస్య మే.**

(ఉద్యోగపర్వం 82.39)

నా కోపాన్నంతనీ మండుతూన్న అగ్నిని దాచుకొన్నట్లు నా హృదయంలో దాచుకొని నిరీక్షిస్తుండగా పదమూడు సంవత్సరాలు గడిచాయి. ఇప్పుడు ధర్మాన్ని గూర్చి మాటలాడుతున్న భీముని మాటలు శల్యాలలాగ గుచ్చుకొని నా హృదయం బ్రద్దలైపోతూన్నది" అని బిగ్గరగా ఏడ్చింది.

కృష్ణుడు ఆమెని ఓదారుస్తూ - ద్రౌపదీ! నీ శత్రువుల స్త్రీలందరూ బంధువులందరూ మరణించి ఏడుస్తూండగా అచిరకాలంలోనే చూస్తావు- యుధిష్ఠిరుడు ఆజ్ఞాపించగా నేను భీమార్జునులతోను, నకుల సహదేవులతోను కలిసి కౌరవులను నశింప చేస్తాను.

హిమవత్పర్వతం చలించవచ్చు. భూమి నూరు ముక్కలు కావచ్చు. నక్షత్ర సహితమైన ఆకాశం క్రిందికి పడిపోవచ్చు. కాని నా మాట వ్యర్థం అవడానికి వీలు లేదు.

**చలేద్ధి హిమవాన్ శైలో మేదినీ శతధా ఫలేత్,**
**ద్యౌః పతేచ్చ సనక్షత్రా న మే మోఘం వచో భవేత్.**

(ఉద్యోగపర్వం 81.78)

ద్రౌపదీ! కన్నీళ్ళు కార్చకు నేను ప్రతిజ్ఞ చేసి చెపుతున్నాను.



అనతి చిరకాలంలో నీ భర్తలు శత్రువులను సంహరించి జయలక్ష్మితో విరాజిల్లుతూండగా చూస్తావు అన్నాడు.

**కృష్ణుడు హస్తినపురానికి ప్రయాణం అగుట**

కృష్ణుడు కార్తిక మాసంలో రేవతీ నక్షత్రదివసాన హస్తినపురానికి వెళ్లడానికై సాత్యకితో కలిసి రథారూఢుడై, తగు పరివారంతో బయలుదేరాడు. యుధిష్ఠిరాదులు కొంత దూరం అతనితో వెళ్లి సాగనంపారు. కృష్ణుడు సాయంకాలానికి వృకస్థలం చేరి, ఆ రాత్రి అక్కడ విడిది చేశాడు.

కృష్ణుడు వస్తూన్నట్లు దూతల ద్వారా ధృతరాష్ట్రునికీ తెలిసింది. అతడు చాల సంతోషిస్తూ, భీష్మద్రోణాదులతోను, అమాత్యసహితుడైన దుర్యోధనునితోను "కృష్ణుడు వస్తున్నాడట, కృష్ణుడు వస్తున్నా డట - అని స్త్రీలు, బాలలు, వృద్ధులూ అందరూ ఇంటింటా చెప్పుకొంటున్నారు. ఆ మహాపురుషుణ్ణి తగు విధంగా పూజిస్తే సంతోషిస్తాడు. పూజించకపోతే సంతోషించడు. అతనిని సంతోషింపజేయడం మనందరికీ శ్రేయస్కరం."

"మార్గమధ్యంలో అన్ని సౌకర్యాలు ఉన్న సభలు (హాళ్లు) ఏర్పాటు చెయ్యండి. దుర్యోధనా! కృష్ణుడు ఎలా సంతోషిస్తాడో అలా అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చెయ్యండి. భీష్మాదులేమంటారు?" అన్నాడు.

భీష్మాదులు ఆ మాటలకు ధృతరాష్ట్రుణ్ణి ప్రశంసించారు. దుర్యోధనుడు తండ్రి చెప్పినట్లు కృష్ణుడు వచ్చే మార్గంలో అడుగడుగునా అనేక ఉపచారాలు ఏర్పాటు చేశాడు. అందమైన సభలు (హాల్స్) అందమైన సుఖకరమైన విచిత్రమైన ఆసనాలు, స్త్రీలు, సుగంధద్రవ్యాలు, అలంకారాలు, సన్నని వస్త్రాలు, అనేక విధమైన మధురమైన భోజ్యపదార్థాలు, పానీయాలు, సుగంధములైన పుష్పమాలలు - అన్నీ ఏర్పాటు చేయించాడు. విశేషించి వృకస్థలంలో అనేకమైన శ్రేష్ఠమైన వస్తువులతో నిండిన విశాలమైన సభ నిర్మింపజేశాడు. దేవతాపురుషులకు తగిన ఇలాంటి ఉపచారాలన్నీ ఏర్పాటు చేసి తండ్రికి చెప్పాడు.

(సశేషం)



# తిరుమల చరితామృతం

(గత సంచిక తరువాయి)

ఈ పరిశీలనలో ముఖ్యంగా తేలింది ఏమిటంటే, ఆలయంలో తిరువాభరణం (స్వామివారి నిత్య అలంకారానికి, విశేష అలంకారాలకు ఉపయోగించే నగలు) నగలు కాని, వాడకానికి ఉపయుక్తం కాక ట్రెజరీకి పంపిన నగలుకాని, హుండీలో భక్తులు వేసిన నగలు, పురావస్తు లేదా చారిత్రక విలువ లేకపోయినా, ఆలయాల్లో వాడకానికి ఉపయుక్తం కాకపోయినా, వాటిని సొమ్ము చేయడానికి తీసుకొనే చర్యలు కానీ- ఎటువంటి అవకతవకలు జరగడానికి ఆస్కారం లేని చాలా కట్టుదిట్టమైన వ్యవస్థ పరిధిలో వున్నాయి. ఈ వ్యవస్థ ఇప్పటిది కాదు, దశాబ్దాలుగా అమలులో వుంది... 1907 సంవత్సరంలో మహంతుల కాలంలో ప్రత్యేక కోశాధికారిని ఏర్పాటు చేసి, కోర్టువారి అధీనంలో పకడ్బందీగా ఎలా చేయాలో నియమనిబంధనలు తయారుచేసి, అమలులో పెట్టే విధానం మొదలైంది... తర్వాత తర్వాత ఆ విధానం ఇంకా పటిష్టంగా చేస్తూ వచ్చారు. ఆభరణం లోంచి చిన్నరాయి రాలినా, చిన్న ముక్కవిరిగినా, ఏదయినా మరమ్మత్తు వచ్చినా, ఎప్పటికప్పుడు ప్రతి చిన్నవిషయం కూడా రికార్డులలో భద్రపరచి, విరిగిన ముక్కలకు కూడా లెక్కలు కట్టి మల్లెలు కట్టి, భద్రపరిచే విధానం అమలు జరుగుతోంది. ప్రతి నగకు ప్రత్యేక గుర్తింపు నంబరు ఇచ్చి, నగ వివరాలు, (ఎంత బరువు, ఎన్ని రాళ్లు, ఏ రకం రాళ్లు, నగ ఆకారం ఇత్యాదులన్నీ) తిరువాభరణం రిజిస్టర్లలో భద్రపరచడం, నగని వాడకానికి బయటకు తీసినా, బయటకు తీసినది మళ్లీ లోపల పెట్టిన, పరిశీలన చేసే విధానం, ఎటువంటి మార్పులు చేసినా - ఆ తేదీ, మార్పులు చేసిన వారి వివరాలతో సహా రికార్డు చేయబడుతోంది.



కీ.శే. పివిఆర్‌కె ప్రసాద్

1933 సంవత్సరంలో మహంతుల నుండి ప్రత్యేక పాలకమండలి అజమాయిషీలోకి ఆలయం వచ్చినప్పుడు ఏమేమి నగలున్నాయో, అన్నిటి వివరాలూ ఉండడమే కాక, ట్రెజరీకి వాపసు పంపిన నగల వివరాలు కూడా పొందుపరచడం జరిగింది. ఈ కమిటీ ట్రెజరీ రికార్డులో అలాంటి వివరాలను కూడా పరిశీలించి, సమన్వయం చేయడం జరిగింది. ఇంకొకటి మాకు అర్థమయింది- ఈ విధానాలు 1933 ముందు రోజులలో కూడా అమలులో ఉండేవని.

చివరికి కమిటీవారు తెచ్చింది - 1933 సంవత్సరంలో మహంతుల నుండి ఏయే ఆభరణాలు, ఆస్తులు, ఇతర విలువైన వస్తువులు ఆలయానికి సంక్రమించాయో వాటికే ఆ తరువాత పాలకులు బాధ్యులు.

ఆ ఆభరణాలు అన్నీ లెక్క ప్రకారం ఉన్నాయని, ఎటువంటి అవకతవకలకూ, కాజేయడానికీ ఆస్కారం లేదని, వ్యవస్థ చాలా కట్టుదిట్టంగా ఉందని, ఎవరైనా ఆలయ ఉద్యోగి కాని, అర్చకుడు కాని కక్కుర్తి పడితే, వెంటనే విషయం బయటకు తెలుస్తుందని, అతనిని బాధ్యుణ్ణి చేసి, ఏ కొద్ది నష్టమైనా రాబట్టుకునే సానుకూలం ఉందనీ కమిటీ నిర్ధారించింది.

పోయిన డాలర్ల విషయంలో కానీ, కోదండ రామస్వామివారి అర్చకుడు నగలు తాకట్టు పెట్టిన విషయంలో కాని వ్యవస్థ లోపం కంటే, బాధ్యత అప్పగించబడిన అధికారి లోపం వల్లనే జరిగింది. అవి కూడా ఆలయం తనిఖీలలో బయటపడిన విషయాలే. చర్యలు తీసుకుని నష్టానికి బాధ్యులైన వారి నుంచి కూడా రాబట్టే వెసులుబాటు ఉందని కమిటీ నిర్ధారణ చేసుకుంది.

వీలయిన ప్రతి చోటా నిఘా కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని 24 గంటలూ ప్రత్యేకంగా పరిశీలించడానికి వ్యవస్థ ఉంది. ఏమూల ఏం జరిగినా, అది కెమెరాల ద్వారా రికార్డు చేసే సానుకూలం ఉంది... సాంకేతిక ప్రగతి దృష్టిలో పెట్టుకొని ఇంకా ఏం మార్పులు చేయవచ్చో కమిటీ వారు సూచించారు.

ఇవన్నీ ఆలయంలో భద్రంగా ఉండడం ఒక ఎత్తు- కానీ భద్రంగా ఉన్నాయన్న విషయం ప్రజలకు తెలియటం మరో ఎత్తు. అందుకే విలువైన నగలను ప్రజలు చూడటానికి వీలుగా భద్రత ప్రదర్శనశాలలో ఏర్పాటు చేయాలని కమిటీ సూచించింది.



స్వామివారి అలంకారానికి (నిత్య/విశేష) వాడే తిరువాభరణం నగలు- పెద్దవి, ఖరీదైనవి- అన్ని నగలనూ ఈ కమిటీ వారు నూటికి నూరు శాతం పరీక్షించారు. మిగతా చిన్న నగలు దాదాపు 80 శాతం పరీక్షించారు. మిగతావి కూడా రిజిస్టర్‌లో నంబర్లను, అలమార్లలో నగలను, అక్కడక్కడా ప్రతి సభ్యుడూ పరిశీలించి, అన్నీ సక్రమంగా ఉన్నాయన్న నిర్ధారణకు వచ్చారు.

క్రింద హుజూరు ఆఫీసులో ట్రెజరీ విభాగాన్ని ఒక భద్రతా విభాగంగా గుర్తించి, ప్రత్యేక కట్టడాలు కట్టిస్తే బాగుంటుందని సూచించారు. తీవ్రవాదులు, ఆటంకవాదులు దాడులు జరప డానికి అవకాశమున్న ఈ రోజులలో, వారికి ఉపలభ్యంగా ఉన్న మందుగుండు పేలుడు సామానుల దృష్ట్యా, దుర్భేద్యమైన ఏర్పాట్లు చేయవలసిన ఆవశ్యకత గుర్తించారు. పరకామణి జరిగినప్పుడే, రొక్కం ఆలయం నుండే బ్యాంకువారు తీసుకు వెడతారు. రిజర్వు బ్యాంకు నుండి వచ్చిన బంగారు నిల్వలను కూడా బ్యాంకు లాకర్లలోనే ఆలయం వారు పెడుతున్నారు. అయినా పరకామణి జరిగాక, కరిగించడానికి పంపేదాకా లేదా వేలం వేసేదాకా ట్రెజరీ లోనే బంగారం, వెండి, రాళ్ల నగలు భద్రపరచాల్సిన దృష్ట్యా ఈ భద్రతా చర్యలు చేపట్టాలని సూచన చేశారు.

ఇంకొక ఆసక్తికర విషయం బయటకు వచ్చింది... ట్రెజరీలో వందలకొద్ది నాణాలు మూటలు కట్టి ఉన్నాయి... వివరాలు అడిగితే, తెలిసింది... మన దేశ నాణాలన్ని విలువ ప్రకారం విడదీసి, తూకం వేసి బ్యాంకులకు అమ్మే ఏర్పాటు ఉంది... కానీ అటువంటి వ్యవస్థ ఇతర దేశాల నాణాల విషయంలో లేదు. వాటిని తీసుకోవడానికి ఏ బ్యాంకూ సిద్ధంగా లేదు. మన దేశ నాణాలు కరిగించకూడదన్న నిబంధన ఉంది. అది ఇతర దేశాల నాణాల విషయంలో వర్తిస్తుందా? ఎవ్వరూ కొననీ ఈ నాణాల్ని ఏం చేయాలో తెలియక, చాలాకాలంగా హుండీలో పడుతున్న అలాంటి ఇతర దేశాల నాణాల్ని బస్తాలుగా కట్టి పెడితే, వాటితో గదులు నిండిపోయాయి. ఇండొనేసియా, నేపాల్, సింగపూర్, మలేసియా, ఇంగ్లాండు, అమెరికా, సౌతాఫ్రికా, మారిషస్, వెస్టిండీస్, ఫ్రాన్స్, నైజీరియా దేశాల నాణాలు వివిధ రకాలున్నాయి. వాటిని విడగొట్టే సామర్థ్యం కానీ, అమ్మివేసే వెసులుబాటు కానీ లేదు. కమిటీ తరపున సమన్వయకర్తగా నేను రిజర్వు బ్యాంకు గవర్నరు దువ్వూరి సుబ్బారావు గారితో మాట్లాడి, ఈ విషయం పరిష్కారానికి మార్గం చూపమన్నాను.

ఆయన సూచించిన అధికారులతో నేను చర్చలు జరిపాను. కానీ ఆశ్చర్యం ఏమిటంటే, ఈ విషయంపై వాళ్లకి కూడా ఏం చేయాలో తెలియని పరిస్థితి... ఇటువంటి సమస్య వాళ్లకీ ఇదివరకెప్పుడూ రాలేదు. చివరికి, వాళ్లు నిర్ధారించింది - మన దేశ నాణాల్ని కరిగించరాదని చట్టం ఉంది. కానీ అది ఇతర దేశాల నాణాలకు వర్తించదు. కనుక లోహపు ధరకు, ఎవరైనా కొనుక్కోదలిస్తే వాళ్లకి అమ్మివేయవచ్చు అన్నారు. దేశంలో చాలా మంది, నాణాలు సేకరించేవారున్నారు. వారు నాణాలు విడివిడిగా వేరు చేస్తే కొద్ది మొత్తంలో కొనడానికి సిద్ధమే కానీ, వేరు చేయని వివిధ దేశాల నాణాలు పెద్ద మొత్తంలో కొనుగోలు చేయలేరు. నాణాలు వేరు వేరు దేశాలవి, వేరు వేరు ఖరీదులవి. విడగొట్టలంటే చాలా కష్టం. చాలా ఖర్చులతో కూడిన పని... అందుకే మెటల్ ఖరీదుకు వాటిని అమ్మివేయమని సలహా ఇవ్వడం జరిగింది.

కృష్ణదేవరాయలు, ఇతర విజయనగర రాజులు, శాసనాలలో చెక్కించబడిన ఇతర దాతలు చేసిన దానాలలో విపులీకరించిన నగలు ఇప్పుడున్నాయా? (సశేషం)

(తిరుమల చరితామృతం పుస్తకం నుంచి)






'ఆంధ్ర వాల్మీకి'

**వాసుదాసస్వామి**

(వావిలికొలను సుబ్బారావు)

విరచిత

# 'మందర-మకరందం'

### సర్గ-118

(గత సంచిక తరువాయి)

నేను నా భర్తతో అడవులకు వచ్చేటప్పుడు నా అత్తగారు, పెళ్లి చేసుకున్నప్పుడు మా తల్లి, పాతివ్రత్యాన్ని గురించి చాలా మాటలు చెప్పారు.అవన్నీ మనసులో నాటుకున్నాయి. కాని పాతబడ్డాయి. ఇప్పుడు నువ్వు వాటిని కొత్తగా మనసుకు నచ్చేట్లు చెప్పి బలపర్చావు. తల్లీ! నా అభిప్రాయంలో స్త్రీలకు పతిశుశ్రూష తప్ప వేరే తపస్సు అక్కరలేదు''.

''పతిసేవ చేయడం వల్లే కదా సావిత్రి స్వర్గలోకానికి పోయింది? పతిసేవ చేయడం వల్లే కదా నీకు స్వర్గం అరచేతి లోకి వచ్చింది? ఆకాశదేవత, స్త్రీ రత్నమైన రోహిణి అల్పకాల మైనా తన భర్త చంద్రుడి వెంట పోకుండా వుండగలదా? చలిం చని మనసుతో పతి సేవ చేసే పతివ్రతలు వారు చేసిన పుణ్యం వల్ల స్వర్గంలో పూజించబడుతారు'' అనిచెప్పింది. ఆ మాటలకు అనసూయ సంతోషించి సీతను దగ్గరకు తీసుకుని శిరస్సు వాసనచూసి ఇలా అంది: ''అమ్మా! ఇంపైన నీ మాటలతో నాకు చాలా సంతోషం కలిగింది. నీకేం కావాలో కోరుకో. నా తపోబలం వల్ల నీకు అది కలిగిస్తా''. అనసూయ మాటలకు ఆశ్చర్యపడ్డ సీత ఆమె తనను పరీక్షిస్తున్నదనుకుని, ఆమె దయవల్ల తనకే కొరత లేదనీ, తానేం కోరాలింకా అని అంటుంది.

**సీతాదేవికి అంగరాగాలు (గంధం లాంటివి) ఇచ్చిన అనసూయ**

సీతాదేవి అన్న మాటలకు అన సూయ ప్రీతి చెందింది. ''ఈ పూలదండలు, ఈ వస్త్రం, ఈ సొమ్ములు, ఈ మైపూతలు, ఈ పరిమళ ద్రవ్యాలు అన్నీ దేవతా సంబంధమైనవే. భూలోక వాసులకు లభించవు. మనసుకు సంతోషం కలిగిస్తాయి ఇవన్నీ. ఈ పూల దండలు వాడిపోవు, వీడిపోవు, వాసన పోదు... నీకివి అందంగా వుంటాయి. వీటిని నువ్వు ధరిస్తే ప్రకాశిస్తూ, పూర్ణకాంతితో, మనోహర దేహంతో, లక్ష్మీదేవి విష్ణువును సంతోషపెట్టినట్లు సంతోష పెట్తావు'' అని ప్రేమతో అనసూయ ఇవ్వగా, సీతాదేవి సంతో షించి, వాటిని తీసుకుని, నిర్మలమైన భక్తితో ఆ ముని భార్యకు కృతజ్ఞతా సూచకంగా నమస్కారం చేసి ఆమె పక్కన కూచుంది. ఇలా తన పక్కన కూచున్న సీతతో అనసూయ సరదాగా కబు ర్లాడుతూ ఇలా అంది.



అనువక్త-వాచవి
**వనం జ్వాలా నరసింహారావు**

**తన స్వయంవర వృత్తాంతాన్ని అనసూయకు చెప్పిన సీత**


''కుటిలకుంతలా! నిన్ను రామచంద్రమూర్తి తన పరా క్రమంతో స్వయంవరంలో పెళ్లి చేసుకున్నాడని మాటమాత్రంగా వినడమే కాని, అదెలా జరిగిందో వివరంగా వినలేదు. అకథ వినాలని వుంది. జరిగినదంతా వివరంగా చెప్పు'' అని అనసూయ అడిగింది.

జవాబుగా సీతాదేవి, ''అమ్మా! చెప్తా విను. నా తండ్రి జనకుడు క్షాత్ర ధర్మం అంటే ప్రీతికలవాడు. విదేహ దేశానికి

రాజు. ఒకనాడు యజ్ఞం చేయడానికి నేల దున్నిస్తుంటే నాగేటికర్రు తగిలి నేల పెళ్లలు లేచివచ్చి నేను భూమిలోనుండి బయటకు వచ్చా. అప్పుడు ధాన్యం చల్లడానికి పిడికిట్లో గింజలు వుంచుకున్న జనకుడు నన్ను చూసి ఆశ్చర్యపడి తన కన్న కూతురులాగా నన్ను ఆయన తన కుడి తొడమీద కూర్చుండ బెట్టుకుని తన కూతురని చెప్పాడు. ఆకాశవాణి కూడా నేను ఆయన కూతురునే అంది. ఆకాశవాణి మాటలకు సంతోషించిన జనకుడు నన్ను తన పెద్ద భార్యకు ఇచ్చాడు. ఆమె నన్ను తన కన్నబిడ్డలాగా చూసుకుంది. పెంచింది. నాకు వివాహయోగ్యదశ రావడం గమనించిన తల్లిదండ్రులు ఆ దిశగా ఆలోచన చేయ సాగారు. ఈ కన్య ఇలాంటి గొప్ప గుణాలు కలది కదా! దీనికి తగిన వాడిని, సద్గుణ సంపత్తికలవాడిని, గొప్పవాడిని, ఏవిధంగా భర్తగా సంపాదించగలనని జనకుడు విచార సముద్రంలో మునిగిపోయాడు. తల్లిగర్భంలో పుట్టని సుందరినైన నాకు, దేవ కన్యలాంటి నాకు, తగినవాడిని, మన్మథాకారుడిని, సమాను డైన వాడిని సంపాదించాలని వెతికాడు కాని ఎవరూ దొరకలేదు. అప్పుడు స్వయంవరం చాటిస్తే బాగుంటుందని ఆలోచన చేశాడు".

"ఈ ప్రకారం ఆలోచించి, తాను చేసిన ఒక గొప్ప యజ్ఞంలో వరుణుడు తనకు ఇచ్చిన మనుష్యులు కదిలించ సాధ్యపడని వింటిని, రాజులు కలలో కూడా ఎక్కుపెట్టలేని వింటిని, అక్షయ బాణాలను, తాను పిలిపించిన రాజులందరికీ చూపించాడు. ఆవిల్లెక్కుపెట్టిన వాడు తన కూతురుకు భర్త కాగలడని ప్రకటిం చాడు. అక్కడికి వచ్చిన రాజులు దానిని ఎత్తలేక, చూడగానే భయపడి, దానికి ఒక నమస్కారం చేసి పోయారు. చాలాకాలం ఇలాగే గడిచి పోయింది. రాజకుమారులెవరూ దానిని ఎక్కుపెట్టలేక పోయారు".

"అప్పుడు విశ్వామిత్రుడు మా తండ్రి చేసే యజ్ఞం చూడ డానికి రామలక్ష్మణులను తీసుకొచ్చాడు. మా తండ్రికి, మన్మథులలాగా వున్న సుకుమారులైన వారిద్దరినీ, దశరథరాజ పుత్రులను పరిచయం చేశాడు. చేసి, ఆయన దాచిపెట్టిన వింటిని శ్రీరామచంద్రమూర్తికి చూపించమని అన్నాడు. జనకు డలాగే చేశాడు. విశ్వామిత్రుడి మాట ప్రకారం శ్రీరాముడు వింటిని సమీపించాడు. ఆ వింటిని శ్రీరాముడు అనాయాసంగా ఎక్కుపెట్టి, అల్లెతాడు గట్టిగాపట్టి లాగగా చూసేవారు భయ పడేట్లు, పిడుగుపడ్డ ధ్వనితో అది రెండుగా విరిగింది. విల్లు ఎక్కుపెట్టిన-విరిచిన వారికి తన కూతురును ఇచ్చి వివాహం చేస్తానని ప్రతిజ్ఞచేసిన మా తండ్రి తన మాట ప్రకారం శ్రీరామ చంద్రమూర్తికి నన్ను కన్యాదానం చేయడానికి జలపాత్ర చేతిలో తీసుకున్నాడు. కాని తమ తండ్రి అభిప్రాయం తెలుసుకోవాలని



చెప్పి శ్రీరాముడు దానం తీసుకోలేదు. అప్పుడు మా తండ్రి దశరథ మహారాజు దగ్గరకు దూతలను పంపాడు. మా తండ్రి ఆహ్వానాన్ని ఆదరించి దశరథమహారాజు వచ్చాడు. శ్రీరామ చంద్రుడికి నన్ను, నా చెల్లెలు ఊర్మిళను లక్ష్మణుడికి దానం చేశాడు జనకుడు. ఈవిధంగా నేను శ్రీరామచంద్రమూర్తిని వివాహం చేసుకున్నా".

◆◆◆

## సర్గ-119
## సీతకు సాయంకాలం వర్ణించి చెప్పిన అనసూయ

సీతాదేవి ఇలా చెప్పగా విన్నముని భార్య అనసూయాదేవి సీత శిరస్సును వాసనచూసి కౌగలించుకుని ఇలాఅంది: "కల కంఠీ! వినడానికి చిత్రంగా, సందేహం లేకుండా వుండేవిధంగా, మధురంగా నీస్వయంవర చరిత్ర చెప్పావు. సూర్యుడు అస్తమిం చాడు. చీకట్లుకమ్ముకున్నాయి. పక్షులుగూళ్లకు చేరుకున్నాయి. మునులు నదిలో స్నానంచేసి తడి వస్త్రాలతో జలపాత్రను చేత బట్టుకుని మరలివస్తున్నారు. ఆ పక్కచూడు. శాస్త్రప్రకారం ఋషీశ్వరులు అగ్నిహోత్రాలలో హోమం చేస్తుంటే గాలికి ఎగిరే పొగ కనపడుతున్నది. కాంతితోఎగురుతున్నదీపొగ జానకీ! ఆకులు పల్చగాఉన్నప్పటికీ, చెట్లుదూరం నుంచిచూస్తుంటే చీకట్లు వ్యాపించినందు వల్ల, దండిగా ఆకులున్నట్లు కనపడు తున్నాయి. దిశలు కాంతిహీనం అయ్యాయి. సీతమ్మా! రాత్రి సంచరించే జంతువులు తిరగడం మొదలుపెట్టాయి. తప స్వులు, సాదుకునే జింకలతో శయనించారు. చూశావా? రాత్రి చాలాగడిచింది. చంద్రముఖీ! ఆకాశం నక్షత్రసమూహంతో ప్రకా శిస్తున్నది. వెన్నెల ముసుగేస్తుంటే చంద్రుడు ఉదయించాడు. అదిగోచూడు... ఇక నువ్వు శ్రీరామచంద్రమూర్తి దగ్గరకు పో. నిన్ను చూడడం వల్ల, నీతో మాట్లాడడం వల్ల నాకెంతో సంతోషం కలిగింది. కమలాక్షీ! నేను నీకిచ్చిన చీరెలు, సొమ్ములు, వాసన ద్రవ్యాలు నా ఎదుట ధరిస్తే సంతోషిస్తా". (సశేషం)

(గత సంచిక తరువాయి)

అక్షయ నామ సంవత్సరంలో శుభ ముహూర్తంలో శివస్వామి సన్యాసదీక్షను స్వీకరించారు. మఠ ప్రముఖులందరూ రాజ లాంఛనాలతో నరసింహ శాస్త్రిగారింటికి చేరారు. శివస్వామి సంధ్యోపాసన, అగ్నికార్యం మొదలైన విధులు నిర్వహించి,

గురుదేవుల సన్నిధికి చేరి, సన్యాసదీక్షను స్వీకరించిన వైనం శ్రీ లలితాదిత్య కవి సవిస్తరంగా వర్ణించారు.

**"వసుధలోన నా కయినట్టి వారులేరు**
**నేను నెవ్వారి కగువాడఁ గానటంచు**
**బంధుగృహ మిత్రవస్తుసం బంధములను**
**స్వాప్నికార్థమున్ వీడెడు సరణివీడె."**

ఇది సర్వసంగ పరిత్యాగ విధానం. ఆ తరువాత -

**"ఓ హితులార! నా పయిని నొద్దికఁ జూపెడు బంధులార! నే**
**నైహిక బంధముల్ గెలిచి యాత్మసమున్ముఖతన్ ధనాత్మజా**
**దీహల వీడి సద్గురుని యెక్కుడు సత్కృప సన్న్యసింతు, మీ**
**రే హఠముం బొనర్చకుడి యే యవరోధముఁ జేయకుండుడీ!"**

అని శివస్వామి విన్నవించి, గురు సన్నిధిలో చెరువు గట్టున నిలబడి, ప్రతిజ్ఞ చేశారు. త్రికరణశుద్ధిగా అహింసను పాటిస్తానని



"సన్న్యస్తం మయా" అని ముమ్మారు పలికి, శిఖా యజ్ఞోపవీతములను జలదేవతకు వదిలి,

విష్ణుమూర్తిని ప్రార్థించారు .

సర్వాన్నీ సన్యసించి విష్ణుదేవుని చరణాలే తనకు శరణాలని ప్రకటించారు.



**మల్లాప్రగడ**
**శ్రీమన్నారాయణ మూర్తి**

శ్వేత వస్త్రాన్ని విడిచి, గురుదేవులిచ్చిన కాషాయవస్త్రాన్ని, దండాన్నీ స్వీకరించారు.

భవబంధ విముక్తికై సన్న్యసించిన తనను తరింప

భూతశ్రేణికి విన్నవించారు.

**"బాటను చీమయైన, నిశి ప్రక్కల నక్కిడి పుర్వులైన, యే**
**చాటున నున్నయట్టి స్థిర జంగమజీవులు నా కతంబునం**
**జేటునుఁ గానరాదనెడు చింతనతో నభయంబు నిచ్చితిన్."**

అని ప్రకటించారు.

**"విశ్రామ మెఱుగక విశ్వ విశ్వంబుల వెలిగించు మార్తండ**
**విధువులార! బ్రహ్మాండకోటి కుపాదాన హేతుభూ**
**తంబులౌ పంచభూ తంబులార! పర్యాయముల కాల**
**బాలకుం బోషించి రాణకెక్కిన యహో రజనులార!**
**ప్రాతర్నిశా నదీద్వయి సంగమించెడు స్థానంబులౌ యిరు**
**సంధ్యలార! మలపు తలపుల నెలవ యో మానసంబ!**
**పక్షపాత విదూర వై వస్వతుండ! ధర్మదైవతమా!**
**భవత్సాక్షికముగ నెల్ల సంసారమిదె సన్న్య సించుచుంటి"**

అని కర్మసాక్షులందరి సాక్షిగా ప్రమాణం చేశారు.

గో బ్రాహ్మణ గురు ప్రభృతులైన స్వసన్న్యాస దీక్షా సాక్షులకు నమస్కరించారు.

జేయవలసిందిగా గురువర్యులను ప్రార్థించారు.

ఈ సందర్భంలో గురువును శరణువేడిన ఆ శిష్యుని ప్రార్థనను సరళ సుందరంగా అందించారు లలితాదిత్య కవి.

**"భల్లుక వ్యాఘ్ర బహుళమౌ వనమున బయ**
**లేగుదారి గానక పువ్వు లేరుకొనుట**
**సర్వదుఃఖ నిదాన సంసారమందు**
**క్షుద్ర విషయ సౌఖ్యంబులఁ గోరుకొనుట.**

**గర్భజనిజరా మరణ చక్రమందు**
**విసిగి వేసారి నేను ని స్పృహుడనైతి**
**సకల సంసార బాధదక్షత్వమున్న**
**యాత్మవిద్యార్థినై శరణంటి స్వామి!**

**యోగీశ్వరుని వినిర్జిత రాగద్వేషునిఁ**
**బ్రశాంత రస సంపన్నున్ నైగమ రహస్యవేదిని**
**శ్రీగురువర! చేరినాడ శిష్యత మిమ్మున్."**

అని గురువుగారి పాదాలు పట్టి "యదీహి భగవో బ్రహ్మ" అని కోరారు. (సశేషం)

ఆధ్యాత్మిక వార్తా మాస పత్రిక



# దర్శనమ్

ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యంగా 21 సంవత్సరాలుగా 'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక ధర్మనిష్ఠతో కృషిచేస్తోంది.. చతురామ్నాయ పీఠాల జగద్గురువులు సహా ధర్మాచార్యులకు, పీఠాధీశ్వరులకు గురువందనమ్, ధార్మికవేత్తలు, మహాత్ములకు గురుసత్కారం కార్యక్రమాలను సభక్తికంగా నిర్వహిస్తోంది. వేద, శ్రౌత, శాస్త్ర, ఆర్ష ధర్మాన్ని పునరుజ్జీవింపజేసే ఎన్నో ధార్మిక కార్యక్రమాలను చిత్తశుద్ధితో నిర్వహిస్తోంది. సంస్కృత, తెలుగు భాషా వికాస కార్యక్రమాలను, అవధానాలను విరివిగా నిర్వహిస్తోంది. జీర్ణదేవాలయాల పునరుద్ధరణ, గోసంరక్షణ, లోక కళ్యాణం కోసం ఎన్నో యాగాలు, ధార్మిక కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తోంది. దర్శనమ్ పత్రిక ప్రతి నెల 25వ తేదీన మార్కెట్లోకి, 1వ తేదీన పాఠకుల ముంగిట్లోకి అందేలా క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధతతో కృషిచేస్తోంది. ఒక సామాన్యుడి ధార్మికోద్యమ అక్షరాయుధం 'దర్శనమ్' ఆర్షధర్మ పరిరక్షణ, సంస్కార సమాజం కోసం అహరహం ధర్మనిష్ఠతో పనిచేస్తోంది. ఈ ధార్మికోద్యమానికి మీరు అనేక సందర్భాల్లో అందించిన చేయూత.. వదాన్యత అమోఘం.. మీ సహకారం నాలో ఆత్మస్థైర్యాన్ని మరింత పెంచుతోంది. ప్రస్తుతం ఎన్నో క్లిష్టపరిస్థితులను, అవరోధాలను అధిగమించి ముందుకు సాగుతూ 22వ వసంతంలోకి పత్రిక అడుగిడింది. ఈ ధార్మికోద్యమ పత్రిక ఎల్లకాలం ముందుకు సాగాలని, తెలుగునాట పాఠకదేవుళ్లకు ఆత్మీయ నేస్తంగా ధర్మప్రబోధం అందించాలని నా ఆకాంక్ష... ఇందుకోసం పత్రిక మూలనిధి(ధర్మనిధి)ని ఏర్పాటు చేయాలని నిశ్చయించాను. మీరు మీకు తోచినంత ఈ మూలనిధికి భాగస్వామ్యం అందించి సాయపడాలని, ఈ ధార్మికోద్యమంలో భాగస్వాములు కావాలని మనఃస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను.

**- మరుమాముల వెంకటరమణ శర్మ**

---

# 'దర్శనమ్' చందా వివరములు

| | | |
|---|---|---|
| మూడు సంవత్సరాలకు | రూ. | 2000 |
| ఆరు సంవత్సరాలకు | రూ. | 4000 |
| జీవిత చందా (12 సం॥లు) | రూ. | 8000 |
| రాజపోషకులు | రూ. | 15000 |
| మహారాజ పోషకులు | రూ. | 25000 |
| విశిష్ట మహారాజ పోషకులు | రూ. | 100000 |

**విదేశీయులకు...**

| | | |
|---|---|---|
| మూడు సంవత్సరాలకు | రూ. | 12000 |
| ఆరు సంవత్సరాలకు | రూ. | 24000 |
| జీవిత చందా (12 సం॥లు) | రూ. | 48000 |
| విశిష్ట చందాదారులు | రూ. | 60000 |
| రాజపోషకులు | రూ. | 80000 |
| మహారాజ పోషకులు | రూ. | 100000 |

# అచ్యుతాష్టకమ్



**ఈ స్తోత్రం శ్రీ మహావిష్ణువును అచ్యుతుడు, కేశవుడు, శ్రీధరుడు వంటి వివిధ నామాలతో, ఆయన రామకృష్ణాది అవతారాల లీలలను, దివ్య గుణాలను కీర్తిస్తుంది. ఈ అష్టకాన్ని ప్రేమతో, నిష్ఠతో పఠించిన వారికి శ్రీహరి త్వరగా అనుకూలుడై, వారి కోరికలను తీరుస్తాడని ఈ స్తోత్రం తెలియజేస్తుంది.**

---

శ్లో॥ అచ్యుతం కేశవం రామనారాయణం
కృష్ణదామోదరం వాసుదేవం హరిమ్ ।
శ్రీధరం మాధవం గోపికావల్లభం
జానకీనాయకం రామచన్ద్రం భజే 1

పదవిభాగము : అచ్యుతం, కేశవం, రామ-నారాయణం, కృష్ణ-దామోదరం, వాసుదేవం, హరిమ్, శ్రీధరం, మాధవం, గోపికా-వల్లభం, జానకీ-నాయకం, రామచన్ద్రం, భజే.



తాడేపల్లి పతంజలి

**అన్వయము :** అచ్యుతం, కేశవం, రామ-నారాయణం, కృష్ణ-దామోదరం, వాసుదేవం, హరిమ్, శ్రీధరం, మాధవం, గోపికా-వల్లభం, జానకీ-నాయకం, రామచన్ద్రం, భజే.

**ప్రతి పదార్థము :** అచ్యుతం = చ్యుతి లేనివాడు, కేశవం = కేశి అనే రాక్షసుడిని సంహరించినవాడు/జుట్టు కలిగినవాడు, రామ-నారాయణం = రాముడు మరియు నారాయణుడు అయినవాడు, కృష్ణ-దామోదరం = కృష్ణుడు మరియు దామోదరుడు (ఉదరం చుట్టూ దారం కట్టబడినవాడు) అయినవాడు, వాసుదేవం = వసుదేవుని కుమారుడు, హరిమ్ = పాపాలను హరించేవాడు, శ్రీధరం = లక్ష్మిని ధరించినవాడు, మాధవం = మధు వంశీయుడు/లక్ష్మికి భర్త, గోపికా-వల్లభం = గోపికలకు ప్రియుడు, జానకీ-నాయకం = జానకి (సీత) భర్త అయిన, రామచన్ద్రం = రామచంద్రుని, భజే = నేను కొలుస్తున్నాను.

**తాత్పర్యము :** చ్యుతి లేనివాడు, కేశిని సంహరించినవాడు, రామరూపుడు నారాయణుడు, కృష్ణుడు దామోదరుడు, వసుదేవుని పుత్రుడు, పాపాలను హరించేవాడు, శ్రీదేవికి భర్త, మాధవుడు, గోపికలకు ప్రియుడు, జానకీదేవికి నాయకుడు అయినశ్రీరామచంద్రునినేను కొలుస్తున్నాను.

**విశేషములు :** ఈ శ్లోకంలోశ్రీ మహావిష్ణువుయొక్క వివిధ అవతార నామాలను, ముఖ్యంగా రామ, కృష్ణ రూపాలను స్మరించారు. విష్ణువు యొక్క సకల గుణాలను, నామాలను ప్రస్తావించడం ద్వారా భక్తుడు తన ఆరాధనను వెల్లడిస్తున్నాడు.

**శ్లో॥** అచ్యుతం కేశవం సత్యభామాధవం
మాధవం శ్రీధరం రాధికారాధితమ్ ।
ఇన్దిరామన్దిరం చేతసా సున్దరం
దేవకీనన్దనం నన్దనం సన్దధే 2

పదవిభాగము : అచ్యుతం, కేశవం, సత్యభామాధవం, మాధవం, శ్రీధరం, రాధికా-ఆరాధితమ్, ఇన్దిరా-మన్దిరం, చేతసా, సున్దరం, దేవకీ-నన్దనం, నన్దనం, సన్దధే.

**అన్వయము :** అచ్యుతం, కేశవం, సత్యభామాధవం, మాధవం, శ్రీధరం, రాధికా-ఆరాధితమ్, ఇన్దిరా-మన్దిరం, చేతసా, సున్దరం, దేవకీ-నన్దనం, నన్దనం, సన్దధే.

**ప్రతి పదార్థము :** అచ్యుతం = చ్యుతి లేనివాడు, కేశవం = కేశిని సంహరించినవాడు, సత్యభామాధవం = సత్యభామకు భర్త, మాధవం = లక్ష్మీపతి, శ్రీధరం = లక్ష్మిని ధరించినవాడు, రాధికా-ఆరాధితమ్ = రాధచే ఆరాధించబడినవాడు, ఇన్దిరా-మన్దిరం = లక్ష్మికి ఆలయం (నివాసం), చేతసా =

మనసుచే, సున్దరం = సుందరుడు, దేవకీ-నన్దనం = దేవకీదేవికి కుమారుడు, నన్దనం = ఆనందం కలిగించువాడు అయిన శ్రీకృష్ణుని, సన్దధే = నేను ధ్యానిస్తున్నాను.

**తాత్పర్యము** : చ్యుతి లేనివాడు, కేశిని సంహరించినవాడు, సత్యభామకు భర్త, లక్ష్మీపతి, లక్ష్మిని ధరించినవాడు, రాధచే ఆరాధించబడినవాడు, లక్ష్మికి ఆలయం వంటివాడు, మనసుచే సుందరుడు, దేవకీదేవికి ఆనందం కలిగించు పుత్రుడు అయినశ్రీకృష్ణునినేను ధ్యానిస్తున్నాను.

**విశేషములు** : ఈ శ్లోకం ప్రధానంగాశ్రీకృష్ణునివివిధ భార్యలు (సత్యభామ, రాధ) మరియు తల్లి (దేవకి) తో ఉన్న సంబంధాన్ని, అలాగే ఆయన దివ్య సౌందర్యాన్ని, ఆనందమయ రూపాన్ని వర్ణిస్తుంది.



**శ్లో॥ విష్ణవే జిష్ణవే శఙ్ఖినే చక్రిణే**
**రుక్మిణీరాగిణే జానకీజానయే ।**
**వల్లవీవల్లభాయార్చితాయాత్మనే**
**కంసవిధ్వంసినే వంశినే తే నమః 3**

**పదవిభాగము** : విష్ణవే, జిష్ణవే, శఙ్ఖినే, చక్రిణే, రుక్మిణీ-రాగిణే, జానకీ-జానయే, వల్లవీ-వల్లభాయ+అర్చితాయ, ఆత్మనే, కంస-విధ్వంసినే, వంశినే, తే, నమః.

**అన్వయము** : విష్ణవే, జిష్ణవే, శఙ్ఖినే, చక్రిణే, రుక్మిణీ-రాగిణే, జానకీ-జానయే, వల్లవీ-వల్లభాయ, అర్చితాయ, ఆత్మనే, కంస-విధ్వంసినే, వంశినే, తే, నమః.

**ప్రతి పదార్థము** : విష్ణవే = సర్వవ్యాపకుడైన విష్ణువుకు, జిష్ణవే = విజయశీలుడైనవాడికి, శఙ్ఖినే = శంఖము ధరించినవాడికి, చక్రిణే = చక్రము ధరించినవాడికి, రుక్మిణీ-రాగిణే = రుక్మిణిని ప్రేమించువాడికి, జానకీ-జానయే = జానకి (సీత) భర్తకు, వల్లవీ-వల్లభాయ+ అర్చితాయ = గోపికలకు ప్రియుడు, ఆరాధించబడినవాడికి, ఆత్మనే = ఆత్మస్వరూపుడికి, కంస-విధ్వంసినే = కంసుడిని సంహరించినవాడికి, వంశినే = వేణువు ధరించినవాడికి, తే = నీకు, నమః = నమస్కారం.

**తాత్పర్యము** : సర్వవ్యాపకుడైన విష్ణువుకు, విజయశీలుడైన వాడికి, శంఖ-చక్రాలు ధరించినవాడికి, రుక్మిణిని ప్రేమించువాడికి, జానకీదేవికి భర్త అయినవాడికి, గోపికలకు ప్రియుడు మరియు వారిచే ఆరాధించబడినవాడికి, ఆత్మ స్వరూపుడికి, కంసుడిని సంహరించినవాడికి, వేణువు ధరించినవాడికి, నీకు నమస్కారం.

**విశేషములు** : ఈ శ్లోకం విష్ణువు యొక్క వివిధ ఆయుధాలు (శంఖం, చక్రం), ఆయనకు ప్రియమైన వారిని (రుక్మిణి, జానకి, గోపికలు) మరియు ఆయన సంహరించిన రాక్షసులను (కంసుడు) ప్రస్తావిస్తూ నమస్కారాన్ని అర్పిస్తుంది.

**శ్లో॥ కృష్ణ గోవిన్ద హే రామ నారాయణ**
**శ్రీపతే వాసుదేవాజిత శ్రీనిధే ।**
**అచ్యుతానన్త హే మాధవాధోక్షజ**
**ద్వారకానాయక ద్రౌపదీరక్షక 4**


**పదవిభాగము** : కృష్ణ, గోవిన్ద, హే, రామ, నారాయణ, శ్రీపతే, వాసుదేవ, అజిత, శ్రీనిధే, అచ్యుత, అనన్త, హే, మాధవ, అధోక్షజ, ద్వారకా-నాయక, ద్రౌపదీ-రక్షక.

**అన్వయము** : కృష్ణ, గోవిన్ద, హే రామ, నారాయణ, శ్రీపతే, వాసుదేవ, అజిత, శ్రీనిధే, అచ్యుత, అనన్త, హే మాధవ, అధోక్షజ, ద్వారకా-నాయక, ద్రౌపదీ-రక్షక (అని సంబోధిస్తూ స్తోత్రము).

**ప్రతి పదార్థము** : కృష్ణ = కృష్ణా, గోవిన్ద = గోవులను రక్షించేవాడా/ ఇంద్రియాలకు అధిపతి, హే రామ = ఓ రామా, నారాయణ = నారాయణా, శ్రీపతే = లక్ష్మీపతి, వాసుదేవ = వసుదేవుని పుత్రా, అజిత = జయించబడనివాడా, శ్రీనిధే = సంపదలకు నిధి వంటివాడా, అచ్యుత = చ్యుతి లేనివాడా, అనన్త = అంతం లేనివాడా, హే మాధవ = ఓ మాధవా, అధోక్షజ = ఇంద్రియగోచరుడు కానివాడా, ద్వారకా-నాయక = ద్వారకకు నాయకుడా, ద్రౌపదీ-రక్షక = ద్రౌపదిని రక్షించినవాడా.

**తాత్పర్యము** : ఓకృష్ణా! ఓగోవిందా! ఓరామా! ఓనారాయణా! లక్ష్మీపతీ! వసుదేవపుత్రా! జయించబడనివాడా! సంపదలకు నిధి వంటివాడా! చ్యుతి లేనివాడా! అనంతరూపా! ఓ మాధవా! ఇంద్రియాలకు గోచరుడు కానివాడా! ద్వారకాధీశా! ద్రౌపదిని రక్షించినవాడా! (అని నిన్ను నేను స్మరిస్తున్నాను).

**విశేషములు** : ఈ శ్లోకం వివిధ సంబోధనలతోవిష్ణువుయొక్క అనేక నామాలను, గుణాలను, ముఖ్యంగా ఆయన భక్తులను రక్షించే గుణాన్ని (ద్రౌపదీ రక్షక) కీర్తిస్తుంది. (సశేషం)




(గత సంచిక తరువాయి)

పత్ని యందలి ఈ సంభ్రమ సంతోషములు శాస్త్రిగారి కాశ్చర్యము కల్గించినవి. తీర్థయాత్రకు వెళ్లవలెనన్న సంకల్పము మాత్రముననే ఇంతటి పరివర్తనమందిన ఆమె మనస్సు తీర్థస్నాన, పుణ్యక్షేత్రవాస, దేవతాసందర్శన, భగవద్భక్త సాహచర్యములచే నిశ్చయముగా దుఃఖ సంకోచములను విడనాడి ఉల్లాసము పొందగలదని విశ్వసించారు. సహధర్మ చారిణి దుఃఖనివారణ కంటె శాస్త్రిగారి కా సమయమున మరొక లక్ష్యమేముంది?

ప్రయాణానికి ఒక శుభదినాన్ని నిశ్చయించుకొని తమ గురువర్యులైన శ్రీ సచ్చిదానంద శివాభినవ నృసింహభారతీ స్వామివారి అనుజ్ఞ పొందవలెనని ఆ పుణ్యదంపతులు మఠానికి వచ్చారు. శ్రీ గురువర్యుల కీ పతీపత్నుల అంతరంగ వేదన తెలుసు. వారికి కలిగిన దుఃఖము, ఒకరి తరువాత నొకరుగా పుట్టిన బిడ్డలు చనిపోవుట, విడువక సంభవించిన విపల్వరంపర, ఇవి అన్నీ గురువర్యులకు విదితములయినవే. లక్ష్మమ్మ గోపాలశాస్త్రులు తమ దర్శనమునకు వచ్చినప్పుడు వారిరువురును శ్రీ స్వామివారు హసన్ముఖులై మాట్లాడించిరి. యోగక్షేమ విచారణ సలిపిరి. తాము సపత్నీకులై తీర్థయాత్ర కేగవలెనని సంకల్పించిన విషయాన్ని శాస్త్రిగారు నివేదించారు. గురువర్యుల అనుజ్ఞను, ఆశీర్వాదాన్ని కోరి వచ్చామని విజ్ఞప్తి చేశారు. గురువర్యులు మందహాసంతో “మీ తీర్థయాత్ర నిర్విఘ్నంగా జరుగుగాక, మీకు సుఖశాంతులు లభించుగాక” యని ఆశీర్వదించారు. మరల “మీ ఉద్దేశము భగవత్కృపచే సిద్ధించుగాక” అని నుడివి ఫలమంత్రాక్షతలను అనుగ్రహించారు. గురువుల ఆశీర్వాదమును శిరసా ధరించి సతీపతులింటికి తిరిగి వచ్చారు. శ్రీ గురువర్యుల ఆశీర్వాదము భగవంతుని యనుగ్రహమునకు సూచనయే గదా!

తీర్థయాత్ర కేగవలయునను మాట వినిపించుటయే లక్ష్మమ్మ పాలిటికి సంజీవిని అయినది. ఆమెలో నవచైతన్యము వెల్లివిరియ సాగింది. పనిపాటులలో నుత్సాహము చాకచక్యము కనిపించసాగింది. వేదనచే వాడి దీనమైయున్న ఆమె ముఖంలో హర్ష సంతోషచిహ్నములు పొడసూపెను. “మీ ఉద్దేశము సిద్ధించుగాక”యని శ్రీ గురువర్యులొనర్చిన ఆశీర్వాదము జీవితాశా పూరకమై శక్తిదాయకమయ్యెను. ఆ తల్లి ముఖము అపూర్వ శాంతితో శోభించెను.

శ్రీ గురుదర్శన, శ్రీ శారదాంబాదర్శన, శృంగేరి క్షేత్రస్థ సర్వదేవతా దర్శనముల నొనర్చి ఆ పుణ్యదంపతులు ఒకనాటి శుభముహూర్తమున ప్రయాణమారంభించిరి. ఆప్తులైనవారు కొందరు వారి వెంట ఊరి పొలిమేర వరకు వచ్చి సాగనంపిరి. ఒకరిద్దరు అనుచరులు తోడురాగా కాలినడకనే ప్రయాణము సాగినది.

### 4

ఆ దినములలో ప్రయాణ సౌకర్యములు అంతగా లేవు. ఇప్పుడున్నట్లు బస్సులు లేవు. సరియైన బాటలు లేవు. ఈ సౌకర్యముల విషయమున శృంగేరి ప్రాంతము (మలెనాడు) వెనుకబడి ఉన్నది. దూరప్రయాణము చేయదలచినవారు ఉన్నంతవరకు రైలుమీదనో, బస్సు మీదనో పోయి అక్కడి

నుంచి గమ్య స్థానమునకు బండ్ల మీదనో, కాలినడకనో చేరుకొన వలయును. కాలినడకనే ప్రయాణం చేసేవారు అచట నచట గ్రామములలో మజిలీలు చేస్తూ తాము పోదలచిన స్థలాన్ని గూర్చి మార్గం తెలుసుకుంటూ ప్రయాణం చేసేవారు. శాస్త్రి దంపతులు ఎక్కువ ప్రయాణాన్ని కాలి నడకనే సాగించారు. అందుకే వారు నడిమి గ్రామములలో ఆగుతూ ఆగుంబ అనే గ్రామానికి వచ్చారు.

మలెనాడు చాలా రమ్యమైన ప్రదేశం. ఎక్కడ చూసినా పచ్చని పసిమి. తన దివ్య దేవాలయానికి వచ్చి సౌందర్య దర్శనముచే తరింపుమని సహస్రశీర్షయైన ప్రకృతిదేవి ఇక్కడ సహస్రాక్షియై సహస్ర బాహువులతో ఆహ్వానిస్తూ ఉండేది. ఆ దేవి సహస్ర మకుటాలు ప్రకాశమానములై శోభిల్లుతుండేవి. భావుకులైనవారు మైమరపు పొంది అక్కడి సౌందర్యంలో లీనమైపోయేవారు. ఇంతటి సౌందర్యానికి నిలయమైన శృంగేరి నుండి ప్రయాణమై వారు ఆగుండె వచ్చి అక్కడి ప్రకృతి శోభతో మరింత హర్షపులకితు లయ్యారు. లోకకల్యాణానికై తనను తానర్పిం చుకొన్న సూర్యదేవుడు అనుభవపూర్ణుడైన జ్ఞాని పవిత్రాత్ముడన్నట్లు తేజరిల్లుతూ వృద్ధకేసరి గాంభీర్యంతో పశ్చిమ సముద్రాన క్రుంగు చున్నప్పటి సంధ్యాకాలపు సొబగు ఆధ్యాత్మిక రమణీయత ఎవరి నాకర్షించదు?



శృంగేరి నుంచి వచ్చిన శాస్త్రి దంపతులు ఆగుంబెలో అడుగడుగునా పరవశ మొనర్చుచున్న సౌందర్యాన్ని దర్శించి హర్షితులయ్యారు. వారక్కడ ఉన్న రోజుల్లో తమ నియమ నిష్ఠల చేత, పూజ పారాయణాల చేత, మంచి మాటలచేత అందరి ప్రశంసలకు పాత్రులయ్యారు. తామను కొన్న దానికంటె ఎక్కువ దినాలు ఆగుంబెలో ఉండి అక్కడ జనాల ఆదరాతిథ్యాలతో తృప్తులై ఆగుంబె ఘాటు దాటి ఉడిపి చేరుకున్నారు. (ఘాటు అనగా ఎత్తయిన పర్వతాల నుంచి క్రిందకు దిగు మార్గం.)

ఉడిపి క్షేత్రమునకు వచ్చిన తరువాత లక్ష్మమ్మ లక్షణమే మారిపోయింది. ఆమె కనులు దివ్యతేజస్సుతో ప్రకాశింప సాగాయి. శాంతి సంతోషాలు ఆమె మనస్సును చూరగొని మేనంతా ఉత్సాహం తొణికిసలాడింది. శాస్త్రిగారు ఈ మార్పు లను గమనించారు. ఊరి నుంచి ఊరికి కాలినడకతో ప్రయాణం చేయడం కష్టసాధ్యమే అయినా, అందువల్ల ప్రకృతి సాన్నిధ్యంలో తన పత్ని చింతావ్యసనాలను మరచి ఉత్సాహ సంతోషాలను పొందడం చూచి శాస్త్రిగారు తృప్తులయ్యారు.

ఉడిపిలో సముద్రస్నానమయింది. శ్రీకృష్ణ దర్శనమైంది. లక్ష్మమ్మ కనులలో మనసులో హృదయంలో ఆమె శరీరమందంతట ఆ కృష్ణదేవుని దివ్యసుందర ముఖారవిందమే నిండిపోయింది. ఆ తల్లి ఆనందోన్మత్తయై పారవశ్యమందింది.

విద్వాంసులైన శాస్త్రిగారు ఉడిపి మఠంలో యతుల ఆహ్వానం అందుకొన్నారు. మఠ యతులందరితో సంభాషించి శాస్త్రిగారు వేదాంతచర్చలు చేశారు. అందరూ వారిని గౌరవిం చారు. ఏ ప్రస్థానానికి చెందినవారైతే ఏమి, విద్వాంసులందరూ పూజనీయులే కదా! ద్వైతవేదాంత మూలపీఠంలో అద్వైత వేదాంతి ఒకరు గౌరవం పొందడం పరస్పర గౌరవాదరాలకు నిదర్శనం కదా!

ఉడిపిలో చూడవలసిన వన్నీ చూచి, వినవలసినవన్నీ విని ఆ దంపతులు తమ ప్రయాణాన్ని సాగించారు. అప్పుడు వారి ప్రయాణం గోకర్ణాభిముఖమై ఉండేది. దారిలో అక్కడక్కడ విశ్రమిస్తూ దేవమందిరాలను, పుణ్యతీర్థాలను తమ యాత్రకు సార్థకతను పొందుతూ ఆ దంపతులు గోకర్ణక్షేత్రాన్ని చేరుకొన్నారు.

ఆ వేళకు లక్ష్మమ్మ మనస్సు పూర్తిగా కుదుటపడింది. చింతావ్యాకులతలు కడముట్టి హృదయముప్పొంగసాగింది. ఒకటి తరువాత ఒకటిగా వచ్చిన దుఃఖపరంపర అనుభవించిన ఆ తల్లికి ఇలాంటి కష్టనష్టాలు, ఇంతటి దుఃఖ వ్యసనాలను అనుభవిస్తూ ఇంకా ఈ జీవితం ఎందుకు జీవించాలని ఒక యోచన ఉండేది. అది ఇప్పుడు పోయి తమ నుంచి జరుగవలసిన సార్థకకార్యమేదో ఉన్నది కాబోలు. కాబట్టే భగవంతుడాయుర్దాయమిచ్చి ఈ పని చేయిస్తున్నాడని అనుకోసాగింది. కష్టపరంపర వెంటనే సుఖసంతోషాలు రావచ్చునన్న భావన కలిగింది. వెలుగుచీకటు లొకదాని నొకటి అనుసరించినట్లు సుఖదుఃఖాలు పర్యాయమున పరిక్రమించునని గ్రహించింది. తీర్థయాత్ర యొనర్చిన అనేక స్థలములలో వారి వారి భావముల కనుగుణంగా నిర్మితములైన వివిధ దేవ మందిరములలో ఆ తల్లి భగవత్సాన్నిధ్యమునే పొంది పులకితమయ్యెను. ఏదో అగోచరమైన శక్తి తమ్ము స్థలము నుండి స్థలమునకు, క్షేత్రము నుండి క్షేత్రమునకు తోడ్కొనిపోవుచున్నట్లామెకు భాసించెను. తమ మనోవాంఛలన్నియు పరిపూర్ణములై తమ జీవితము సార్థకమగు ఘట్టము సమీపమగుచున్నదని యామెకు భాసించెను. (సశేషం)

**- చెఱుకుపల్లి జమదగ్ని శర్మ**

**సూర్యుడు చీకటిని తొలగించినట్లుగా పాపాలను గంగ తొలగించి, ఇలాతలంలో పుణ్యాత్ములను చేసి అమరత్వాన్ని కలగజేస్తుంది. పవిత్ర గంగా నది విశిష్టతను తెలియజేసే ఈ వ్యాసం దర్శనమ్ పాఠకుల కోసం...**



**వి.వి. సత్యప్రసాద్**

పవిత్ర గంగానది గురించి శ్రీమదాంధ్ర మహాభారతంలో అనుశాసనిక పర్వం ద్వితీయాశ్వాసంలో - భీష్ముడు ధర్మరాజుకి గంగా ప్రభావాన్ని (27 పద్యాలలో) వివరించాడు.

యాగము, బ్రహ్మచర్యము, తపము, పరిత్యాగము వంటి నియమనిష్టలతో కూడిన సత్కర్మలు ఆచరించినప్పటికీ గంగామాతను సేవించిన ఫలితంగా సిద్ధించిన 'పుణ్యములకు' అవి సరికావు. పూర్వజన్మలో గానీ, ఈ జన్మలో గానీ ముందు చేసిన పాపాలను ప్రక్షాళన చేసుకోవడానికి పావనగంగలో స్నానమాడితే చాలు, సూర్యుడు చీకటిని తొలగించినట్లుగా పాపాలను గంగ తొలగించి, ఇలాతలంలో పుణ్యాత్మునిగా చేసి ఫలితం దక్కదని భీష్ముడు ధర్మరాజుకి చెబుతాడు. జాహ్నవీ నీటి కణము, గంగానదిలో ఇసుక రేణువు గాలి తాకున తలపై పడినా చాలు- దర్భను చూసి పాము భయంతో పారిపోయినట్లు పాపాలన్నీ తొలగిపోతాయి!! గంగానదీ తరంగాల నుండి వీచిన గాలిని పీల్చినా, ఆ గాలి ఏ మనిషిపై సోకినా, స్పృశించినా పాపాలు తొలగిపోతాయి. బాహ్యంగా, అంతరంగంలో గంగామాతను పూజించినా, తలచినా పాపాల నుండి విముక్తుడవుతాడు. ఎవరైతే పవిత్ర గంగలో నిర్మలచిత్తుడై, స్నానం చేసినంత మాత్రాన ఇటు ఏడు తరాలు, అటు ఏడు తరాలు, వారి పితృవర్గం మనసా వాచా కర్మణా చేసిన పూర్వజన్మ పాపాల నుంచి విముక్తులై, శుద్ధిపొంది సద్గతులు పొందుతారు. మరొక్క విశేషం: ''ఇది గంగ... ఇది గంగ'' అని తలచుకుంటూ, ఏ నీట మునిగినా, వారి తలపును బట్టి, దురితాలన్నీ దూరమై అంతే

అమరత్వాన్ని కలగజేస్తుంది. గంగ శరీరాన్ని తాకగానే మన శరీరంలో కోటి కల్మషాలను పోగొట్టి, విష్ణుపురంలో ఉన్న అలౌకిక ఆనందాన్ని పొందజేస్తుంది. మనుజుని శరీరంలో ఉన్న అస్థికలు ఎన్ని సంవత్సరాలు గంగాజలంలో నిక్షిప్తమై ఉంటాయో, అన్ని వేల సంవత్సరాలు స్వర్గలోకంలో మహా సుఖములు పొందినవాడై ఉంటాడు. అగ్ని లేని యజ్ఞము, చంద్రుడు లేని రాత్రి, సూర్యుడు లేని ఆకాశము, ఆత్మధర్మము లేని ఆశ్రమము, పుష్పసంపద లేని తరువుల వలె ''గంగానది లేని దేశం హీనత పొందును. వంద చాంద్రాయణ వ్రతములు చేసినంత పుణ్యం గంగాజలాన్ని శిరస్సుపై జల్లుకున్నంతనే కలుగుతుంది. గంగానదీ నీటికణము చేకూర్చినంత పవిత్రత ఏ ఇతర 'పవిత్ర కారకములు' చేకూర్చజాలవు. గతంలో తెలిసో, తెలియకో చేసిన పాపాలు, దుఃఖాలు గంగానదిలో పుణ్యస్నానము చేసిన వెంటనే అగ్నిలో పడిన దూదిపింజల వలె తక్షణమే తొలగిపోతాయి. ఆ పాపాలు పోగొట్టుకొనడానికి ఏవీ గంగకు సరిసమానం గావు.

ఏ శరణం లేని జనాలకు, పవిత్ర గంగానది 'పరమశరణం'. నిర్ధనులకు అమృతం వంటిది. మునులు, మహర్షులు, తపోధనులు - ఎంతకాలం జీవించి ఉన్నా గంగాస్నానం చేయనిదే, గంగా స్మరణం చేయనిదే వారికి పరిపూర్ణమైన పుణ్యాన్ని పొందుతారు. జాహ్నవిని చూసే అవకాశం ఉండి, సమర్థుడైన వాడు గంగను చూడకుండా ఉంటే, ''పశు ప్రతిముడు'' అని భారతంలో పేర్కొన్నాడు. అంధమానసుడైన



ఇంద్రుడు మొదలుగా, దేవతలందరూ గంగనూ, గంగామాతను తలచుకుంటుంటే, కోరుకుంటుంటే, మానవమాత్రులు కోరుకోవలదా? అని ప్రశ్నిస్తున్నారు తిక్కనగారు.

రాజభయము, చోరభయము, పాపభయము, భూతభయము, తదితర భయాలు- గంగా ప్రశంసతో తొలగిపోతాయి. పరమేశ్వరుడు పరమ పావనియైన గంగాదేవిని, శిరమున దాల్చడానికి కారణం- "అర్థించువారిని, నుతించువారిని" అనుగ్రహించి, కల్మషాలను తొలగించి, మానవజాతిని పునీతులను చేస్తుంది కాబట్టి గంగను నుతించే వారిని తాను కూడా 'సులభంగా' అనుగ్రహించడానికి అవకాశం ఉంటుందని భావించేవాడట.

గంగను - "మూడు లోకాలలో, ఉజ్జ్వల కృతితో, మూడు మార్గాలలో సంచరిస్తూ- పెంపు వహించినట్టి 'అమలతర మూర్తి' అని మహాభారతంలో తిక్కనగారు అభివర్ణించారు. గంగాదేవిని- గ్రహములకు ఇంద్రుడు వలె, ఇతరులకు శేషధీశుని వలె- నదులకెల్ల- జాహ్నవీనది ముఖ్యమైనది అని పేర్కొన్నారు. జహ్నుమహర్షి భగీరథుని అభ్యర్థన వల్ల గంగను విడిచిపెట్టిన కారణంగా జాహ్నవి అయింది. భగీరథుడు తన పూర్వ వంశస్థులైన సగరరాజు పుత్రలకు, ఉదాత్తగతుల కోసం ఈ భూమి మీదకు తీసుకువచ్చాడు. విష్ణపాదముల వలన, బ్రహ్మవలన, సూర్యునివలన, త్రిపురాసుర సంహారి అయిన శివుని వలన, అత్యంత పవిత్రమైన, పావనమైన, పూజ్యనీయమైన గంగానదిగా, హిమవత్పర్వతంపై గంగానదిగా స్థిరపడి, వివిధ ప్రదేశాలకు వ్యాపించింది. భక్తిభావంతో, మనసుని నిశ్చలంగా ఉంచుకొని, గంగామాతను శరణుకోరి ఆశ్రయించిన వారికి ధర్మబద్ధమైన సంపదలు ప్రసాదిస్తుంది.

**కం॥ నిజధర్మనిరతుడై తను**
**భజించు సజ్జనుని చిత్తపద్మము, కృప,**
**భజియించి, గంగ, యతనిన్**
**బ్రజనిత చిర సౌఖ్యుడేయు, బావన చరితా**





అని, అనుశాసనిక పర్వం- ద్వితీయాశ్వాసంలో, భీష్ముడు ధర్మరాజునకు గంగా ప్రభావం గురించి చెబుతాడు! "అనంత మహిమలు గల గంగా గుణ సంపదలు వందల కొలది దేవతలు, ఋషులు, మునులు, యోగులు, భక్తజనావళి ఆనంద వికసిత వదనాలతో కీర్తించారు.

కావున, ఈ జాహ్నవీ గుణములను, మనో, వాక్కాయ కర్మల ద్వారా సాధనతో భజింపుము" నిజధర్మనిరతుడై గంగను భజించు సజ్జనుడిని కృపతో చిరసాఖ్యుని చేయును అని పావనచరితుడైన ధర్మజునకు గంగా ప్రాశస్త్యము వివరించి "ఓ ధర్మరాజా! నీవు కూడా, గంగామాతను భజించి పరమశు భములను పొందుము" అని చెబుతాడు. ఈ గంగా ప్రాశస్త్యము, మహత్యము విన్నవారికి, వృత్తాంతము పఠించిన వారికి, గంగాస్తోత్రము చేయువారికి, రోగములు నయమగును. పాపములు హరించును. శుభములు కలుగును. ఇది సర్వకాల, సర్వావస్థల యందు యదార్థము" అని భీష్ముడు వచించెను.

పావన గంగాస్నానము, భగవద్గీతా పానము, పరమేశ్వరుని ధ్యానము... ధర్మమార్గ సోపానము.

## ఆశీర్వచనములు

(గత సంచిక తరువాయి)

"ఇంకా అర్థం కావాలంటే టీవీ స్క్రీన్, నీ జ్ఞానం అయితే, దానిమీద కదిలే బొమ్మలన్నిటినీ ఆది కప్పే వుంది, ఆ బొమ్మలన్నీ స్క్రీన్‌కి అన్యంగా కానీ, దూరంగా కానీ లేవు. నిజానికి అవన్నీ ఒక కాంతికిరణం వివర్తం తప్ప వేరే ఏమీ కాదు. ప్రపంచంలో నువ్వు చూసేవన్నీ నీ జ్ఞానమనే తెరమీద బొమ్మలు లాంటివే. తెరలోనే అవన్నీ ఉన్నాయి. వాటన్నిటిలోనూ తెర ఉంది. భగవద్ గీతలో ఒక శ్లోకం చాలా సేపు అర్థం కాలేదు.

"ఈ విశ్లేషణ చేసుకుంటే బాగా అర్థం అయింది" వివరించాడు ఆల్బర్ట్.

"ఆ శ్లోకం ఏమిటి?" అడిగింది విమల.

"సర్వభూతేషుచాత్మానం సర్వభూతానిచాత్మని" అన్ని భూతాలూ నాలో ఉన్నాయి. అన్ని భూతాలలోను నేను ఉన్నాను. బొమ్మలతో ఉన్న టివి స్క్రీన్ విశ్లేషించుకుంటే సరిగ్గా అర్థం అయింది."

మళ్ళీ అతనే అన్నాడు "ఇంకో ముఖ్య విషయం నువ్వు గమనించవలిసింది ఉంది. అది తలుచుకుంటే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. నీ జ్ఞానంలో ఎప్పుడూ ఏ మార్పూ లేకపోయినా, ఆ జ్ఞానం మీద వాస్తవంగా లేని అనేక రకాల దుప్పట్లు కప్పేయడం వలన, అది మరుగునపడిపోయి, దాని ఉనికిని మరిచిపోయి, ప్రపంచంలో పడి సుఖ దుఃఖాల వలయంలో పడిపోయాము. అలా కప్పేసినవన్నీ తొలగించు కుంటే కానీ ఆత్మని గుర్తించడం జరగదు. మనకి ఇదివరకు తెలిసినదే ఇంకో కోణంలో చెబుతున్నాను అంతే. నిజముగా ఆ దుప్పట్లు ఏమీ లేవు. ఉన్నాయనే భ్రమ వల్ల వచ్చింది చిక్కు అంతా. చిరు చీకట్లో నువ్వు తాడుని చూసి పాము అనుకున్నట్టు. పాము అక్కడ వాస్తవంగా లేదు." "అంతా చెప్పి ఏమన్నా అర్థం అయిందా?" అన్నాడు ఆల్బర్ట్ నవ్వుతూ.

"ఈ దుప్పట్లు ఏమిటి కప్పుకోవడం ఏమిటి?" కొంచం ఉదాహరణలతో వివరించాలేమో అంది"

అది నీకు అర్థం అవ్వాలంటే ఒక చిన్న కథ చెప్పాలి. అదేమిటంటే ఒక పశువుల కాపరి, తన గ్రామానికి దగ్గరలో ఉన్న అడవిలోకి పశువులను మేపడానికి తీసుకువెళ్ళేవాడు. ఒక మాటు దారి తప్పి రాత్రి అడవిలో ఉండి పోవాల్సి వచ్చింది, ఒక ముని ఆశ్రమం కనపడితే అక్కడ ఒక పాక లాంటిది ఉండడం చూసి ఆ మునిని, రాత్రికి ఆ పాకలో పశువులను కట్టేసుకుం టానని అడిగాడు. ఆయన అలాగేనని ఒప్పుకున్నాడు. కాపరి, పాకలోకి వెళ్లిన తరువాత అతనికి ఒక సమస్య వచ్చింది. రోజూ ప్రతి పశువునీ అతను, దాని మెళ్ళో ఒక తాడు /పటకా లాంటిది తగిలించి అది, ఒక గుంజకో, గోడనున్న మేకుకో తగిలించడం అలవాటు. ఆ పటకాలు తీసుకు రావడం జరగ లేదు. పశువుల్ని కట్టేయడం అతనికి సమస్య అయింది. ముని దగ్గరకి వెళ్లి సమస్య చెప్పాడు.

ఆయన ఒక్క క్షణం ఆలోచించి. "ప్రతిరోజూ నువ్వు ఏమి చేస్తూ ఉంటావు?" అని అడిగాడు.

"ఏమీ లేదండీ తాడుతో ఉన్న పటాకా పశువు మెళ్ళో వేసి, ఆ తాడుని గోడకి తగిలిస్తానండి" అన్నాడు.

"ఇప్పుడు కూడా అదే చేయి. వాస్తవంగా పటకా లేకయినా, దానిని మెళ్ళో వేస్తున్నట్టు, దానిని గోడకి తగిలిస్తున్నట్టూ చేతులు మాత్రం కదుపు. పశువులు ఎక్కడికీ వెళ్లవు" అని సలహా ఇచ్చారు. కాపరి అలాగే చేశాడు. రాత్రి హాయిగా నిద్రపోయి, ప్రొద్దుటే పశువుల్ని తోలుకుని వెడదామని వాటి దగ్గరికి వెళ్ళాడు. వాటిని ఎంత అదిలించినా అవి కదల లేదు. మళ్ళీ ముని దగ్గరకి వెళ్లి సమస్య చెప్పాడు.

మళ్ళీ ముని అడిగాడు "నువ్వు ప్రొద్దుటే ఏమిచేస్తావు?" అని.

"ప్రతి పశువు మెళ్లో పటాకా తీసేసి అదిలిస్తానండి అన్నాడు."

**అన్వేషణ**

"ఇప్పుడు కూడా పటాకా తీస్తున్నట్టు చేతులు కదిపి అదిలించు" అని సలహా ఇచ్చాడు.


కాపరి అలా చేయగానే, అవి కదిలి మామూలుగా నడిచి పోయాయి. ఈ కథలో గొప్ప రహస్యం ఉంది. మనం చిన్నప్పటి నుంచీ మనం చేస్తున్నామనుకుంటున్న పనులన్నీ, జ్ఞానంలో ఆలోచనలు మాత్రమే. ఏ క్రియ జరిగినా జ్ఞానంలో ఏమార్పూ జరగకుండా అలాగే ఉంది. అసలు ఎప్పుడూ ఏమీ జరగలేదు అన్న మాట. నేను పుట్టాను అనే భావం పసుల కాపరి, పటాకా ఏమీ లేకుండానే వేసినట్టు చేతులు ఊపిన ఒక పటకా అన్న మాట. నేను పుట్టాను అనే ఆలోచనతో ఒక దుప్పటి కప్పుకుంటున్నాము. ఆలా కప్పుకున్న వన్నీ అజ్ఞానం పొరలు. నేను మగ వాణ్ని, లేదా నేను ఆడదాన్ని, నేను పొడుగు, నేను ఫలానా కులం వాణ్ని, నేను ఫలానా వాడి తండ్రిని, లేదా కొడుకుని లేదా, భర్తని, భార్యని, అన్నని, తమ్ముడిని... నా డిగ్రీలు ఇవి, నేను ఫలానా దేశం వాడిని, నేను నల్ల వాడిని, నేను తెల్ల వాడిని నేను ఫలానా మతస్థుడిని ఇలా అన్నీ కప్పేసుకుని, వాటికి సంబంధించిన వ్యవహారాలలో చిక్కుకుని సుఖ దుఃఖాలు అనుభవిస్తూ జీవితమంతా గడిచి పోతుంది. అంత వరకు ఆమె ఎవరో స్త్రీ. ఆమెకి తాళికట్టడం అనే పటకా వల్ల భార్య అనుకుంటూ బంధీ అయిపోతాడు.

ఇంకో ఉదాహరణ చెప్పవచ్చు. నేల మీద ఒక తివాసీ పరిచి

ఉంది అనుకో. అది అక్కడక్కడ ముడతలు పడింది అనుకో. అక్కడ ముడత ఒక ఆకారంగా కనపడుతున్నా అది అంతా తివాసీ తప్ప వేరు కాదు. ముడత అంతా తివాసీ తప్ప వేరు కాదు కదా? అలాగే ప్రపంచంలో ఏ ఆకారాలయినా, బయట కనపడేవి మాత్రమే కాకుండా, మనసులో కూడా ఏమి కనపడినా అన్నీ జ్ఞానం యొక్క ముడతలు వంటివే. అంటే అవి జ్ఞానం తప్ప వేరు కాదు.'' వివరించాడు ఆల్బర్ట్.

"జ్ఞానం అలా ముడతలు పడినట్టు ఎందుకు కనపడాలి? అంటే ఆకారాలతో ప్రపంచం ఎందుకు ఏర్పడాలి? అడిగింది విమల.

"ఒకటి మరిచి పోకూడదు . ఆకారాలు ఏర్పడలేదు . ఏర్పడినట్టు కనపడుతున్నాయంతే. అదే ఉదారణకి అసలు సత్యానికి తేడా . తివాసీ ముడత పడినట్టు కన్పడటమే కాకుండా, ముడత పడుతోంది. కానీ జ్ఞానం అలా ఆకారంగా మారడం కానీ, అదే ముడత పడటం కానీ జరగదు. ఇప్పుడు నన్ను చూస్తున్నావు. అంటే నా ఆకారాన్ని, అది అనుభవం అవుతోంది. కానీ నీజ్ఞానం ఏమన్నా ముడత పడుతోందా? ఉండటం, తెలియడం (సత్, చిత్) వీటిలో ఏమన్నా తేడా ఫీల్ అవుతున్నావా?'' అడిగాడు ఆల్బర్ట్.



"ఓకే అర్థమయింది. కానీ అలా మారకుండా, మారినట్టు ఎందుకు కనపడాలి?'' అడిగింది.

"అంటే దుప్పటి ఎందుకు ముడతలు పడాలి అన్నట్టుంది. అలా ముడతలు పడటం దాని స్వభావం. స్వభావానికి వేరే కారణం ఉండదు. అగ్ని ఎందుకు వేడి గాఉంటుంది. అది దాని స్వభావం. ముడతలు పడటం తివాసీ స్వభావం. ఒక చెక్క షీట్ ని నేల మీద పరిచావు అనుకో, అది ముడతలు పడదు. అది దాని స్వభావం కాదు. అలాగే జ్ఞానం లో 'సత్ ' యొక్క స్వభావ ప్రభావం వల్ల ఆకారాలు ఏర్పడినట్టు అనిపిస్తాయి'' వివరించాడు ఆల్బర్ట్.

"అంటే ఎన్ని వస్తువులు ఎన్ని ఆకారాలతో కనపడుతున్నా అవన్నీ, నిజమనుకుని, సుఖదుఃఖాలల్లో చిక్కుకుని జీవితం అంతా గడిపేస్తున్నామన్న మాట'' అంది విమల.

ఒక్క జీవిత మంతా ఏమిటి? నమ్మితే, కొని కోట్ల జన్మల పాటు వాటిలో దొర్లడమే కదా?

"అంటే దేశ భక్తి లాంటివి కూడా అజ్ఞానం వల్ల నే అంటావా?

"మనం అజ్ఞానంలో జరిగే ప్రపంచ వ్యవహారాల తప్పు ఒప్పుల దగ్గరికి వెళ్ళటం లేదు. అవి మన స్వరూపం తెలుసుకోవడానికి ఎంత వరకూ సహకరిస్తున్నాయనే ఆలోచించాలి. దేశం, కాలం పరిధి లో జరిగే తప్పు ఒప్పులు స్థిరం కాదు. పాకిస్థాన్ విడిపోక ముందు ఉన్న భారతదేశంలో ఉన్నవాళ్ళకి దేశ భక్తి వేరు, విడిపోయిన తరవాత రెండు దేశాలలో ఉన్న వాళ్ళ దేశ భక్తి వేరు. ఒక కాలంలో తప్పు, ఇంకో కాలంలోఒప్పు అవవచ్చు.అందుచేత వాటి జోలికి వెళ్లకుండా స్వరూపం తెలుసుకోవడానికి ప్రాధాన్యం ఇస్తే, వలయం లోంచి బయట పడ వచ్చు. దేశం, కాలం, అనేవి మాయ శక్తిలో భాగం. అవి వాస్తవం కాదు. నీ గాఢనిద్రలో దేశం, కాలం ఎక్కడ ఉన్నాయి?'' వివరించాడు ఆల్బర్ట్.

"మరి ఈ దుప్పట్లు కప్పుకోవడం ఎలా జరిగింది? వాటిని ఎలా తొలగించుకోవడం? అడిగింది. విమల.

"మన ఎక్స్పెటెన్సు (శరణాగతి) సిద్ధాంతం మరిచి పోయావు. సంఘటనలు జరుగుతాయి. పనులుజరుగుతాయి, కానీ చేసేవాడు ఎవడూ లేడు (ఈవెంట్స్ హా ప్పెన్ , డీడ్స్ ఆర్ డన్ బట్ దేరీస్ నోఇండివిడ్యువల్ డూయర్)'' అని కదా. అదే మన అద్వైత సిద్ధాంతానికి వస్తే, జ్ఞానం ఒక్కటే కదాఉంట. మరి ఈ అజ్ఞానం ఎక్కడినుంచిఅనుకుంటే, ఆ కప్పుకొన్నవన్నీ, జ్ఞానం లోని సత్ శక్తి వల్ల మార్పుజరగకుండా జరిగినట్టు అనిపించడమే.

"సరే, అజ్ఞానం అంతా సత్ శక్తి వల్లే ఏర్పడింది. మరి అది తొలగించుకుంటేనే కదా స్వరూపం గుర్తించేది. తొలగించుకోవడం ఎలాగ?'' అడిగింది విమల.

వాటిని తొలగించుకోవడం అనేది ఒక ప్రత్యేకమయిన పనిగా కుదరదు. మళ్ళీ అదే శక్తి ప్రేరణ వల్ల 'నేను' ఎవరు అని విచారణచేసుకుంటూ పోతే, స్వరూపాన్ని గుర్తించడం, అజ్ఞానం తొలగడం రెండూ జరుగుతాయి. ఉదాహరణ స్వామి చెప్పారు కదా? ఇక్కడి నుంచి మనం బెంగళూర్ బయలు దేరితే బెంగళూరు కి ఎంతదగ్గర అవుతామో, కాళేశ్వరం అంత దూరం అవుతుంది. కాళేశ్వరం నుంచి దూరం అవడానికి ప్రత్యేక మయిన ప్రయత్నం చేయ నక్కర లేదు.

"స్వామి ఇచ్చిన క్యాసెట్స్ అవీ నీకు బాగా ఉపయోగ పడ్డాయనుకుంటాను. ''అంది విమల.

''అవన్నీ, ప్రస్థానత్రయం -ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గిత -వీటి సారం. అవన్నీ నేను గుర్తించిన దానిని ధృవీకరించడమే కాకుండా, వాటి వలన చాల అద్భుతమయిన ఉదాహరణలు తెలిశాయి. (సశేషం)

**- పోడూరి వెంకటరమణ శర్మ**

# భరతజాతిని మేల్కొల్పే 'అరవిందుని' కలం

(గత సంచిక తరువాయి)

కులం గురించి మన మత గ్రంథాల్లో ఏముంది? అన్నింటి కన్నా ప్రాచీన గ్రంథాలు వేదాలు. వీటిని శ్రుతి అంటారు. ఋషులకు తపస్సులో సాక్షాత్కరించిన సత్యాలు అని సాంప్రదాయికుల మాట. వేదాల్లో భాగమే ఉపనిషత్తులు కూడా. వేదాల్లో వర్ణాల గురించి ప్రస్తావన, కులాల ప్రస్తావన రెండూ ఉన్నాయి.

మొదటగా కులం అంటే ఏమిటి అని పరిశీలిద్దాం. కులం అన్నది సంస్కృత పదం. సమూహం అని దీని అర్థం. కుల ధర్మాలు అనే పదం ప్రాచీన గ్రంథాల్లో ఉంది. ఉదాహరణకు భగవద్గీతలో అర్జునుడు జాతి ధర్మాలు, కుల ధర్మాలు అని ప్రస్తావిస్తాడు (గీత 1-43). ఒకే వృత్తిలో ఉన్న వ్యక్తులు ఒక సమూహంగా ఉంటూ వృత్తి నైపుణ్యాన్ని రక్షించుకుంటూ వారి జీవనోపాధిని కూడా దాని ద్వారా చేస్తున్నవారిని కులం అని వ్యవహరిస్తాం. ప్రపంచంలో అన్ని సమాజాల్లోనూ అనాదిగా ఇలాంటి సమూహాలు సమాజ అవసరాల్ని బట్టి ఏర్పడతాయి. ఈవాళ మనిషికి వస్త్రాలు ఎంత అవసరమో అన్ని కాలాల్లోనూ అవసరం. అందుకు ఒక వర్గం ఏర్పడింది. ఇవాళ బంగారు ఆభరణాలు ఎలా అవసరమో ప్రాచీన సమాజంలో కూడా అలాగే అవసరం ఉండేది. అలాగే ఒకప్పుడు రథాలు చేసేవారు, విల్లంబులు చేసేవారు, కవచాలు తయారు చేసేవారు ప్రత్యేక కులాలుగా ఉండేవారు.

యజుర్వేదంలోని శ్రీరుద్రంలో ఆనాటి సమాజంలోని అనేక వర్ణాల ఉనికిని పేర్కొన్నారు.

ప్రపంచంలోని అన్ని రూపాలూ, రుద్రుని రూపాలే అనే భావనతో అన్నింటినీ గౌరవించాలని చెప్పే ఉపాసన ఇది. అందులో భాగంగా సమాజంలోని అన్ని వర్గాలూ చెప్పబడ్డాయి. ఉదాహరణకు బాణాలు వేసేవారు, అశ్వపతులు (గుర్రాలు ఉన్నవారు), వేటగాళ్లు, వేటాడే స్త్రీలు, మోసగాళ్లు, దొంగలు, కత్తిసాము చేసేవారు, దోపిడీ దొంగలు, భూ ఆక్రమణ చేసే వారు, రథాలున్నవారు, రథసారథులు, రథకారులు, సైనికులు, శిల్పులు ఇంకా ఎన్నో వర్గాల్ని పేరు పేరునా నమస్కరించడం ఇందులో ఉంది. కానీ ఈ కులాలను రుద్రం సృష్టించ లేదు. ఈ అధ్యాయాన్ని చదివితే మనలోని సంకుచిత ఆలోచనలు తొలగిపోతాయి.

కొన్నివేల సంవత్సరాల క్రితం ఆనాటి సమాజ అవసరాల్ని బట్టి ఏర్పడిన వర్గాలు ఇవి. వీటిని ఏ దేవుడు గానీ ఋషి గానీ నీవు శిల్పిగా ఉండు, నీవు స్వర్ణకారుడిగా ఉండు అని చెప్ప లేదు. ఏ పుస్తకంలోనూ చెప్పలేదు. వేదకాలం నాటికే సమాజంలో అనేక వృత్తులు ఉండేవని స్పష్టంగా చెప్పగలం.


మరొక వేదం ఋగ్వేదం. దీనిలో పదివేలకు పైగా ఉన్న మంత్రాల్లో కేవలం ఒక మంత్రం భారతీయ సమాజంలో అత్యంత ఆందోళనకు కారణమైంది. ఈ మంత్రం పురుష సూక్తంలోని పదహారు మంత్రాల్లో ఒకటి. ఈ సూక్తం అసలు ఉద్దేశం విశ్వాన్నంతా ఒకే వ్యక్తిగా భావన చేసి అందులో తనను ఒక భాగంగా, అంగంగా చూసుకొని అన్ని ప్రాణుల పట్ల బాధ్యతతో ప్రవర్తించడం. ప్రపంచంలోని అన్ని ప్రాణుల అంతఃకరణాలు (అన్ని ప్రాణులలోని చైతన్యం, తెలివి), ఇంద్రియాలు అన్నీ పరమాత్మవే అని ఆ సూక్తం ప్రారంభమౌ తుంది. సృష్టిలో భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో ఉండేదంతా పరమాత్మ తత్వమే అని



చెపుతుంది. సృష్టి అనేది పరమాత్మ యొక్క చిన్న లీల మాత్రమే (ఏతావానస్య మహిమా) ఆ పరమాత్మ నుండి విశ్వం ప్రకటమైనది. దానిలో సకల జంతువులు ఆవిర్భవించాయి. కంటి నుండి సూర్యుడు, మనస్సు నుండి చంద్రుడు, నోటి నుండి అగ్ని ఇంద్రుడు ఉత్పన్నమయ్యారు. ఈ విశ్వాన్ని మనుష్యరూపంలో భావించిన ఋషులు ఎలాంటి కల్పన చేసారు (కతిథా వ్యకల్పయన్) అనే ప్రశ్న కూడా సూక్తమే వేసుకొని ''బ్రాహ్మణోస్య ముఖమాసీత్'' (బ్రాహ్మణుడు దానికి ముఖము అయ్యాడు అంటుంది. సంస్కృతంలో ముఖమనే పదానికి ముఖము లేదా నోరు అని రెండు అర్థాలు. బ్రాహ్మణుడు సమాజానికి నోరు లాంటివాడు (Mouthpiece) అని అర్థం సంస్కృత వ్యాకరణం తెలిసిన ఎవరైనా ''బ్రాహ్మణోస్య ముఖమాసీత్'' అంటే బ్రాహ్మణుడు ముఖం అయ్యాడు అనే ఉందని చూడగలరు. ముఖం నుండి పుట్టాడని చెప్పలేదు. అలాగే క్షత్రియుడు భుజంగా చేయబడ్డాడు, వైశ్యుడు తొడలుగా నిర్మించబడ్డాడు అని చెప్పి పద్యాం శూద్రో అజాయత అనగా కాళ్ళ వలన శూద్రుడు జన్మించాడు అన్న వాక్యం ఉంది. మంత్రంలోని మొదటి మూడు పాదాల్లోనూ విభక్తి వేరు. నాల్గవ పాదంలో విభక్తి వేరు. అయినా ప్రాచీన

వ్యాఖ్యకారులు బ్రాహ్మణుడు ముఖము నుండి పుట్టాడని, క్షత్రియుడు భుజం నుండి, వైశ్యుడు తొడలనుండి, శూద్రుడు పాదాల నుండి పుట్టాడని చెప్పడం వల్ల సమాజంలో కలతలకు కారణమైంది. ఈ సూక్తం చివరలో "తథా లోకాన్ అకల్పయన్" ఈ విధంగా లోకాలన్నింటిని కల్పన చేసారు అని మరొకసారి ఇదంతా ఉపాసనకై చేసిన కల్పన అని చెప్పారు. దాన్ని వదిలి మనం ఈ మంత్రాన్ని వేరుగా అర్థం చేసుకోవడం వల్ల కొన్ని వర్ణాలు ఎంతో క్షోభకు గురయ్యాయి.

దీని తరువాత యజుర్వేదానికి చెందిన బృహదారణ్యక ఉపనిషత్తులో చక్కని వాక్యాలున్నాయి (1-4-10, 11, 12). మొదట్లో కేవలం బ్రహ్మ (బ్రాహ్మణుడు) అని ఒకే తత్త్వం ఉండేది. (బ్రహ్మవా ఇదమగ్ర ఆసీత్). ఆ సమాజం సరిగా అభివృద్ధి చెందలేదు అందువల్ల "తత్ శ్రేయో రూపం అత్యసృజత క్షత్రం" అంటే తేజోవంతమైన క్షత్రియ అనే తత్త్వం సృష్టింపబడింది. ఈ రెండూ ఉన్న వ్యవస్థ కూడా సరిగా అభివృద్ధి కాలేదు. తరువాత వాటి నుండే వైశ్య అనే మరొక తత్త్వం నిర్మించబడింది. ఇంకా కొరత ఉన్నందున దానిలోనే శూద్ర అనే తత్త్వం నిర్మించబడింది. శూద్ర అనే వర్ణాన్ని పూషన్ అంటే పోషకుడు, సమాజాన్ని పోషించేవాడు అని పిలిచారు. ఈ విధంగా ఒకే తత్త్వం, లేదా ఒకే సమూహం నాలుగు వర్ణాలుగా విభాగం పొందింది. క్షత్రియుడు తేజోవంతు డైనందున సింహాసనంపై ఉన్న రాజును బ్రాహ్మణుడు క్రింద నిలబడి గౌరవించాలి అని కూడా చెప్పారు. అంటే రాజ్యాధికారం ఉన్నవాడే అందరికన్నా గొప్ప అని అర్థం.



బ్రాహ్మణ, క్షతియ వర్ణాలు రెండూ వైదిక కాలంలో పరస్పర వివాహ సంబంధాలు కల్గి ఉండేవి. క్షత్రియుడైన యయాతి బ్రాహ్మణ స్త్రీ అయిన శర్మిష్టను వివాహం చేసుకొన్నాడు (భారతం). ఋషభ దేవుడనే మరో రాజుకు కలిగిన సంతానంలో కొందరు వారి స్వభావాన్ని బట్టి బ్రాహ్మణులయ్యారు, కొందరు క్షత్రియులయ్యారు (భాగవతం). మహాభారత మూల పురుషు డైన శంతనుని అన్న క్షత్రియుడైనా స్వభావంతో 'బ్రాహ్మణుడై రాజ్యాధికారాన్ని తమ్ముడికి ఇచ్చి బ్రాహ్మణ ధర్మాన్ని పాటిం చాడు. విశ్వామిత్రుడు తపస్సు చేసి బ్రాహ్మణుడయ్యాడు. సామ వేదానికి చెందిన ఛాందోగ్యోపనిషత్తు (5-3)లో బ్రాహ్మణ విద్యా ర్థులు క్షత్రియుని వద్ద బ్రహ్మవిద్య నేర్చుకొన్నారని చెప్పారు. అలాగే బ్రాహ్మణ అధ్యాపకులు లేనిచోట్ల వైశ్యుని నుండి వేదవిద్యను నేర్చుకోవచ్చని కూడా మన స్మృతులు చెపుతాయి.

మహాభారతంలో పలుచోట్ల వర్ణవ్యవస్థ గురించి చర్చ ఉంది. ఎవరు ఎక్కువ ఎవరు తక్కువ అన్నదే ముఖ్యవిషయం కావున వ్యాసమహర్షి దీన్ని పలుచోట్ల చర్చించాడు. శాంతిపర్వంలోని భృగువు, భరద్వాజుడు అనే ఋషుల మధ్య జరిగిన సంభాషణ గమనించదగినది (శాంతిపర్వం అధ్యాయం 188 శ్లోకాలు 10 నుండి 13).

**న విశేషోస్తి వర్ణానాం సర్వం బ్రాహ్మమిదం జగత్**
**బ్రహ్మణా పూర్వసృష్టం హి కర్మభిర్వర్ణతాం గతమ్** (188-10)

"వర్ణాల మధ్యలో తేడా ఏమీ లేదు. మొదట్లో ప్రజలందరూ బ్రాహ్మణజాతిగానే బ్రహ్మచేత సృష్టించబడ్డారు. తరువాత వారి కర్మల్లో (వారి ప్రవర్తనలో) మార్పు రావడం వల్ల వివిధ వర్ణా లుగా మారారూ అని దీని అర్థం. కామభోగాల్ని కోరేవారు, క్రోధం సాహసం స్వభావంగా కలవారు క్షత్రియులయ్యారు (1188-11). పశుసంప దను పెంచేవారు వ్యవసాయం, వాణిజ్యం చేసేవారు వైశ్యులయ్యారు (1188-12). అలాగే హింస, అసత్య వచనం, ఎలాంటి వృత్తినైనా చేసేవారు, శౌచం లేనివారు శూద్రులయ్యారు (1188-13). క్రమ క్రమంగా వారి పనుల్లో మార్పు రావడం వల్ల బ్రాహ్మణులే ఇన్ని వర్ణాలుగా మారారు (188-140).

ప్రాచీన గ్రంథాల్లోని అనేక ఉదాహర ణలు ఆనాటి సమాజం లోని ఉదాత్త ఆచరణను తెలియజేస్తాయి. రామాయణంలో శబరి, గుహుడు ఇందుకు ఉదాహరణలు.

మునులు చాలామటుకు అడవుల్లోనే వనచరులతో పాటు నివసిస్తుండేవారు. వరాహ పురాణం (అధ్యాయం-8)లో ఒక వ్యాధుని (వేటగాని) కుమార్తెను ఒక ఋషి తన కోడలుగా స్వీకరిస్తాడు. అదే పురాణంలో మరొక వ్యాధుడు (బోయవాడు) తన పవిత్ర నడవడికతో దుర్వాసుని మెప్పించి అతని నుండి బ్రహ్మ జ్ఞానాన్ని పొంది తాను కూడా ఒక మునిగా మారతాడు. ఇలాంటి పరస్పర సంబంధాల్ని గమనించకుండా విలియమ్ జోన్స్ కేవలం మనుస్మృతిలోని కొన్ని శ్లోకాల్ని భారతీయ సంస్కృతిగా చూపడం బ్రిటీషు పాలకుల కుటిలనీతికి ఉదాహరణ.

ఉపనిషత్తుల తరువాత వచ్చిన భగవద్గీతలో (గీత 4-13, 18-41 ముఖ్యమైన శ్లోకాలు). "చాతుర్వర్ణ్యం మయా సృష్టం" (4-13) అనే శకంలో మనుష్యుల గుణాన్ని బట్టి సమాజంలో వాళ్ల విధులు/కర్తవ్యాలు నిర్ణయించబడ్డాయని శ్రీకృష్ణుడు చెపుతాడు.

(సశేషం)

## మహాస్వామి వారి తెలుగు ఉపన్యాసం

(గత సంచిక తరువాయి)

అతనే ఈ రూపమై, ప్రపంచరూపమైన ఈ విలాసాన్ని మనకి చూపిస్తున్నాడు. అంచేత కారణం ఒక విత్తు. కారణం ఒక వృక్షం, దాని కార్యం. ఒక విత్తుచేత ఒక పెద్ద వృక్షం కలుగుతుంది. ఉత్పత్తి అవుతుంది. ఆ విధంగానే ఆ పరమేశ్వరుడు ''కారణం'', ప్రపంచం అంతాకూడా 'కార్యం'. అంటే ప్రపంచానికి ఈశ్వరునికి ఏమిటి సంబంధం అంటే ''కార్యకారణతయా'' కారణమైనవాడు ఈశ్వరుడు, కార్యమనేది ఈ ప్రపంచమంతా కూడా. ఈ కార్య కారణమనే ఒక సంబంధం ఈశ్వరునికి ప్రపంచానికి ఉండెడిది.

''విశ్వం పశ్యతి కార్యకారణతయా స్వస్వామిసంబంధతః'' 'స్వం' అంటే సొమ్మని అర్థం. స్వామి అంటే, ఆ సొమ్ము యొక్క యజమాని అని. ప్రపంచమంతా కూడా ఈశ్వరుని యొక్క సొమ్ము. ఈ విశ్వానికి ఈ ప్రపంచానికంతటికి కూడా అధిపతి ఈశ్వరుడు. ఒక ఇల్లు, ఒక తోట, భూమి, డబ్బు ఇవన్నీ ఉంటే మనము సొమ్ము అని అంటాం ఉదాహరణకి. దానన్నిటికి కూడా ఈశ్వరుడు ఈ ప్రపంచమంతా కూడా, సకల ప్రపంచానికి, సకల



తూములూరి మోహన్ కుమార్

విధంగా చెబుతూవెళితే కొన్ని సంబంధాలు ఈశ్వరుడికి, ప్రపంచానికి, మనకు ఉందని... ఇక అంతులేదు ఎంతైనా చెబుతూ వెళ్ళవలసిందే. అంచేత అంత వరకు ఒక వృత్తాన్తముగా దాని గురించి ఆ ఈశ్వరునికి శివార్పణమ్ ''ఏకబిల్వం శివార్పణమ్'' మనం అర్పించవలసిందేమో ఒక బిల్వదళం.

అంచేతన ప్రపంచం అంతాకూడా ఎందరు ప్రజలున్నారో!... కోటి మంది ప్రజలు, ఒక ప్రజ, ఒక మనిషి, ఒక బిల్వదళం వేసినట్లయితే, కోటిబిల్వార్చన అయిపోతుంది. అంచేతనే కొన్ని చోట్ల కాళహస్తి, ద్రాక్షారామం అటువంటిచోట్ల కోటిబిల్వార్చనని చేస్తున్నారు శివరాత్రినాడు... మాసశివరాత్రినాడు. అటువంటి పరమేశ్వరునికి మనమంతా కూడా బిల్వార్చనని చేసి ఈశ్వరుని యొక్క దాసులం అన్న ఒక్క భావం మనకి ఉన్నట్లైతే మన జన్మ తరిస్తుంది.

సాధారణమైన మామూలు మనుషుల యొక్క దాసోహం

# కంచిస్వామి దివ్య చరిత్ర 'గిని - అద్వైత గని'

భూమికి, సకల లోకానికి అంతా కూడా అతని సొమ్ము. 'కార్య కారణ భావం స్వస్వామిసంబంధం' అంటే స్వామి ఈ సొమ్ము అని, ఈ రెండవ సంబంధం ఈశ్వరునికి, ప్రపంచానికి.

''శిష్యచార్యతయా'' మనకుండే అజ్ఞానాన్ని నివృత్తిచేసి జ్ఞానప్రకాశాన్ని కలగచేసేవాడు సాక్షాత్తు దక్షిణామూర్తి. జ్ఞాన ముద్ర చేతులోనుంచుకున్నవాడు. ఈ చిన్ముద్రకు జ్ఞానముద్ర అనిపేరు. ''స్వస్వామిసంబంధతః శిష్యచార్యతయా'' సమస్త ప్రపంచానికి కూడా గురువైనవాడు సాక్షాత్తు ఈశ్వరుడు. వేదంలో గూడ ''సర్వవిద్యానాం ఈశానః'' సర్వ విద్యల్లో కూడా సర్వ జ్ఞానప్రకాశానికి కూడా ప్రభువు ఈశ్వరుడు, అతనే ''దక్షిణా మూర్తి'' అని కూడా అంటారు.

జటాధారి అయి ఉండి భస్మం, జటా, చిన్ముద్ర, ''చిన్ముద్ర'' అంటే జ్ఞానం. జ్ఞాన ముద్రతో ప్రపంచానికి అంటే ఇలా ఎవరెవరికి తన ప్రాధాన్యం గురించి నమస్కరిస్తున్నారో వారి అజ్ఞానాన్ని విముక్తి చేసేవాడు. అంచేత ఆచార్యుడు. ప్రపంచం అన్నిటికి కూడా ఆచార్యుడు. తల్లి, తండ్రి, ప్రభువు, ప్రపంచం అంతా కూడా అతని సొమ్ము. ఆ సంబంధం రెండవది.

మూడవది...''శిష్యచార్యతయా'' తల్లి తండ్రి అని చెప్పేది, ''పితృ పుత్రాద్యాత్మనా భేదతః'' అతని పితా జగత్తుట, మనమందరము కూడా పుత్రులం. పితృ పుత్ర ఆద్యాత్మనా ఓ

వారు మనకి ప్రభువు అని అనుకుంటే, వారి శరీరం కూడా పోతుంది, మన శరీరం కూడా పోతుంది. అది శాశ్వతమైనది కాదు. ఈ ప్రపంచమంతటినీ కూడా ఒకడు సృష్టించాడు. మనందరినీ కూడా ఏదో విధంగా మనకు జీవనం కల్పించి పోషిస్తున్నాడో అటువంటి పరమేశ్వరుని యొక్క దాసులము అని మనము అప్పుడప్పుడు భావన మనకున్నట్లైతే, అప్పుడే మనజన్మ తరిస్తుంది. లేకపోతే జన్మ వ్యర్థమైపోతుంది. ఒకరి దాసులంటే, ఒక సేవకుడు, ఒక బంట్రోతు అంటే ఎవరు మనకు జీవనం ఇస్తున్నారో వారియొక్క బంట్రోతు వారియొక్క చిహ్నమును ధరిస్తున్నాడు. ఒక పోలీసులో లేక ఒక హైకోర్టులో జడ్జి ఉంటేను వారిదగ్గర వారు డబ్బుతీసుకొని వారి జీవనం జరుగుతుంది.

అప్పుడు వారు కొన్ని చొక్కాయిలో, ఒక వస్త్రాధికాలో, కొన్ని చిహ్నములు వారంతా కూడా ఇస్తున్నారు. అప్పుడు దాన్ని ధరించడానికి వీడు సిగ్గుపడి దాన్ని ధరించకపోతే, వాడికి అక్కడ ప్రవేశానికిగాని, వాడి జీవనంకూడా సరిగ్గా జరగదు. అందునా వాడు సిగ్గుపడినట్టయితే, ఆ ప్రభుత్వానికి ఆ సేవచేయటానికి వాడికి అర్హత లేదు. ఆ జన్మ వ్యర్థమైపోతుంది వాడికి. పోలీసులకు వెళ్ళి మనం జీతంతీసుకొని తరువాత అవన్నీకూడా వారిచ్చే చిహ్నములన్నీ కూడా నేను ధరించను, నాకు సిగ్గుగా ఉంటుందని... అనడు. అన్నట్టయితే, వారికి ఆ సేవ ఫలం దొరకదు.

ఆ విధంగానే సర్వేశ్వరుడు యొక్క చిహ్నం "పంచ చిహ్నములు" ఈశ్వరుని యొక్క చిహ్నములు. అవన్నికూడా మనం ధరించవలసిందే. పంచ చిహ్నములంటే నెత్తిమీద భస్మ, కంఠములో రుద్రాక్షం, వాక్కులో ఈశ్వరుని యొక్క పంచాక్షరం, హృదయంలో ఈశ్వరస్వరూపం, రససుద్ధస్ఫటిక సంకాశమైన స్వరూపాన్ని హృదయంలో ధ్యానం చేయడం. ఈశ్వరునికి నెత్తి మీద ఒక చిహ్నం ఉంది ధరించవలసిందే. బాహ్యంగా ఉండేది నెత్తిమాత్రమేకాదు శరీరమంతా కూడా భస్మం ధూళినం చేసుకోవలసింది, శరీరమంతా కూడా విభూతిధారణ చేసుకోవలసింది, కంఠంలో రుద్రాక్ష ధారణ చేసుకోవలసింది, హృదయంలోకూడా పరమేశ్వరుని యొక్క సుద్ధస్ఫటిక సంకాశమైన ప్రకాశమైన ఈశ్వరస్వరూపాన్ని జ్యోతిస్వరూపుడైన ఈశ్వరుడిని ధ్యానించవలసింది. నోటితో పంచాక్షర జపం, చేతిలో అర్చన చేయవలసిన ఒక బిల్వం. "ఏకబిల్వం శివార్పణమ్".


అయితే బిల్వానికున్న విశేషమేమిటంటే... ఈ బిల్వదళంలో సకల ఐశ్వర్యం ఉంటుంది. లక్ష్మీనివాస భూతమైనది బిల్వం. ఐశ్వర్యం లక్ష్మి యొక్క నిధి నివాసం. అంచేత లక్ష్మీంట్కువాసం చేసే ఒక బిల్వం అది ఈశ్వరునికుడా అర్చన చేయవలసినది



అని, మహాలక్ష్మి యొక్క నివాసమైన బిల్వాన్ని ఈశ్వరునికి అర్చన చేయవలసినది అర్పణచేయవలసినదే. మహాలక్ష్మి అష్టోత్రం నూటఎనిమిది నామాలున్నాయి అర్చన చేసే, పూజ చేసే నామములు. అష్టోత్రం నూటఎనిమిది. అందులో మహాలక్ష్మిని "బిల్వ నిలయాయై నమః" అని ఒక చోట వుంది. పెద్ద పెద్ద పెరుమాళ్ క్షేత్రంలోనూ, మహాలక్ష్మి సన్నిధానంలో, తాయార్ సన్నిధిలో, బిల్వవృక్షం ఎప్పుడూ కూడా సాన్నిధ్యంతో ఉంది. బిల్వంలోనే మహాలక్ష్మి వాసం చేస్తుందని శ్రీసూక్తంలో వేదంలో ఒకభాగం ఉంది.

అందులో ఒక వృక్షం బిల్వం, "స్తవ వృక్షాహః బిల్వహః వనస్పతిః స్తవ వనస్పతిః బిల్వహః" అని చెప్పింది శ్రీ సూక్తంలో. లక్ష్మి యొక్క అష్టోత్రంలో "బిల్వనిలయాయై" బిల్వంలో వాసంచేసే తాయారు మహాలక్ష్మి అని చెప్పింది. (సశేషం)






## సమస్త ఆస్తిక లోకానికి దార్శనికులు భారతీతీర్థులు

(గత సంచిక తరువాయి)

నేను, సుప్రసిద్ధవైద్యులు, దైవచింతనాపరులు, పరోప కారులు, మంచి పేరు ప్రతిష్ఠలు గల డా॥ శ్రీ శాంతరాము గారి వద్ద ఉచిత చికిత్స పొందుతూ నేటివరకూ శస్త్రచికిత్స అవసరం లేకుండా ఆరోగ్యంతో 86వ సంవత్సరంలో అడుగిడి జీవితం గడుపుతున్నాను. ఎక్కడ 1991? ఎక్కడ 2008? నేటివరకు నేను శ్రీ మఠ సేవచేసే భాగ్యం కలగడం శ్రీచరణుల కృపవలననే కదా! నిస్సందేహంగా వారి కరుణే! అందువలనే నేనెప్పుడూ భావిస్తా; నా జీవితం శ్రీ శృంగేరి శారదాపీఠేశ్వరులు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామివారి పాదపద్మములకు అంకితమని, ఇది పూర్వజన్మ సుకృతఫలము.

మరొక అనుభూతి. మా పెద్ద కుమారునికి 1991 ప్రాంతంలో మూత్రపిండాల వ్యాధి సంక్రమించింది. మూత్రపిండాల మార్పిడి తప్పదన్నారు. ఎంతమంది దాతలు ముందుకు వచ్చినా వారిని పరీక్షించిన తరువాత అవి సరిపడవు అన్నారు. దానికి కారణం మావాడి నెత్తురులో యాంటీ బాడీస్ తయారయ్యాయని, అవి పోవాలంటే అమెరికా నుంచి రక్తం శుభ్రం చేసే ఫిల్టర్లు తెప్పించాలన్నారు. కొంతకాలం తరువాత ఈ విషయాలు శ్రీవారి దృష్టికి తీసుకువెళ్లాను. 10 రోజులు, శ్రీ శారదాంబ అంత రాలయంలో సప్తశతి=పారాయణ చేయించమని శ్రీ చరణుల ఆదేశం. ఇక్కడ పండితుడు 9 రోజులు గుడిలో చేస్తే చాలునని వ్యాఖ్యానించబోతే, అతన్ని నేను మందలించడం జరిగింది. అయినా శాస్త్రిగారి ధోరణి మారలా. సరే పారాయణ మొదలైంది. తమాషా జరిగింది. పండితుడు రోజులు తప్పు లెక్క వేసుకుని గుడిలోనే పదిరోజులు పారాయణ చేసి తరువాత చెంపలు వేసుకుని "శ్రీచరణుల వాక్కు అమోఘం. వారి ఆదేశాన్ని వ్యాఖ్యానించడం క్షంతవ్యం గాని తప్పు. మన్నించమని వారినే వేడుకుంటా" అని మిక్కిలి చింతించాడు. జపం పూర్తయిన మరునటి రోజునే ఒక దాత మూత్రపిండాలు సరిపోవడం వల్ల మా వాడికి జయప్రదంగా ఆపరేషన్ జరిగింది. ఇది అందరినీ ఆశ్చర్యపరిచింది.

మరియొక సందర్భం. అతి చిత్రం. అమెరికా దేశంలోని శ్రీమఠ భక్తుల కుమారునికి జరిగింది. హైదరాబాద్ కేంద్రంగా "శ్రీ శృంగేరీ శారదా సేవాసమితి, ఆంధ్రప్రదేశ్" అనే సంస్థ ఉన్నది. క్లుప్తంగా ఈ సంస్థ ఆశయం రాష్ట్రవ్యాప్తంగా స్త్రీలలోను, పిల్లలలోను శ్రీ శృంగేరీ శారదాపీఠ విశిష్టత, శ్రీ శృంగేరీ జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వాముల వార్ల ఆశీరనుగ్రహ విశేషాలు ప్రచారం చేస్తూ సనాతన ధర్మరక్షణకు కృషి చేయడం. దీనికి రాష్ట్ర కార్యదర్శి శ్రీమతి కొవ్వూరి రాజేశ్వరి. ఈమెగారి భర్త కొవ్వూరి లక్ష్మీనారాయణ. ఈయన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఆఫీసరు. శ్రీమతి రాజేశ్వరి సెక్రటేరియట్‌లో సెక్షన్ ఆఫీసర్. వీరుభయులు శ్రీ మఠానికి అత్యంత ప్రీతిపాత్రులైన శిష్యులు. వీరిని ఆధ్యాత్మిక సామ్రాజ్య పరిధిలోనికి ప్రవేశపెట్టింది నేనే అవడం వలన, వారి అనుభూతులు, అనుభవాలు, దాపరికం లేకుండా నాకు విన్నవిస్తూ ఉంటారు. వీరికి ఒకే కుమారుడు. బి.టెక్ ఇక్కడ పూర్తి చేసి, పై చదువులకు అమెరికా వెళ్లాడు. కుర్రవాడు కూడా

శృంగేరి జగద్గురువుల భక్తుడు. తరచూ శృంగేరి వెళ్లడం, శ్రీవారిని దర్శించడం, ఆశీస్సులు పొందడం పరిపాటి. అమెరికా వెళ్లే ముందు, తల్లిదండ్రులతో శ్రీచరణులను దర్శించి ఆశీస్సులు పొందాడు. ఆ సందర్భంలోనే శ్రీవారన్నారట- "అక్కడ ఏ ఇబ్బంది వచ్చినా నన్ను తలచుకో, నేను నీ వెంటే ఉంటా, భయం లేదని." రెండు సంవత్సరాలు బాగానే గడిచాయి. ఏ సమస్యా రాలేదు. తరువాత ఒక సంఘటన జరిగింది. కుర్రవాడు వేరే ప్రాజెక్టు పనిమీద అమెరికాలోనే మరో ప్రదేశానికి వెళ్లి, ఒంటరిగా గది అద్దెకు తీసుకుని నివసిస్తున్నా. ఆ ఇంటి యజమాని ధనాశాపరుడు. ముందు అనుకున్న విధంగా కాక, కారణాంతరాల వల్ల ప్రాజెక్టు పని మరొక మాసం పొడిగించబడింది. కుర్రవాడు అదే రూములో ఉంటానన్నాడు. "48 గంటల్లోగా గది ఖాళీ చెయ్యాలి, లేకపోతే సామాన్లు వీధిలో పారేస్తా" అని ఇంటి యజమాని నిర్మొహ మాటంగా శాసించాడు. కాస్త ఆలోచించండి. దేశం కాని దేశం 20 ఏళ్ల కుర్రవాడు. దగ్గరలో నా అనేవారు లేరు. కుర్రవాని మేధస్సును ఛేదించే సమస్య. పరిష్కారం తోచక తలచుకుని రక్షించమని మనస్సులో విలపిస్తూ భారతదేశంలోని తల్లికి ఫోను చేశాడు. చూడండి గురు కృప! అదే సమయానికి, సెక్రటేరియట్‌లో ఆమె పనిచేసే సెక్షన్‌లో పనిపడి, ఒక పెద్దమనిషి... అపరిచితుడు వచ్చి "మేడమ్! దిగాలుగా ఉన్నారేమిటి?" అని ప్రశ్నించడం, శ్రీమతి రాజేశ్వరి తన సమస్యను ఆయనతో ప్రస్తావించడం జరిగింది. ఆయనగారన్నారు- "అమ్మా! మా అబ్బాయి కూడా అమెరికాలోనే ఉన్నాడు. వాడికి ఫోను చేసి ఏమైనా ఉపయోగపడగలడేమో ప్రయత్నిస్తాను" అని. వెంటనే ఆయనగారు సెల్‌లో కుమారునితో మాట్లాడాడట. చిత్రమేమంటే ఆయనగారి కుమారుడు శ్రీమతి రాజేశ్వరి కుమారుడుండే ప్రాంతానికి కేవలం ఒక ఫర్లాంగు దూరంలో ఉండడం, తన ఇల్లు విశాలమైనది కావడం, తండ్రి సలహా ప్రకారం శ్రీమతి రాజేశ్వరి కుమారుణ్ణి సామాన్లతో సహా తన ఇంటికి తీసుకురావడం, అద్దె లేకుండా భోజన సౌకర్యంతో తన ఇంట్లో ఉండే ఏర్పాటుచేసి, ఒక గంటలోనే సమాచారం సెక్రటేరియట్‌లో వీరికి అందించాడు. అంతవరకూ ఈ ప్రథమ పరిచయ వ్యక్తి సెక్రటేరియట్‌లో శ్రీమతి రాజేశ్వరికి ఆదుర్దా పడవద్దని ధైర్యం చెబుతూ కూర్చోవటం ఆమెకు అపూర్వమైన అనుభవం. శ్రీమతి రాజేశ్వరిగారి కుమారుడు అమితానందంతో తల్లికి గురువుగారి దయవల్లనే కథ తేలికగా సుఖాంతమైందని చెప్పడం, తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా చేసింది. అంతా శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వాములవారి కృపాకటాక్ష మహిమ!! ఈ కుటుంబం వారి గురుభక్తి వర్ణనాతీతం.



గురుకృపకు ఎల్లలు లేవు కదా! శ్రీచరణులు యతిలోక చక్రవర్తి. దయతో భక్తపాలన నెరపు జగద్గురువులు.

ఇలాంటి సన్నివేశాలు మరెన్నో ఉన్నాయి. మచ్చుతునకలుగా కొన్నిటిని మాత్రమే భక్తకోటికి అందించాను. క్షంతవ్యుడను.

శ్రీచరణుల సన్నిధిలో భక్తులకు కలిగే ఆనందానుభూతి వర్ణనాతీతం. ఇట్టి మహాయోగీంద్రుల అనుగ్రహం వలన కలిగే ఆనందం అనుభవైకవేద్యమే. జగద్గురువులు కరుణా సముద్రులు. విద్వల్లోకతల్లజులు. పరమహంస పరివ్రాజకా చార్యవర్యులు. చుళుకీకృత సర్వశాస్త్ర సముద్రులు. సనాతన ధర్మ ఆచారవిచారదక్షులు. శ్రీ శారదాచంద్రమౌళీశ్వర నిత్య పూజా దురంధరులు. ఉపనిషదర్థాను సంధాననిరతులు. అపర శంకరులైన వీరి నామస్మరణ ధన్యతకు ఉపాయం. ఆసేతు శీతాచల మధ్యస్థ ఆస్తిక లోకమును అనుగ్రహ కటాక్ష వీక్షణాలచే పాలిస్తూ శిష్యవాత్సల్యాన్ని చెలువు తీర్చిన మూర్తులు. శ్రీచరణు లను దర్శించండి. సేవించండి. తరించండి. పున్నమినాటి వెన్నెలసోన శ్రీచరణుల దివ్యకరుణా స్రవంతి.

**- ఆకెళ్ల సత్యనారాయణమూర్తి**

**5వ పేజీ తరువాయి... సంపాదకీయం...**

ప్రభుత్వంలోని ఒక మంత్రి, మరీ ముఖ్యంగా ముఖ్యమంత్రి తనయుడు హిందూమతాన్ని భయంకరమైన వ్యాధులతో పోల్చడమే కాకుండా, దాన్ని సమూలంగా నిర్మూలించాలనే దివ్యోపదేశాన్ని తమ కార్యకర్తలకు వినిపించిన విషయం మనకందరకూ తెలిసిందే. ఈ వ్యాఖ్యల్ని అమిత మాలవీయ అనే ఒక రాజకీయ పక్షపు అధికార ప్రతినిధి రీట్వీట్ చేశాడు. హమ్మా.. మా లౌకికవాదానికే అప్రదిష్టను ఆపాదిస్తావా అంటూ తమిళ ప్రభుత్వం ఆయనపై ఒక కేసు వేసింది. ఆయన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు.

ఆ కేసును విచారించిన న్యాయమూర్తి సనాతన ధర్మంపై ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారనే ఆరోపణలతో భాజపా అధికార ప్రతినిధి అమిత్ మాలవీయపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసింది. ద్వేషపూరిత ప్రసంగాలు చేసే వారిని స్వేచ్ఛగా వదిలేసి, వాటిపై స్పందించేవారు చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కోవాల్సి రావడంపై కోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. అంతేకాదు ఈ కేసును కొనసాగించడం చట్ట ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని పేర్కొంది.

పోలీసులు తమ వాదాన్ని వినిపిస్తూ గాంధీజీ, కామరాజ్ వంటి నాయకులు కూడా సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడారని కాబట్టి ఇలాంటివి తప్పుపట్టాల్సినవి కాదని వితండవాదం చేశారు. న్యాయస్థానం గాంధీలాంటి వారు హైందవంలోని కేవలం అవాంఛనీయ పద్ధతులను మాత్రమే వ్యతిరేకించారని, ఇ.వి. రామస్వామి తప్ప మరెవరూ సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడలేదని కోర్టు స్పష్టం చేసింది.

ప్రభుత్వ అధికారులు రాజకీయాలకు అతీతంగా ఉండాలని, ఒక రాజకీయ పక్షం వైపు నిలబడటం గర్హనీయమని న్యాయస్థానం పేర్కొనడమే కాకుండా, గత 100 ఏళ్లుగా ద్రవిడ కజగం, ద్రవిడ మున్నేట్ర కజగం ద్వారా హిందూమతంపై దాడులు జరుగుతున్నాయని స్పష్టం చేసింది. మంత్రి ప్రసంగంలోని అంతరార్థాన్ని మాలవీయ ప్రశ్నించారని, మంత్రి ప్రసంగం 80 శాతం హిందువులకు వ్యతిరేకంగా ఉందని, అది ద్వేషపూరిత ప్రసంగం కిందకు వస్తుందని న్యాయస్థానం అభిప్రాయపడింది. సనాతనీ అయిన మాలవీయ అటువంటి ద్వేషపూరిత ప్రసంగానికి బాధితుడని, సనాతన ధర్మాన్ని మాత్రమే రక్షించారని పేర్కొంది. మాలవీయ చేసిన పోస్ట్ ద్వారా చట్టాల, నిబంధనల ఉల్లంఘన జరగలేదని, కానీ మంత్రి ప్రసంగం ఆ నిబంధనల పరిధిలోకి వస్తుందని న్యాయస్థానం స్పష్టం చేసింది

ఈ రెండు ఘటనలు హిందువులకు పాఠం చెప్పేవే. క్షణాల మీద రాళ్లు పోగేసి శోభాయాత్రలపై విసిరేటప్పుడు మతాన్ని గుర్తించడానికి ఇష్టపడని ప్రభుత్వాధికారులు ఒక హిందూ ధార్మిక పుణ్యస్నానాల విషయంలో మాత్రం శాంతిభద్రతల పేరిట స్వాములను, అందునా శిష్యులచేత శంకరాచార్యులు సమ్మానింపబడుతున్న ఆచార్యుల శిబిరాలను లేపివేస్తామని విస్పష్టంగా చెప్పే సాహసం చేయగలగుతారనే పాఠాన్ని నేర్పుతుంది.

హిందూ సనాతనాన్ని ప్రబల రోగంగా వర్ణించేవారిని, విద్వేష ప్రసంగాలు చేసే లౌకికవాద పరిరక్షణ ధురంధరుల మాటలు ప్రభుత్వాలకు ఆమోదయోగ్యాలే తప్ప, వాటిని నిరసించడం మాత్రం ఆమోదయోగ్యం కావని, నిందింపబడ్డ, ఆత్మాభిమానం దెబ్బతిన్న హిందువులు, ప్రభుత్వాల అభిప్రాయం ప్రకారం ఎప్పటిలానే నోరుమూసుకుని కూర్చోవాలే తప్ప ప్రతిస్పందించ కూడదని భావిస్తున్నాయనే పాఠాన్ని హిందువులకు నేర్పుతోంది.

ఇక తమిళ ప్రభుత్వం గతంలో కార్తిక దీపోత్సవ విషయంలో హిందూ ధార్మిక భావనలను గౌరవించిన న్యాయమూర్తిని పదవీభ్రష్టుణ్ణి చేయడానికి అభిశంసన తీర్మానీ ప్రతిపాదించిన తమిళ 'లౌకికవాద పరిరక్షకులు'... ఈ మహిళా న్యాయమూర్తి విషయంలో ఎలా ఏం చేస్తారో. అస్తు.



# దర్శనమ్

## ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

## ఫిబ్రవరి FEBRUARY 2026

| | | | | |
|---|---|---|---|---|
| SUN ఆది | 1 | 8 | 15 | 22 |
| MON సోమ | 2 | 9 | 16 | 23 |
| TUE మంగ | 3 | 10 | 17 | 24 |
| WED బుధ | 4 | 11 | 18 | 25 |
| THU గురు | 5 | 12 | 19 | 26 |
| FRI శుక్ర | 6 | 13 | 20 | 27 |
| SAT శని | 7 | 14 | 21 | 28 |

# (సరళ వ్యాఖ్య)

(గత సంచిక తరువాయి)

**293. స్వర్గాపవర్గదా శుద్ధా జపాపుష్ప నిభాకృతిః**

శ్రీమాతని జపా పుష్పం వంటి ఎర్రని వర్ణంతో ఉన్నదిగా భావించి ఉపాసిస్తే స్వర్గాన్ని ఇస్తుంది. శుద్ధమైన తెలుపు వర్ణంతో భావించి ఉపాసిస్తే మోక్షాన్ని ప్రసాదిస్తుంది.

ఈ నామ పారాయణతో స్వర్గసుఖాలు, మోక్షం లభిస్తాయి.

**294. ఓజోవతీ ద్యుతిధరా యజ్ఞరూపా ప్రియవ్రతా**

బ్రహ్మవర్చస్సు అయిన అగ్ని తేజస్సుతో దివ్యమైన కాంతితో ప్రకాశిస్తూ ఉంటుంది శ్రీమాత. యజ్ఞరూపమైన శ్రీమాతకి వ్రతములు అంటే ప్రీతి.

ఈ నామ పారాయణతో కాంతివంతమైన ముఖము లభిస్తుంది.

**295. దురారాధ్యా దురాధర్షా పాటలీ కుసుమ ప్రియా**

చంచల మనస్సు కలవారికి శ్రీమాత అనుగ్రహం సాధ్యం కాదు. గులాబి పువ్వులు అంటే శ్రీమాతకి ఇష్టము.

ఈ నామపారాయణతో కామక్రోధాదులు దూరం అవుతాయి.

**296. మహతీ మేరునిలయా మందార కుసుమ ప్రియా**

లక్షయోజనాలు ఎత్తు కల మేరుపర్వతముపై నివాసము ఉండే మహనీయ శక్తి అయిన శ్రీమాతకి మందార పువ్వులు అంటే ప్రీతి.

ఈ నామపారాయణతో గొప్ప శక్తి లభిస్తుంది.

**297. వీరారాధ్యా విరాడ్రూపా విరజా విశ్వతోముఖీ**

విశ్వమే ముఖముగా కలిగి ఉన్న శ్రీమాతది విరాడ్రూపము. విరజా నదీ రూపంలో ఉండే శ్రీమాత వీరుల చేత ఆరాధింపబడుతుంది.

ఈ నామపారాయణతో వీరగుణం లభిస్తుంది.



**298. ప్రత్యగ్రూపా పరాకాశా ప్రాణదా ప్రాణరూపిణీ**

పరబ్రహ్మ స్వరూపమైన శ్రీమాత అంతరాత్మ యందే దర్శింపదగినది. ప్రతీ జీవిలో ఉండే ప్రాణ శక్తి శ్రీమాతే.

ఈ నామపారాయణతో ఇంద్రియాల పటుత్వం కలుగుతుంది.

**299. మార్తాండభైరవారాధ్యా మంత్రిణీ న్యస్త రాజ్యధూః**



ఆచార్య కుప్పా విజయశ్రీ

సూర్యుడిని మార్తాండభైరవుడు అని అంటారు. అతనిచే ఆరాధింపబడేది శ్రీమాత. రాక్షస సమూహాలను సంహరించే మహాత్రిపుర సుందరికి రాజశ్యామల మంత్రిణి. రాజ్యభారమంతా ఆమె భుజస్కంధాల మీదే ఉంటుంది.

ఈ నామ పారాయణతో పదవులు, అధికారము లభిస్తాయి.

**300. త్రిపురేశీ జయత్సేనా నిస్త్రైగుణ్యా పరాపరా**

త్రిగుణాలకు అతీతమైనది శ్రీమాత. శ్రీ చక్రములో బిందువులో ఉండే పరదేవతకి పరాపర రహస్య యోగిని అని పేరు.

ఈ నామపారాయణతో మోక్షానికి అడ్డంకులైన గుణాలు తొలగిపోతాయి.

**301. సత్యజ్ఞానానందరూపా సామరస్య పరాయణా**

సత్యము, జ్ఞానము, ఆనందముల సామరస్య స్వరూపం శ్రీమాత.

ఈ నామపారాయణతో శివశక్తుల అనుగ్రహం లభిస్తుంది.

**302. కపర్దినీ కళామాలా కామధుక్కామ రూపిణీ**

**303. కళానిధిః కావ్యకళా రసజ్ఞా రసశేవధిః**

శ్రీమాత భక్తుల ఏ రూపంలో ఆరాధిస్తే ఆ ఆరాధించిన రూపంలో కోరికలు తీర్చే కామధేనువు. శివశక్తుల ఐక్యరూపమైన శ్రీమాత జటాజూటధారిణి. సమస్త కళలకు నిధి అయిన శ్రీమాత 64 కళలను మాలగా ధరించింది. కావ్య కళలో ఉండే రసానుభూతి శ్రీమాత. అవధిలేని బ్రహ్మానందరస సముద్రమే శ్రీమాత.

ఈ నామపారాయణతో కవిత్వము, కళలు అబ్బుతాయి.

**304. పుష్టా పురాతనా పూజ్యా పుష్కరా పుష్కరేక్షణా**

ఆనంద రూపిణీ అయిన శ్రీమాత పుష్టా. సృష్టి ప్రారంభానికి ముందు నుంచీ ఉన్నది అయిన శ్రీమాత తామర తంపర వలే అంతటా వ్యాపించి అందరిచే పూజింపబడుతోంది. శ్రీమాత తామర

పూవుల వంటి కన్నులు కలది.

ఈ నామపారాయణతో వంశాభివృద్ధి కలుగుతుంది.

**305. పరంజ్యోతిః పరంధామ పరమాణుః పరాత్పరా**

పరంధామ పీఠంలో వెలిగే పరంజ్యోతి స్వరూపమైన శ్రీమాత సర్వశ్రేష్ఠురాలు. అణువు కన్నా సూక్ష్మమైన పరమాణు రూపంతో అన్నిటా వ్యాపించి ఉంది.

ఈ నామపారాయణతో పరంజ్యోతి స్వరూపమైన శ్రీమాత దర్శనం కలుగుతుంది.

**306. పాశహస్తా పాశహంత్రీ పరమంత్ర విభేదినీ**

పాశమును ధరించిన శ్రీమాత భక్తుల భవపాశాలను, శత్రువుల ప్రయోగాలను ఛేదిస్తుంది.

ఈ నామపారాయణతో శత్రువులు చేసిన ప్రయోగాలు విఫలం అవుతాయి.

**307. మూర్తా-మూర్తా నిత్యతృప్తా మునిమానస హంసికా**

కంటికి కనిపించే వాటిలోనూ, కనిపించని వాటిలోనూ శ్రీమాత ఉంటుంది. అన్ని ఆచారములచే తృప్తినొందే శ్రీమాత మునుల మనస్సనే మానస సరోవరంలో విహరించే హంస.

ఈ నామ పారాయణతో శ్రీమాత భక్తుల మనస్సులలో విహరిస్తుంది.

**308. సత్యవ్రతా సత్యరూపా సర్వాంతర్యామినీ సతీ**

ఎల్లప్పుడూ శివునితో ఉండే శ్రీమాత అందరి అంతఃకరణలలో వ్యాపించి ఉంటుంది. అన్ని యుగాలలో ఉండే సత్యమే శ్రీమాత స్వరూపము, దీక్ష.

ఈ నామపారాయణతో భక్తులకు అభీష్టసిద్ధి కలుగుతుంది.

**309. బ్రహ్మాణీ బ్రహ్మజననీ బహురూపా బుధార్చితా**

బ్రహ్మని కూడా సృష్టించి, శక్తినిచ్చే శ్రీమాత వివిధములైన రూపాలలో పండితులచేత అర్చింపబడుతుంది.

ఈ నామపారాయణతో సదాచారం అలవడుతుంది.

**310. ప్రసవిత్రీ ప్రచండాజ్ఞా ప్రతిష్ఠా ప్రకటాకృతిః**

సృష్టి వేళలో స్థూల రూపంలో ప్రపంచాన్ని ప్రసవించేది శ్రీమాత. చరాచరజగత్తులో అన్నింటిలో శక్తిగా ప్రతిష్ఠితమై ఉంది. కనిపించే ప్రకృతి రూపం శ్రీమాత. మహాప్రళయ కాలాలలో అతిసూక్ష్మ రూపంలో తన ప్రచండమైన ఆజ్ఞ ద్వారా సృష్టి అంతా లయం చేస్తుంది.

ఈ నామపారాయణతో సర్వవిధములైన శత్రు ప్రయోగాలు నశిస్తాయి. (సశేషం)



**గత సంచికలో- శరీరంలో అన్నీ శుభలక్షణాలే ఉన్నా, ఎప్పుడూ అర్జునుడు కష్టాలు పడడానికి కారణమేమిటని ధర్మరాజు అడిగిన ప్రశ్నకు శ్రీకృష్ణుడు ఇచ్చిన సమాధానానికి ధర్మరాజు సంతృప్తి చెందాడు. అక్కడే ఉన్న ద్రౌపది ఆనందంతో కృష్ణుని వైపు చూసింది. ఈలోగా అర్జునుడి దగ్గర నుంచి ఒక దూత వచ్చాడు.**



డా. ఎమ్వీఎస్
సత్యనారాయణ

అర్జునుడి దూత ధర్మరాజునకు నమస్కరించి, "అర్జునుడు ఈ నగరం సమీపించాడు. రేపు సకల శుభాలు కల్గించు మీ పాదపద్మాలకు నమస్కరించడానికి వస్తాడు" అని చెప్పాడు. దూత మాటలు విన్న ధర్మరాజు ఆనందంతో ఆనందబాష్పాలు రాల్చాడు. శరీరంపై గగుర్పాటు్ల పొడచూపాయి. వెంటనే శుభవార్త తెచ్చిన ఆ దూతకు ధర్మరాజు నగలూ, బట్టలూ, బంగారు నాణేలు బహుమానంగా ఇచ్చాడు. అందరూ అర్జునుడి రాక కోసం ఎదురుచూస్తూ ఆ రోజు గడిపారు. తెల్లవారగానే అర్జునుడు ప్రాతః కాల విధులను ముగించుకొని, యజ్ఞాశ్వం వెంటగొని పట్టణంలో ప్రవేశించాడు. అర్జునుణ్ణి, యజ్ఞాశ్వాన్ని చూసి పౌరులందరూ సంతోషంతో ఇలా పలికారు-

"ఈ యజ్ఞాశ్వం స్వేచ్ఛగా సమస్త దేశాలలోనూ తిరిగి వచ్చింది. అక్కడక్కడ కొంతమంది రాజులు ఈ అశ్వాన్ని అడ్డుకున్నారు గాని, అర్జునుడి ధాటికి నిలవలేకపోయారు. వారిని ఎదుర్కొన్నప్పుడు గాని, జయించినప్పుడు గాని అర్జునుడు అన్నగారైన ధర్మరాజు చెప్పినట్లు ఎవరిమీదా కోపం చూపలేదు. ఈవిధంగా దిగ్విజయంగా రావడం అర్జునుడికి తప్ప మరొకరికి సాధ్యపడుతుందా? ఇది వింతగానూ, ఆశ్చర్యంగానూ ఉంది. పూర్వం సగరుడు మొదలైన వీరుల చరిత్ర విన్నాము గాని, ఇలా మానవాతీతమైన బలపరాక్రమాలు మరెవ్వరికైనా ఉన్నాయా? అర్జునుడితో సాటిరాగల వీరులు ఈ ప్రపంచంలో ఇక ముందు పుట్టరు గాక పుట్టరు! మానవ ప్రయత్నమూ, దైవ బలమూ ఒకదానితో ఒకటి పోటీపడి కార్యసాఫల్యం కలిగిస్తూండగా, ధర్మరాజు అఖండానందాన్ని అనుభవిస్తున్నాడు. ఈ అర్జునుడే రాజసమూహం సిగ్గుతో తలవంచుకొనేటట్లు యంత్ర మత్స్యాన్ని పడగొట్టి ద్రౌపదిని పెండ్లాడాడు. అపారమైన బలసంపన్నుడైన దేవేంద్రుడిని ఓడించి, ఖాండవవనాన్ని దహనం చేశాడు. పరమ శివుడితో ద్వంద్వయుద్ధం చేసి, అతణ్ణి మెప్పించి పాశుపతాస్త్రాన్ని పొందాడు. గోగ్రహణ సమయంలో భీష్మాది వీరులను జయించి గోవులను వెనక్కి తీసుకొని వెళ్ళాడు. ప్రొద్దుగుంకక ముందే సైంధవుణ్ణి సంహరిస్తానని భీకర ప్రతిజ్ఞ చేసి మాట నిలబెట్టుకొన్నాడు" అంటూ పౌరులందరూ అర్జునుణ్ణి చుట్టుముట్టి ఆనందించారు.

పౌరజనుల మాటలు వింటున్న అర్జునుడి మనస్సు ఆనందంతో నిండిపోయింది. అతడు నడకల సొగసుతో గుర్రం ముందు నడుస్తుండగా యజ్ఞశాలను చేరుకొన్నాడు. ఆ సమయంలో ధర్మరాజు, భీమాదులు, బలరామకృష్ణులు మొదలగువారు అర్జునుడికి ఎదురుగా వెళ్లి ఆదరంతో పలుకరించారు. అర్జునుడు కూడా వారందరినీ తగినట్లుగా మాట్లాడి సంతోషపజేశాడు. ఆ తరువాత గాంధారినీ, తల్లి కుంతినీ చూశాడు. ఒక రమ్యమైన చోట ఉండిపోయాడు. ఆ సమయంలో రాజలీవీ ఉట్టిపడుతుండగా బభ్రువాహనుడు ఉలూపీ చిత్రాంగదలతో కూడి ధర్మరాజు మందిరానికి చేరుకొన్నాడు. అప్పుడు అక్కడున్న ధర్మరాజు, అతడి తమ్ములూ, బలరామకృష్ణులు మొదలుగా గాల యాదవులంతా ఆనందించారు. అతణ్ణి తగు విధంగా సత్కరించారు. బభ్రువాహనుడు కూడా సమయోచితమైన విధులచే అందరికీ ప్రీతి కల్గించి, గాంధారీ ధృతరాష్ట్రులను దర్శించి నమస్కరించాడు. కుంతీదేవికి పాదాభివందనం చేయగా, ఆమె దీవించి ఆప్యాయతతో కౌగిలించుకొంది.



బభ్రువాహనుడు ధర్మరాజును

పూజించి కూర్చున్నాడు. అప్పుడు ధర్మరాజు, అతని సోదరులు, బలరాముడు, శ్రీకృష్ణుడు మొదలగువారు బభ్రువాహనుడికి నగలు, శ్రేష్ఠమైన వస్త్రాలు ఇచ్చి సత్కరించారు. ఈలోగా ఉలూపీ చిత్రాంగదలు గాంధారిని దర్శించారు. పిమ్మట కుంతిని చేరగా, ఆమె వారలను గొప్ప మన్ననతో దీవించి కౌగలించుకొంది, రత్నకాంతిమయమైన నగలు ఇచ్చింది. తరువాత ఉలూపీ చిత్రాంగదలు ద్రౌపదినీ, సుభద్రను దర్శించగా వారు ఈ ఇరువురినీ తగిన ఆసనముల మీద కూర్చోబెట్టారు. ఆనందంతో సంభాషించారు. ఈవిధంగా అశ్వమేధ యాగ ప్రారంభం అన్నివిధాలా గొప్పది, మనోజ్ఞమైనదీ అయింది. తరువాత యజ్ఞం చేయవలసిన రోజు వచ్చింది. అప్పుడు వ్యాస మునీంద్రుడు వచ్చి "ధర్మరాజా! ఈరోజు యజ్ఞం చేయడానికి శుభముహూర్తం సమీపించిందని ఋత్విక్కులు అంటున్నారు. నీవు చేసే ఈ యజ్ఞం మహనీయమైనది. నీకు చాలా ధనం కూడా చేకూర్చింది. అందుచేత ఋత్విక్కులకు ఇవ్వవలసిన దానికంటె మూడు రెట్లు ఎక్కువగా ఇచ్చి, మూడు యజ్ఞాలు చేసినంత ఫలాన్ని పొందు. యజ్ఞం చివర చేసే అవబృథస్నానం చాలా పవిత్రమైనది. దానితో సమస్త పాపాలు తొలగిపోతాయి. కురుక్షేత్ర యుద్ధంలో దాయాదులను చంపి మహాపాపం చేశాననే బాధ నీ మనస్సులో పుట్టింది. యజ్ఞాంత స్నానంతో అటువంటివన్నీ తొలగిపోతాయి. నీ మనస్సు నిర్మలమవుతుంది. సమస్త శుభాలు కల్గుతాయి" అని చెప్పాడు.

వ్యాసుని ఆశీర్వాదం తీసికొని ధర్మరాజు యాగదీక్ష వహించి, మిక్కిలి కొనియాడదగినట్లుగా అశ్వమేధ యాగ కర్మకాండమునకు పూనుకొన్నాడు. దేని తరువాత ఏది చేయాలో ఆ యజ్ఞకర్మ క్రమంతో కూడినట్టిది, యుక్తమైనదయ్యేటట్లుగా యజ్ఞకార్యముల సముదాయాన్ని బృహస్పతితో సమానులైన ఋత్విక్కులు నడిపారు. అందువల్ల మంత్రపఠన దోషాలు లేకుండా ఆ యజ్ఞం ప్రకాశించింది. ఋత్విజులు మంత్రపూతంగా సోమరసం పిండారు. సవతన ధర్మం ఆచరించారు. వారు పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీకృష్ణుని స్తుతించడంతో తాము చేసే యజ్ఞకార్యాలకు (యజ్ఞోవై విష్ణుః) వన్నె తెచ్చినవారయ్యారు. బహువిధ పదార్థ సమృద్ధి వల్ల తృప్తిపడకుండా భోజనం చేయనివాడు, పుష్కలంగా ధనధాన్య వస్త్రాలను పొంది పేదరికాన్ని తొలగించుకోనివాడు, కోరిన దానిని పొందకుండా వట్టి చేతులతో వెళ్ళే వాడు, తనకు సంభవించిన దుఃఖాన్ని పోగొట్టుకోకుండా వెళ్ళేవాడు ఒక్కడు కూడా లేడంటే ఆశ్చర్యపడనక్కర్లేదు. దేవర్షులు కలిసికట్టుగా గానాలు చేశారు. అప్సరసలు మనోహర నృత్యాలు ప్రదర్శించారు. బ్రహ్మవేత్తలైన బ్రాహ్మణులు శిరస్సున అక్షతలు చల్లుతూ పెక్కు రకాల దీవెనలిచ్చారు. ఋత్విజులు బంగారు



ఇటుకలతో యజ్ఞవేదిని నిర్మించారు. యాజకులు యూపాలకు నాల్గుకాళ్ళు కలిగిన జంతువులనూ, పక్షులనూ మత్స్యాదులనూ కట్టారు. యజ్ఞాశ్వాన్ని ఉత్తమ యూపానికి కట్టారు.

వేదవ్యాసుడు సకలలోకాలకూ శ్రేయస్సును కలుగజేసే ధర్మరాజు అశ్వమేధ యాగాన్ని నిర్వహించి, దీవించాడు. ధర్మరాజు సదస్యులకు మహానందం కలుగునట్లు వేయి కోట్ల టంకాలు దక్షణలుగా ఇచ్చాడు. వేదవ్యాస మహర్షికి తన భూమండల సామ్రాజ్యమంతా సమర్పించాడు. వ్యాసుడు స్వీకరించి "ధర్మరాజా! బ్రాహ్మణ ప్రవృత్తి కల్గిన మేము బంగారం కోరుకుంటాం కాబట్టి ఆ భూమి వెలగా మాకు బంగారాన్ని ఏర్పాటు చేయి" అన్నాడు. ధర్మరాజు కృష్ణుని ఆజ్ఞతో కోటి కోట్లు టంకాలు కుప్పగా పోసి వ్యాసునకు సమర్పించాడు. ధర్మరాజు మిగిలిన బంగారంతో చేసిన యూపాలు మొదలగు సామాగ్రిని బ్రాహ్మణులకు పంచిపెట్టాడు. తరువాత క్షత్రియులకూ, వైశ్యులకూ, శూద్రులకూ, ఇతర జాతులవారికీ, విదేశీయులకూ కోకొల్లలుగా అపార ధనాన్నిచ్చాడు.

సమస్త జనులూ ఈవిధంగా దానాలందుకొని ఆనందం పొందుతూ ధర్మరాజును ప్రశంసిస్తూ తమ తమ నివాసాలకు వెళ్లారు. వ్యాసుడు తన శిష్యులతో అదృశ్యుడయ్యాడు. ధర్మరాజు తాను జయించిన రాజ్యాలను వారికే ఇచ్చివేశాడు. కృష్ణుడికి ఉత్తమోత్తమ వస్తువులతో దేవుడి వలె పూజించి సాగనంపాడు. అందరినీ సాగనంపి మంగళవాద్య ధ్వనులు దిక్కులంతటా నిండగా, స్తోత్ర పాఠాలు ఆనందగానాలు వింటూ ధర్మరాజు స్వగృహప్రవేశం చేశాడు.

# మీ రాశి




**మేషం** (అశ్వని 4 పాదాలు, భరణి 4 పాదాలు, కృత్తిక 1వ పాదం)

ఆర్థిక ఇబ్బందులుండవు. నూతన వస్తు, ఆభరణాలను ఖరీదు చేస్తారు. స్నేహితులను కలుస్తారు. ఇతరులకు మంచి సలహాలు, సూచనలిస్తారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ధైర్యసాహసాలతో కొన్ని పనులు పూర్తిచేస్తారు. శుభవార్తలు వింటారు. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో సమయస్ఫూర్తి అవసరం. నిరుత్సాహంగా కాలం గడుస్తుంది. అపకీర్తి వచ్చే అవకాశముంటుంది. ఇతరులకు అపకారం కలిగించే పనులకు దూరంగా నుండుట మంచిది. పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తే అనారోగ్య బాధలుండవు.




**వృషభం** (కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి 4 పాదాలు, మృగశిర 1,2 పాదాలు)

వృత్తిరీత్యా అనుకూల స్థానచలనం ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. పోట్లాటలకు దూరంగా నుండుట మంచిది. అనారోగ్య బాధలధిగమించుటకు ఔషధ సేవ తప్పదు. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో తొందరపాటు పనికిరాదు. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త పడుట మంచిది. ఆర్థిక ఇబ్బందుల నెదుర్కొంటారు. స్వల్ప అనారోగ్యబాధలుంటాయి. వృత్తి, ఉద్యోగరంగంలో అభివృద్ధి ఉంటుంది. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ప్రయత్నలోపం లేకున్నా పనులు పూర్తిచేసుకోలేక పోతారు.




**మిథునం** (మృగశిర 3,4 పాదాలు, ఆరుద్ర 4 పాదాలు, పునర్వసు 1,2,3 పాదాలు)

స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో సమయస్ఫూర్తి అవసరం. నిరుత్సాహంగా కాలం గడుస్తుంది. అపకీర్తి వచ్చే అవకాశముంటుంది. ఇతరులకు అపకారం కలిగించే పనులకు దూరంగా నుండుట మంచిది. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చినచో అనారోగ్య బాధలుండవు. మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయాన్ని సాధిస్తారు. దైవ దర్శనం చేసుకుంటారు. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకుంటారు. కళలందు ఆసక్తి పెరుగుతుంది. నూతన, వస్తు, వస్త్ర ఆభరణాలను పొందుతారు.




**కర్కాటకం** (పునర్వసు 4వ పాదం, పుష్యమి 4 పాదాలు, ఆశ్లేష 4 పాదాలు)

మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయాన్ని సాధిస్తారు. దైవదర్శనం చేసుకుంటారు. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకుంటారు. కళలందు ఆసక్తి పెరుగుతుంది. నూతన, వస్తు, వస్త్ర ఆభరణాలను పొందుతారు. ధర్మకార్యాలు చేయుటయందు ఆసక్తి పెరుగుతుంది. దైవదర్శనం చేసుకుంటారు. కుటుంబసౌఖ్యముంటుంది. మానసికానందాన్ని అనుభవిస్తారు. పేరుప్రతిష్ఠలు లభిస్తాయి. ఆకస్మిక ధనలాభముంటుంది.



**సింహం** (మఖ 4 పాదాలు, పుబ్బ 4 పాదాలు, ఉత్తర 1వ పాదం)

మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయాన్ని సాధిస్తారు. దైవదర్శనం చేసుకుంటారు. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకుంటారు. కళలందు ఆసక్తి పెరుగుతుంది. నూతన, వస్తు, వస్త్ర ఆభరణాలను పొందుతారు. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశ ముంది. స్థిరాస్తుల విషయంలో మిక్కిలి జాగ్రత్త అవసరం. పక్కదోవ పట్టించేవారి మాటలు వినరాదు. క్రీడాకారులకు, రాజకీయ రంగాల్లోని వారికి మానసికాందోళన తప్పదు. నూతన కార్యాలు వాయిదావేసుకోవడం మంచిది.




**కన్య** (ఉత్తర 2,3,4 పాదాలు, హస్త 4 పాదాలు, చిత్త 1,2 పాదాలు)

ప్రయత్నకార్యాలందు దిగ్విజయాన్ని పొందుతారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబం అంతా సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావడంతో మిక్కిలి ఆనందిస్తారు. కీర్తి, ప్రతిష్ఠలు పొందుతారు. శాశ్వత పనులకు శ్రీకారం చుడతారు. సంతోషంగా కాలం గడుపుతారు. శుభవార్త వింటారు. కుటుంబ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. తోటివారి ప్రశంసలందుకుంటారు. విందులు, వినోదాల్లో పాల్గొనే


అవకాశం ఉంది. ఆర్థికంగా బలపడతారు. స్త్రీలు మనోల్లాసాన్ని పొందెదరు. అన్ని కార్యములందు విజయాన్ని సాధిస్తారు. అంతటా సౌఖ్యాన్ని పొందుతారు. శత్రు బాధలుండవు.

**తుల** (చిత్త 3,4 పాదాలు, స్వాతి 4 పాదాలు, విశాఖ 1,2,3 పాదాలు)




మానసికానందం లభిస్తుంది. గతంలో వాయిదా వేయబడిన పనులు పూర్తవుతాయి. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. వృత్తిరీత్యా అభివృద్ధిని సాధిస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి. కొన్ని జటిలమైన సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. వృత్తిరీత్యా అనుకూల స్థానచలనం ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. పోట్లాటలకు దూరంగా నుండుట మంచిది. అనారోగ్య బాధలధిగమించుటకు ఔషధసేవ తప్పదు. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో తొందరపాటు పనికి రాదు.

**వృశ్చికం** (విశాఖ 4వ పాదం, అనూరాధ 4 పాదాలు, జ్యేష్ఠ 4 పాదాలు)



ఆర్థిక ఇబ్బందులుండవు. నూతన వస్తు, ఆభరణాలను ఖరీదు చేస్తారు. స్నేహితులను కలుస్తారు. ఇతరులకు మంచి సలహాలు, సూచనలిస్తారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ధైర్యసాహసాలతో కొన్ని పనులు పూర్తిచేస్తారు. శుభవార్తలు వింటారు. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో సమయస్ఫూర్తి అవసరం. నిరుత్సాహంగా కాలం గడుస్తుంది. అపకీర్తి వచ్చే అవకాశముం టుంది. ఇతరులకు అపకారం కలిగించే పనులకు దూరంగా నుండుట మంచిది. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చినచో అనారోగ్య బాధలుండవు. క్రొత్తకార్యాలు ప్రారంభిస్తారు.

**ధనుస్సు** (మూల 4 పాదాలు, పూర్వాషాఢ 4 పాదాలు, ఉత్తరాషాఢ 1వ పాదం)




వృత్తిరీత్యా అనుకూల స్థానచలనం ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. పోట్లాటలకు దూరంగా నుండుట మంచిది. అనారోగ్య బాధలధిగమించుటకు ఔషధసేవ తప్పదు. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో తొందరపాటు పనికి రాదు. బంధు, మిత్రులతో విరోధమేర్పడ కుండా జాగ్రత్త పడుట మంచిది. ఆర్థిక ఇబ్బందుల నెదుర్కొంటారు. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. వృత్తి, ఉద్యోగరంగంలో అభివృద్ధి ఉంటుంది. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ప్రయత్నలోపం లేకున్నా పనులు పూర్తిచేసుకోలేక పోతారు.



**మకరం** (ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం 4 పాదాలు, ధనిష్ఠ 1,2 పాదాలు)

స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో సమయస్ఫూర్తి అవసరం. నిరుత్సాహంగా కాలం గడుస్తుంది. అపకీర్తి వచ్చే అవకాశముంటుంది. ఇతరులకు అపకారం కలిగించే పనులకు దూరంగా నుండుట మంచిది. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చినచో అనారోగ్య బాధలుండవు. మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయాన్ని సాధిస్తారు. దైవదర్శనం చేసుకుంటారు. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకుంటారు. కళలందు ఆసక్తి పెరుగుతుంది. నూతన, వస్తు, వస్త్ర ఆభరణాలను పొందుతారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు.

**కుంభం** (ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం 4 పాదాలు, పూర్వాభాద్ర 3 పాదాలు)



ధర్మకార్యాలు చేయుటయందు ఆసక్తి పెరుగుతుంది. దైవదర్శనం చేసుకుంటారు. కుటుంబసౌఖ్యముంటుంది. మానసికానందాన్ని అనుభవిస్తారు. పేరుప్రతిష్ఠలు లభిస్తాయి. ఆకస్మిక ధన లాభముంటుంది. శుభవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకో గలుగుతారు. పిల్లలపట్ల జాగ్రత్తగా నుండుట మంచిది. వృత్తిరీత్యా గౌరవ, మర్యాదలు పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. మనోల్లాసాన్ని పొందుతారు. స్వల్పఅనారోగ్య బాధలుంటాయి. కుటుంబ కలహాలు దూరమవుతాయి. విదేశయాన యత్నాలు ఫలిస్తాయి.

**మీనం** (పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర 4 పాదాలు, రేవతి 4 పాదాలు)



మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయాన్ని సాధిస్తారు. దైవదర్శనం చేసుకుంటారు. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకుంటారు. కళలందు ఆసక్తి పెరుగుతుంది. నూతన, వస్తు, వస్త్ర ఆభరణాలను పొందుతారు. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లో నష్టపోయే అవకాశముంది. కుటుంబంలో మార్పులు కోరుకుంటారు. ఒక మంచి అవకాశాన్ని జార విడుచుకుంటారు. ఆకస్మిక ధననష్టం పట్ల అప్రమత్తంగా నుండుట అవసరం.

**- గౌరీభట్ల రామకృష్ణ శర్మ**

ఆధ్యాత్మిక వార్తా మాస పత్రిక

## పదసంపద-252

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | 3 | 4 | ✡ | 5 | 6 | |
| | ✡ | 7 | | | 8 | | | ✡ |
| 9 | 10 | | | ✡ | 11 | | | ✡ |
| 12 | | | ✡ | 13 | | | ✡ | 14 |
| | ✡ | 15 | 16 | | ✡ | | ✡ | |
| ✡ | 17 | | | | ✡ | 18 | 19 | |
| 20 | | | | ✡ | 21 | ✡ | 22 | |
| | ✡ | 23 | | 24 | | ✡ | 25 | |
| 26 | | | | | ✡ | 27 | | |

పద సంపన్నులు

పేరు ____________________

విలాసం ____________________

____________________

పిన్ ____________ ఫోన్ ____________

# ఆధారాలు

### అడ్డం

1. ఒక పదరూపం ఏర్పడ డానికి మూలరూపం-వ్యావ హారికంగా ఆధారం (5)
5. చెల్లాచెదురైన 'ప్రాపకం'(3)
7. భానువారము మరోలా (6)
9. రసముతో కూడుకున్న (4)
11. అస్సాం లో గౌహతీ వద్ద కొరిక పేరు గల శక్తి (3)
12. అటు నుంచి యతి ప్రాసలున్న కవితా ప్రక్రియ (3)
13. తెలంగాణ మాండలికంలో ఆకాశంలో ఎగిరే లోహవిహంగం (3)
15. దుర్గా పూజల తర్వాత వెంటనే వచ్చే పండుగ (3)
17. వైష్ణవ పరిభాషలో దాస భావముతో నమస్కారము (4)
18. అటునుంచి వచ్చిన జంధ్యాల... శాస్త్రి కరుణ శ్రీ గా విఖ్యాతుడు (3)
20. దేవతలుగ్రాగేదని పేరున్నది చివరతెగింది (4)
22. అట్నుంచి ఒడ్డు (2)
23. నవ్వు ముఖం (4)
25. నక్షత్రం (2)
26. చెల్లాచెదురైన ముద్రాపణము (5)
27. బురదలోపుట్టింది చెదిపోయింది (3)

### నిలువు

1. గుడి, కోట మొదలైన వాటి ప్రహారీలు (5)
2. వైకుంఠ పాళీకి మరొక పేరు (పటములేకుండా) (9)
3. తదియముందుది తడబడి చెదిరింది (3)
4. పాక లాంటిదే.. ఏరువాకలో కొంత (2)
5. తెలివి తక్కువ శిష్యులతో గొప్ప పేరు తెచ్చుకున్న గురువు (6)
6. ప్రముఖమైన (3)
8. విరామ చిహ్నంతో ముగిసే కోరిక గలవాడా!(3)
10. వెంటనే (2)
13. విత్తనము- ఇత్తనం అయినట్లే.. విరామము.. మాండలికంలో..(3)
14. విష్ణు చరణ ధూళి (6)
16. ఓర్పు కలిగిన లక్షణం.. చివరలేదు (5)
17. సంస్కృతంలో భార్యా (2)
19. మిక్కిలి బాధ (4)
20. కృష్ణ సోదరిని పిలుద్దామా! (3)
21. చంద్ర (2)
24. ముఖము (2)

### పదసంపద-251 సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 హి | మ | ✡ | 2 సం | 3 చా | 4 ల | 5 కు | డు | ✡ |
| త | ✡ | 6 వి | స | న | క | ర్ర | ✡ | 7 ప్ర |
| 8 వ | 9 న | దు | ర్గ | ✡ | ప్పో | ✡ | ✡ | తి |
| 10 రి | వ | ✡ | ✡ | 11 గీ | ము | ✡ | 12 ఆ | జ్ఞ |
| ✡ | 13 వ | డు | 14 గు | ✡ | ✡ | 15 ఖా | ది | ✡ |
| 16 సా | ధు | ✡ | 17 వే | 18 సం | ✡ | 19 ఇ | మా | 20 గ |
| 21 క | వు | 22 లు | ✡ | 23 దే | 24 వీ | ✡ | 25 న | రు |
| ల్య | ✡ | 26 క | 27 ల | శ | సం | 28 భ | వు | డు |
| 29 ము | ని | వా | స | ము | ✡ | 30 జ | డు | డు |

### జనవరి నెల విజేతలు

**వనమాల రామలింగాచారి**
ప్రశాంత్‌నగర్, యాదగిరిగుట్ట

**కాశీభట్ల మంజులాదత్తా**
చందానగర్, హైదరాబాద్

**మత్స్యరాజ విజయలక్ష్మి**
సియాటెల్, అమెరికా

**రాయపెద్ది అప్పాశేషశాస్త్రి**
శ్రీనివాస నగర్, ఆదోని

**గుడి చంద్రశేఖర్**
పెద్దశంకరంపేట్, మెదక్ జిల్లా

**కె.వి. కృష్ణశాస్త్రి**
సత్యనారాయణపురం, విజయవాడ

**పద సంపాదకులు : ఎం. దత్తాత్రేయశర్మ**

Edited Printed, Published and Owned by Marumamula Rukmini, Printed at Capital Graphics, 118 Chenoy Trade Centre, Parklane, Secunderabad-500003, Published at 601, Chenoy Trade Centre, Parklane, Secunderabad-500003, Editor: Marumamula Rukmini.















RNI Regd No. APTEL/2005/16209
Date of Publication : 25th of Every Month
Date of Posting : 28th & 29th of Every Month

DARSHANAM
FEBRUARY- 2026

Postal Regd No. HQ/SD/686/2026-2027
WPP NO:PMG/TS/HQR/SC-01/WPP/2026-2027
Licensed to Post Without Prepayment
Posting at R.P.C. - IV Patrika Channel,Nampally,Hyderabad-01



PM Hoist: Double Cage, Hyderabad


PM Hoist: with 12mts Horizontal rebar carrier, Vijayawada


Curved Hoist Bangladesh


Multi Functional Hoist, Nagpur

CMAC

Mechanisation & Automation in Construction
ISO 9001:2015 CERTIFIED COMPANY
AND
CE CERTIFIED COMPANY

Equipments & Solutions for Infrastructure fraternity. Residential, Commercial Infrastructure, Power, Steel, Cement & Industrial Infra

Innovation with safety & Sustainability
Export them as Made in India



MPH - CMAC Bambo with Rebar Carrier, Delhi


Chimney SRP, Mumbai


Pre Cast Panel Movement SRP, Hyd.


Anji Khad Cable Stayed Bridge Project,
Dist.: Reasi, Jammu


PMH at Pump House, Kaleshwaram


Bridge Special SRP at Durgam Cheruvu,
Cable Stayed Bridge, Hyd.

**ConMechAuto Consultants India Pvt Ltd.,**
**Head Office :** # 1-3-183/40/19, 2nd Floor, SBI Colony,
Gandhi Nagar, Hyderabad - 500 080, India.
Tel. No.: + 91- 40 - 2754 1464

**Factories :**
Phase 2, Phase 5, IDA Cherlapally,
Hyderabad - 500 051

For Further Details:
**CONTACT : 9393 111 464**
**Email : sales@cmac.co.in**
**www.cmac.co.in**


*If Undedelivered please return to:*

**DARSHANAM Devotional Magazine,Srirama Siddhanthi Bhavanam, H.No.29-105/4/1**
**Rythu Bazar Road, New Vidyanagar Colony, Neredmet, Secunderabad, 500056**
**Mobile 7013093123, 9441015469** *e mail: darshanameditordesk@gmail.com*



శృంగేరీ జగద్గురువుల ఆశీస్సులతో...
వజ్రోత్సవభారతి - అవధాన సంక్రాంతి
త్రిభాషా మహాసహస్రావధాని బ్రహ్మశ్రీ డా.పద్మిపర్తి పద్మాకర్‌గారి సంచాలకత్వంలో...
'శతావధాన తిలక'
బ్రహ్మశ్రీ ఉప్పలధడియం భరతశర్మగారి
శతావధానం
దర్శనమ్
దర్శనమ్
21 వ.
వార్షికోత్సవమ్


దర్శనమ్
వజ్రోత్సవభారతి - అవధాన సంక్రాంతి
బ్రహ్మశ్రీ ఉప్పలధడియం భరతశర్మగారి
శతావధానం
శ్రీ దేవులపల్లి రామానుజరావు కళామందిరం
తెలంగాణ సారస్వత పరిషత్
బొగ్గులకుంట, భాగ్యనగరం
తేది: 09.01.2026, శుక్రవారం నుండి
తేది: 10.01.2026 , శనివారం వరకు













'శతావధాన తిలక'
బ్రహ్మశ్రీ ఉప్పలధడియం భరతశర్మగారి














'శతావధాన తిలక'
















'శతావధాన తిలక'
బ్రహ్మశ్రీ ఉప్పలధడియం భరత
వజ్రోత్సవభారతి-అవధాన స
త్రిభాషా మహాసహస్రావధాని
సంక్రాంతి




















శ్రీ భారతీ తీర్థ మహా ప్రాంగణం






శ్రీ భారతీ తీర్థ మహా ప్రాంగణం








శ్రీ భారతి తీర్థ మహా ప్రాంగణం


శ్రీ భారతి తీర్థ మహా ప్రాంగణం








శ్రీ భారతీ తీర్థ మహా ప్రాంగణం


శ్రీ భారతీ తీర్థ మహా ప్రాంగణం






శ్రీ భారతీ తీర్థ మహా ప్రాంగణం







దర్శనమ్ 21వ, వార్షికోత్సవమ్

శృంగేరీ జగద్గురువుల దివ్యాశీస్సులతో

# దర్శనమ్

ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక ఆధ్వర్యంలో

శృంగేరీ ఆస్థాన జ్యోతిర్విద్వాంసులు

## బ్రహ్మశ్రీ డా.శంకరమంచి రామకృష్ణశాస్త్రి గారు

విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి

## బ్రహ్మశ్రీ చల్లా శ్రీనివాసశర్మ గార్లకు



## విశిష్టసేవా పురస్కార సత్కారం గండపెండేర ప్రదానోత్సవం



**తేది.28-12-2025,ఆదివారం,సా.5గంటలకు**

**వేదిక: రవీంద్రభారతి,భాగ్యనగరం**

ఈ విశిష్ట కార్యక్రమంలో పలువురు జ్యోతిష పండితులు,
విద్వన్మూర్తులు, ప్రముఖులు పాల్గొంటారు

ఆస్తిక మహాజనులందరికీ సాదర స్వాగతం

మరుమాముల వెంకటరమణశర్మ, సంపాదకులు, దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక




ISSN 2582-2411
దర్శనమ్
ఆధ్యాత్మిక మాసపత్రిక
















మల్లేశ్వరస్వామివార్ల


దర్శనమ్
ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక
ఆధ్వర్యంలో
శృంగేరీ శారదాపీఠం
జగద్గురువుల
దివ్యాశీరనుగ్రహంతో
శృంగేరీ ఆస్థాన జ్యోతిర్విద్వాంసులు
బ్రహ్మశ్రీ డా. శంకరమంచి రామకృష్ణశాస్త్రి గారు


దర్శనమ్
ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక
ఆధ్వర్యంలో
శృంగేరీ శారదాపీఠం
జగద్గురువుల
దివ్యాశీరనుగ్రహంతో
శృంగేరీ ఆస్థాన జ్యోతిర్విద్వాంసులు


దర్శనమ్
ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక
ఆధ్వర్యంలో
శృంగేరీ శారదాపీఠం
జగద్గురువుల
దివ్యాశీరనుగ్రహంతో
21
శృంగేరీ ఆస్థాన జ్యోతిర్విద్వాంసులు
బ్రహ్మశ్రీ డా. శంకరమంచి రామకృష్ణశాస్త్రి గారు


దర్శనమ్
ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక
ఆధ్వర్యంలో
శృంగేరీ శారదాపీఠం
జగద్గురువుల
దివ్యాశీరనుగ్రహంతో
శృంగేరీ ఆస్థాన జ్యోతిర్విద్వాంసులు





దర్శనమ్
ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక
ఆధ్వర్యంలో
శృంగేరీ శారదాపీఠం
జగద్గురువుల
దివ్యాశీరనుగ్రహంతో
శృంగేరీ ఆస్థాన జ్యోతిర్విద్వాంసులు


శృంగేరీ ఆస్థాన జ్యోతిర్విద్వాంసులు


శృంగేరీ ఆస్థాన జ్యోతిర్విద్వాంసులు


ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక
ఆధ్వర్యంలో
శృంగేరీ ఆస్థాన జ్యోతిర్విద్వాంసులు


దర్శనమ్
ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక
ఆధ్వర్యంలో
శృంగేరీ శారదాపీఠం
జగద్గురువుల
దివ్యాశీరనుగ్రహంతో
శృంగేరీ ఆస్థాన జ్యోతిర్విద్వాంసులు


శృంగేరీ ఆస్థాన జ్యోతిర్విద్వాంసులు
బ్రహ్మశ్రీ డా.శంకరమంచి రామకృష్ణశాస్త్రి గారు



